

ంధ్రపత్రిక
సచిత్ర వార ప
4 అణాలు
15-8-56
ANDHRA PATRIKA





"పంచర్!"

—ఫొటో : కె. గోపాలకృష్ణన్.

సంవత్సర చందా
రు. [illegible]-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 50
సంచిక 50
15.8-56

దుర్ముఖ శ్రావణ శుద్ధ దశమి బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం : "చోరీ చోరీ" లో నర్గీస్, రాజకపూర్

సూయజ్‌పై యుద్ధమేఘాలు 3
గీర్వాణ భాషాభ్యాసం—పి. గణపతిశాస్త్రి 5
సుధా - మధూ—దివాకరుని వెంకటేశ్వర్లు 9
పథేర్ పాంచాలీ (సీరియల్)—విభూతిభూషణ్ బెనర్జీ 13
వాడిన మొగ్గ—వి. అనసూయ 20
రిస్టువాచీ—యల్లంరాజు సుందరకేశవరావు 26
సినిమా— 30
అరుణవలయం—ఎడ్గార్ వాలెస్ 36
ఆకూ వక్కా—జి. సత్యారావు 42
వనితాలోకం—ఇల్లిందల సరస్వతీదేవి 43
బుద్ధిబలం—ఉత్పల సత్యనారాయణాచార్య 46
సాగరగర్భంలో సాహసయాత్ర (సీరియల్)—జూల్స్ వెర్న్ 47
వెఱ్ఱి గొల్లవాడు—శింగంపల్లి అప్పారావు 50

సూయజ్‌పై యుద్ధమేఘాలు

సూయజ్ సమస్యపై బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాలు అతి తీవ్ర ధోరణినే అనుసరిస్తున్నవి. ఈజిప్టు అధ్యక్షుడు కల్నల్ నాసర్ హిట్లర్ ముసోలినీలకంటే పరమ నికృష్టుడనీ, మధ్య ప్రాచ్యంలో అరబ్ మహా సామ్రాజ్యాన్ని నిర్మించడానికి పన్నాగాలు పన్నుతున్న నియంత అనీ బ్రిటన్, ఫ్రాన్సులు భావిస్తున్నవి. దాదాపు ఇరవై ఏళ్ళ క్రితం జెకోస్లవాకియాలోని సుడెటాన్ ప్రాంతం విషయంలో నాజీ నియంత హిట్లర్ ఎంత నిరంకుశంగా ప్రవర్తించాడో, ఈనాడు కల్నల్ నాసర్ కూడా సూయజ్ విషయంలో అంతే నిరంకుశంగా ప్రవర్తిస్తున్నాడని విమర్శించడానికి ప్రముఖ బ్రిటిష్ ఫ్రెంచి రాజకీయవేత్తలు, పత్రికలు సంకోచించడంలేదు. ఈ తీవ్ర విమర్శలు, అసందర్భమైన పోలికలు చివరకు ఏ ఘోర పరిణామానికి దారి తీస్తాయో వీరు గ్రహించడం లేదనే చెప్పవలసి వస్తున్నది.

సూయజ్ కాలువను బలప్రయోగం ద్వారా తిరిగి స్వాధీనపరుచుకోడానికి ఒకవైపు ప్రబల సన్నాహాలు సాగిస్తూనే, సంప్రతింపుల ప్రహసనం ఒకటి ప్రదర్శించడానికి బ్రిటన్ ఫ్రాన్సులు ఉద్యమించినవి. సాధారణంగా ఏ క్లిష్ట సమస్యపై ఒక నిర్ణయాన్ని అమలు జరపవలసి వచ్చినా, ముందుగా ఒక సమాలోచనల కొండను కొనసాగించడం బ్రిటిష్ రాజనీతిజ్ఞతలో భాగం. ఈ విధంగా సమాలోచనలు జరిపితే వివిధ రాజ్యాల అభిప్రాయం తమ నిర్ణయానికి అనుకూలంగా రూపొందుతుందని వారి ఉద్దేశం. కాని సూయజ్ సమస్య మీద మాత్రం అవసరమైన సైనిక సన్నాహ నిర్ణయాలన్నిటినీ ముందే చేసుకోవడం తర్వాత అంతర్జాతీయ సమాలోచనలకు ఉపక్రమించడం జరుగుతున్నది.

బ్రిటిషు అమెరికన్, ఫ్రెంచి విదేశాంగ మంత్రులు ముగ్గురూ లండన్‌లో గత వారాంతంలో ఐదురోజులపాటు అత్యవసర సంప్రతింపులు జరిపి చేసిన నిర్ణయం ఇదే. ఈ సంప్రతింపులలో మొదట అమెరికా విదేశాంగ శాఖ ఉపమంత్రి రాబర్ట్ మర్ఫీ పాల్గొన్నా, ఐసెన్‌హోవర్ ఆదేశం ప్రకారం ఆఖరు ఘట్టంలో జాన్ ఫాస్టర్ డలెస్ కూడా వచ్చి పాల్గొన్నాడు. సాహసించి నిర్ణయాలను అమాంతం అమలు జరపడం మంచిది కాదనీ, అంతర్జాతీయ సమావేశం ఒకటి ఏర్పాటు చేయడం అవసరమనీ డలెస్ బ్రిటన్, అమెరికాలకు సలహా ఇచ్చినట్లు, ఆ సలహాను పాటించడానికి రెండు పశ్చిమ రాజ్యాలు అంగీకరించినట్లు త్రైరాజ్య సమాలోచనలు జరుగుతూండగా వచ్చిన వార్తలు తెలియజేసినవి. బ్రిటన్ మనోగత భావాలకు అనుగుణమైన సలహానే డలెస్ ఇచ్చాడని భావించవచ్చు.



సూయజ్ సమస్యపై ఏర్పడిన రగడ నంతనూ లండన్‌లో ఆగస్టు 16న ఇరవైనాల్గు రాజ్యాలు సమావేశమై చర్చించాలని బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు నిర్ణయించినవి. లండన్ సమావేశానికి ఆహ్వానించిన దేశాలు ఇవి:- (1) ఈజిప్టు (2) ఫ్రాన్సు (3) ఇటలీ (4) హాలెండు (5) స్పెయిన్ (6) టర్కీ (7) బ్రిటన్ (8) రష్యా (9) ఆస్ట్రేలియా (10) సింహళం (11) డెన్మార్కు (12) ఇథియోపియా (13) పశ్చిమ జర్మనీ (14) గ్రీస్ (15) భారతదేశం (16) ఇండోనీషియా (17) పర్షియా (18) జపాన్ (19) న్యూజీలెండు (20) నార్వే (21) పాకిస్తాన్ (22) పోర్చుగల్ (23) స్వీడన్ (24) అమెరికా. ఇస్రేల్‌ను సమావేశానికి ఆహ్వానించకపోవడం గమనించవలసిన విషయం.

చర్చల అనంతరం వెలువడిన అధికార ప్రకటనలో మూడురాజ్యాల ప్రతినిధులు కల్నల్ నాసర్ నిర్ణయాన్ని ఖండించడమేగాక, సూయజ్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులెవరూ తమ తమ స్థానాల నుంచి కదలడానికి వీలులేదని ఆదేశించి, వారి ప్రాథమిక హక్కులనే ఈజిప్టు భంగపరిచిందనికూడా విమర్శించారు. సర్వ స్వతంత్ర ప్రతిపత్తిని అనుభవిస్తున్న ఈజిప్టు ప్రభుత్వానికి తమ దేశంలోవున్న ఆస్తిని స్వాధీనపరుచుకునే హక్కు లేకపోలేదని అంటూనే, సూయజ్ ప్రపంచంలోని వివిధ రాజ్యాల నౌకాయానానికి ఉపయోగపడే రహదారి కాబట్టి, సూయజ్ కంపెనీ అంతరాతీయ సంస్థ కాబట్టి దీన్ని జాతీయం చేసే అధికారం ఈజిప్టుకు లేదని చర్చల అనంతరం వెలువడిన అధికార ప్రకటనలో బ్రిటన్ అమెరికా ఫ్రాన్సులు స్పష్టీకరించినవి. సూయజ్ కంపెనీ అంతర్జాతీయ ప్రతిపత్తిని ఇటీవల 1954 జులైలో బ్రిటనుతో చేసుకున్న ఒప్పందంలో కూడా ఈజిప్టు అంగీకరించిందనీ, 1888 లో జరిగిన ఒప్పందానికి నాసర్ ప్రభుత్వం కట్టుబడి వుండకతప్పదనీ వాదించినవి. ఇంతేకాక ఈ మూడు రాజ్యాల చర్చల పర్యవసానంగా 99 ఏళ్ళ కౌలుగడువు తీరిపోయిన తర్వాత 1968 లో కూడా సూయజ్ కాలువను స్వాధీనపరుచుకునే హక్కు ఈజిప్టుకు లేదనే వాదనను బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా ప్రభుత్వాలు లేవదీసినవన్నమాట. మరొక పన్నెండేళ్ళకైనా సూయజ్ వ్యవహారం కిష్టసమస్యగా తయారయేదేనని పశ్చిమ అగ్రరాజ్యాల ధోరణివల్ల స్పష్టపడుతున్నది. ఈ పరిస్థితులలో వ్యవహారాన్ని ఈజిప్టు ఇప్పుడు పరిష్కరించుకోడానికి ప్రయత్నించడమే మంచిదేమోననిపించకమానదు.

ఇరవైనాల్గు రాజ్యాలలో ఏదివచ్చినా, ఏది రాకపోయినా లండన్‌లో రేపు 16వ తేదీన అంతర్జాతీయ సమావేశం జరిగి తీరుతుందనీ, ఈజిప్టు హాజరుకానిపక్షంలో సమావేశ నిర్ణయాలను దానికి తెలియజేయడమవుతుందనీ బ్రిటిష్ అధికారులు అంటున్నారు.

ఒకవైపు సైనిక బలాలను ప్రయోగిస్తామని హెచ్చరిక చేస్తూ, మరొకవైపు ఆర్థికంగా సర్వవిధాలా ఒత్తిడి తెస్తూ ఈజిప్టును లొంగదీయడానికి పశ్చిమ అగ్రరాజ్యాలు ఎత్తులు వేస్తున్నవని బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికా విదేశాంగ మంత్రుల సంయుక్త ప్రకటనను కల్నల్ నాసర్ రాజకీయ సలహాదారు అలీసబ్రీ ఖండించాడు. పశ్చిమ రాజ్యాల ఆరోపణలలో ప్రతిదానికీ తగిన సమాధానం

★ సూయజ్‌పై యుద్ధమేఘాలు ★

చెప్పాడు. 1968 అనంతరం కూడా కాలువను ఈజిప్టుకు స్వాధీనపరిచే ఉద్దేశం వీరికి లేదని తేలిందనీ, సూయజ్ కంపెనీ ఈజిప్టులో రిజస్టరయిందనే విషయాన్నే వీరు విస్మరిస్తున్నారనీ, 1954 ఒప్పందంలో సైతం సూయజ్ కాలువ ఈజిప్టుదేనన్న అంశాన్ని బ్రిటన్ గుర్తించిందనే విషయాన్ని కూడా త్రోసిరాజంటున్నారనీ, కంపెనీ ఉద్యోగుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగలేదనీ ఇతడు ఎదురువాదన చేశాడు. సూయజ్ కాలువలో అంతర్జాతీయ నౌకాయాన స్వాతంత్ర్యానికి ఏ విధమైన భంగమూ కలుగకుండా ఈజిప్టు చూస్తున్నదనీ, ఇక మీద కూడా చూస్తుందనీ మరొకసారి హామీ ఇచ్చాడు.

"మా బొందిలో ఊపిరి వున్నంతవరకూ సూయజ్ కాలువను రక్షించి తీరుతాం; సామ్రాజ్యవాదంలోనూ, సామ్రాజ్యవాదులలోనూ వున్న కపట నాటకాన్ని మా చర్య బయటపెట్టింది. అక్రమ ఆక్రమణ సాగించే దగాకోరులను, రహదారులను కొల్లగొట్టి బ్రతికే బందిపోటుదారులను మా దరిదాపులకైనా రానివ్వం," అని కల్నల్ నాసర్ ఈజిప్షన్ యువకుల సభలో ప్రసంగిస్తూ హెచ్చరిక చేశాడు. మాతృదేశ రక్షణకై జరిపే ధర్మయుద్ధంలో ఈజిప్టు పౌరులు ప్రాణాలకు తెగించి అయినా పోరాడాలని ఇతర ప్రముఖులు ప్రబోధిస్తున్నారు.

ఏ అవాంతరం సంభవించినా ఎదుర్కోడానికి ఈజిప్టు తయారవుతున్నది. రిజర్వ్ సేనలు సాధ్యమైనంత త్వరలో తమ తమ దళాలలో చేరిపోవాలని ఉత్తర్వులిచ్చినట్లు కైరో అధికారవర్గాల ప్రకటనలవల్ల తెలుస్తున్నది. విమానదాడుల నుంచి ప్రజలను రక్షించడానికి కావలసిన ఏర్పాట్లను, ప్రచారాన్ని సాగిస్తున్నారు. మొత్తం మీద యుద్ధం అనివార్యమనే ధోరణిలోనే ఈజిప్టు సిద్ధపడుతున్నది. ఈజిప్టుకు మిగతా అరబ్ రాజ్యాల అండదండలు కూడా లభ్యమవుతున్నవి. సూయజ్ సమస్యపై పోరాడడానికి సిరియా సర్వదా సిద్ధపడేవున్నదని వాషింగ్టన్‌లోని సిరియన్ రాయబారి డా॥ ఫరీద్ జైనెద్దీన్ ప్రకటించాడు; తమ దేశం సైనిక సమీకరణ ప్రారంభించిందనీ, అవసరమైతే గెరిల్లాయుద్ధం సాగిస్తామనీ అన్నాడు.

ఇది ఇలావుండగా బ్రిటన్, ఫ్రాన్సులు కూడా కయ్యానికి కాలుదువ్వుతున్నట్లే వాటి ప్రయత్నాలవల్ల, ప్రకటనలవల్ల స్పష్టపడుతున్నది. ఏ క్షణంలో నైనా సూయజ్ కాలువ ప్రాంతంపై విరుచుకుపడడానికి వీలుగా బ్రిటన్, ఫ్రాన్సులు తమ యుద్ధ నౌకలను, విమానవాహక నౌకలను, ఆరితేరిన సైనిక వైమానిక దళాలను మధ్యధరాసముద్ర తూర్పు భాగానికి తరలిస్తున్నవి. థిసియస్ అనే విమానవాహక నౌక పారాషూట్ దళాలతో బ్రిటిష్ రేవునుంచి మధ్యధరాప్రాంతానికి ప్రయాణమై వెళ్లింది. 'ఓషన్' అనే మరొక విమానవాహక నౌకకు ఆయుధసామగ్రి ఎత్తుతున్నారు. ఇది మధ్యధరాకు వెళ్ళేదే. తూర్పు మధ్యధరాలో అవసర సైనిక కార్యకలాపం నిమిత్తం ప్రత్యేక రిజర్వుదళాలను సమీకరించాలని బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ఆజ్ఞాపించింది. బ్రిటన్ ఈజిప్టుకు ఆయుధసామగ్రి సప్లయి చేయడం నిలిపివేయడమేగాక, ఈజిప్షన్ నౌకలద్వారా లెబనాన్‌కు ఆయుధాలు పంపడంకూడా మానివేసింది. ఇంతేగాక, ఈజిప్టులోవున్న బ్రిటిష్ పౌరులు స్వదేశానికి వచ్చివేయాలని బ్రిటిష్ ప్రభుత్వం ఆదేశించింది. దాదాపు 17 వేలమంది బ్రిటిష్ పౌరులు అక్కడ వున్నారు. పరిస్థితి శాంతంగా వున్నప్పుడే ఖాళీ చేయడం మంచిదని బ్రిటిష్ విదేశాంగశాఖ వారికి సలహా ఇచ్చింది. ఫ్రాన్సు కూడా ఇదే ధోరణిని అనుసరించి తన నౌకా విమాన సైనిక బలాలను సమాయత్తపరుస్తున్నది.

సూయజ్ ప్రమాదాన్ని, దాన్ని ఎదుర్కోడానికి తాము సాగిస్తున్న సన్నాహాలనూ కామన్సు సభలో వివరిస్తూ బ్రిటిష్ ప్రధాని సర్ ఆంథొనీ ఈడెన్, కల్నల్ నాసర్ పాత వాగ్దానాలను ఖాతరుచేసే మనిషి కాడనీ, అనేక పాత ఒప్పందాలను భంగపరిచాడనీ, 1888 నాటి ఒప్పందానికి కూడా ఇదేగతి పట్టిందనీ, దీన్నిబట్టి ఈజిప్టులో బ్రిటన్ ఏవిధమైన ప్రభుత్వంతో వ్యవహరించవలసి వస్తున్నదో సభ్యులు గ్రహించవచ్చుననీ వ్యాఖ్యానించాడు. అమెరికా విదేశాంగ మంత్రి డలెస్ సూయజ్ కాలువమీద వచ్చే అంతర్జాతీయ ఆదాయాన్ని ఈజిప్టు విపరీతమైన స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని చూస్తున్నదన్నాడు. అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ కూడా ఇదే విధంగా విమర్శించారు. సూయజ్ విషయంలో ఈ విధంగా వాదిస్తున్న అమెరికన్ నాయకులను మరి పెనామా కాలువ మాటేమిటని ఎదురు ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకపోతున్నారు.

1888 అక్టోబరు 29న బ్రిటన్ ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, రష్యా, ఆస్ట్రియా, హంగరీ, స్పెయిన్, హాలెండు, బెల్జియం, డెన్మార్క్, లక్సెంబర్, టర్కీ రాజ్యాలు చేసుకున్న సూయజ్ ఒప్పందంలోని ముఖ్యమైన షరతులు ఇవి:

శాంతి, యుద్ధ సమయాలలో దేశ వివక్షత ఏ మాత్రం పాటించకుండా ఏ వర్తక నావనైనా కాలువలో పోనివ్వాలి; ఒప్పందంమీద సంతకాలు చేసిన దేశాలు కాలువను నిరభ్యంతరంగా ఉపయోగించుకోవచ్చు. కాలువమీద వాణిజ్య దిగ్బంధాన్ని ప్రయోగించకూడదు. సూయజ్‌కు సంబంధించిన మంచినీటి కాలువ విషయంలో కూడా ఎవరూ జోక్యం కలిగించుకోకూడదు. కాలువమీద అమర్చిన యంత్రసామగ్రిని కదిలించకూడదు. కాలువకు, దాని రేవులకు మూడు మైళ్ళ లోపల ఏ విధమైన యుద్ధ చర్యలుగాని, అత్యాచారాలుగాని జరుపకూడదు. (టర్కీకి కూడా ఇది వర్తిస్తుంది) సేనలను, యుద్ధ సామగ్రిని కాలువలోనూ దాని రేవులలోనూ దించకూడదు. ఏదైనా అవరోధం ఏర్పడితే, ఒప్పందంలో చేరిన రాజ్యాల ప్రతినిధులు వెంటనే సమావేశమై, ఈజిప్టుకు తెలియజేసి, ప్రతిక్రియలను తమకు తామె ఆలోచించాలి. సమావేశాలకు టర్కీ ప్రతినిధి అధ్యక్షత వహించాలి. టర్కీ హాజరుకాని పక్షంలో ఈజిప్టు అధ్యక్షత వహిస్తుంది. (అప్పుడు

(55-వ పేజీ చూడండి)

గీర్వాణ భాషాభ్యాసం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

(గత సంచిక తరువాయి)

౧౨

మలయవతీదేవి పుట్టినింటికి వెళ్ళి అప్పుడే ఆరుమాసాలకాలం గడిచిపోయింది. భరుకచ్ఛ దేశాధిపతి ఆమె జనకుడు. ఆ రోజుల్లో భరుకచ్ఛం ఆంధ్ర సాతవాహన చక్రవర్తులకు లోబడిన రాజ్యమే. మలయవతీదేవికి సహజంగా సంక్రమించిన పట్టమహిషీ గౌరవం మరొకరికి సంక్రమించినదన్నవార్త చెవినిపడగానే ఆమెవైపు రాజబంధువులందరికీ లోలోపల కావేషీలు రాజుకొన్నాయి. అయినా సాతవాహన చక్రవర్తి కెదటనిలబడి అది అన్యాయమని చెప్పడానికెవరికీ సాహసం కలుగలేదు.

ఆ కావేషీలు రాజుకొంటున్న విషయం చల్లచల్లగా సాతవాహన చక్రవర్తి చెవిని పడింది. అదీగాక మలయవతీదేవి అలాగ పుట్టినింటికి వెళ్లి అంతకాలమయినా తిరిగి రాకపోవడం చక్రవర్తికి బొత్తిగా రుచించలేదు. పైగా జ్యేష్ఠకుమారుడు రుగ్నతతో తీసుకొంటున్న సమయంలోనే ఆమె అలాగ హఠాత్తుగా వెళ్ళిపోవడం అతనికి మరింత బాధకలిగించింది. ఆ పసివాణ్ణి ఒకసారి కళ్లారాచూస్తే తప్ప అతనికిక కంటికి కునుకు పటలేదు.

గుణాఢ్యుని అరణ్యగమనంకూడా మలయవతీదేవి పుట్టింటికి వెళిపోవడానికి కొంతవరకు కారణమే. మహామాత్యుని తాతతండ్రులు భరుకచ్ఛదేశంలో అంతటా మహావేదవిద్వాంసులని ప్రసిద్ధికెక్కారు. గుణాఢ్యుడాంధ్ర సాతవాహన సామ్రాజ్యానికి మహామాత్యుడైన తరవాతనే మలయవతీదేవి వివాహం జరిగింది. ఆ వివాహం ఎక్కువగా గుణాఢ్యుని ప్రోద్బలం వల్లనే సాధ్యపడింది. అదీగాక గుణాఢ్యుడు ప్రతిష్ఠాన నగరానికి రాకపూర్వం భరుకచ్ఛ దేశాధీశుల కొలువులో కొంతకాలంపాటమాత్యాధికారం చేపట్టి వారి మన్ననలందుకొన్నాడు.

అందుచేత మలయవతీదేవి గుణాఢ్యుని వనగమనవార్త వినగానే ఒక్కనిట్టూర్పు విడిచిపెట్టింది:

"చిరకాలంనించీ ప్రభువులమన్ననలందుకొన్న గుణాఢ్యులంతటివారికే ఈ ప్రతిష్ఠాన నగరంతో ఋణం తీరిపోయిన తరవాత నావంటివారి కిక విలవేముంది?"

అని సేవంతికతో చెప్పి అమరునాడే ఏదో మిషమీద పుట్టింటికి వెళ్లిపోయింది. ఎంతకాలానికీ ఆమె తిరిగి రాకపోయేసరికి సేవంతిక చక్రవర్తితో ఆ విషయం విన్నవించి మలయవతీదేవి పుట్టింటికి వెళ్లిపోవడాని కది కూడా ఒక ముఖ్యకారణమే అని నొక్కిచెప్పింది.

చక్రవర్తికా విషమ సమస్యలో గుణాఢ్యామాత్యుడు ప్రతిష్ఠాన నగరానికి వచ్చివేయడం అత్యావశ్యకమని అనిపించింది. కాని ఆయన మళ్ళీ ప్రతిష్ఠాన నగరానికి వచ్చే మార్గమేమీ గోచరించలేదు. తిరిగీ ఆయనకు మహామాత్య పదవి అప్పగింతపెటడం చక్రవర్తికేమీ రుచించలేదు. అయినా గుణాఢ్యుని పునరాగమనం ప్రస్తుత విషమ సమస్యలో అత్యంతావశ్యకమై కూర్చుంది. ఆయన ప్రతిష్ఠాననగరానికి మరలివచ్చే పక్షంలో మలయవతీదేవికూడా మళ్ళీ ప్రతిష్ఠాన నగరానికి చేరుకోవచ్చును. అంతేకాక దానివలన హాలసాతవాహన చక్రవర్తి రాజ్యకాలంలో గుణాఢ్యునివంటి మహాకవి అడవులుపట్టి పోయాడనే అపకీర్తి కూడా తొలగిపోతుంది. ఆయా కారణాలన్నిటివల్ల హాలసాతవాహన చక్రవర్తి హృదయంలో ఎలాగైనా తిరిగీ గుణాఢ్యుని ప్రతిష్ఠాన నగరానికి రప్పించవలెననే సంకల్పం బయలుదేరింది. మలయవతి రాక ఆలస్యమయినకొద్దీ గుణాఢ్యుని ప్రతిష్ఠ దిగ్దిగంతాలలో వ్యాపించినకొద్దీ ఆ సంకల్పం మరింత బలపడింది.

అదేసమయంలో నందివర్మ ప్రతిష్ఠాన నగరానికి రావడం జరిగిందిగాని రాజద్వార ప్రతీహారులతనిని సింహద్వారానికి సమీపానికికూడా చేరనీయలేదు. విదూషకుడు విశ్వంభరశర్మకు చక్రవర్తి హృదయసంకల్పం కొంచెం సూచనగా తెలిసింది. అయితే చక్రవర్తి ఆ విషయం శర్వవర్మామాత్యునితో సంప్రతించలేదు. ఆ విషయం కూడా విదూషకు డెరుగును. కనకనే నందివర్మతో అతడంత ధైర్యంగా మాట్లాడడం జరిగింది.

నందివర్మ వింధ్యాటవికి వెళ్ళిపోయిన మరునాటి ఉదయమే విదూషకుడు చక్రవర్తి సన్నిధికి వెళ్లాడు. జ్యేష్ఠకుమారుని గురించీ మలయవతిని గురించీ అనేకవిధాలుగా మథనపడుతున్న చక్రవర్తి కతనిరాకతో ముఖం కొంచెం వికసించింది. చక్రవర్తి విదూషకునివైపు కొంచెం ప్రశ్నార్థకంగా చూచాడు:

"ఇకముందు మావంటి అల్పులకు తమదర్శనం కూడా లభించదేమోనని భయంపట్టుకుంది. అందుకనే అమాత్యులు రాకపూర్వమే తమ దర్శనం చేసుకొనిపోదామని వచ్చాను!" అన్నాడు విదూషకుడొక నవ్వు నవ్వి ఆ విధంగా చక్రవర్తితో అతిచనువుగా మాట్లాడేఅధికారం విశ్వంభరశర్మకొక్కడికే కద్దు.

చక్రవర్తి పక్కుమని ఒక్క నవ్వు నవ్వాడు.

"నీవుకూడా నన్నే నిందిస్తున్నావూ? సరే కానీ!"

"తమరిని కాక మరెవరిని నిందించమన్నారు! అడవులుపట్టి పోయిన మహామాత్యుల అంతేవాసి నందివర్మ ద్వారం దగ్గర పడిగాపులు పడి కూర్చున్నా తమ దర్శనమైనా లభించలేదట!"

ఆ మాట విని చక్రవర్తి నిలువునా నిర్ఘాంతపోయాడు:

"నాకేమీ తెలియనే తెలియదే!"

"నేనూ అదే అనుకొన్నాను!" అని విదూషకుడొక్కమారుగా విరగబడి నవ్వాడు.

"పోనీ శర్వవర్మామాత్యులైనా తమతో నందివర్మవిషయం విన్నవించలేదా?"

★ గీర్వాణ భాషాభ్యాసం ★

"నిన్ననే వారితో ఏవేవో విషయాలు సంప్రతించాము. వారి విషయమే ఎత్తుకోలేదే!"

విదూషకుడు మళ్ళీ విరగబడి నవ్వాడు:

"అందుకనే మనవి చేసుకొన్నాను! అస్మదాదుల కిక తమదర్శనం కూడా లభించదేమో నని!"

చక్రవర్తి ఆ విషయం అంతా సవిస్తరంగా వివరించి చెప్పవలసిందని అడిగాడు. శర్వవర్మ నందివర్మకు, తనకు మధ్యన నడిచిన వ్యవహారం అంతా వరసగా తు.చ తప్పకుండా ఏకరువు పెట్టాడు. శర్వవర్మ చేసిన మోసం అంతా చక్రవర్తి కొక్క క్షణంలో అవగాహన అయిపోయింది. అత డావిధంగా మోసగించడానికి కారణం కూడా మంచు విడిపోయి నట్టు విడిపోయింది.

చక్రవర్తి వినువెంటనే ప్రతిహారిని పిలిచి వెంటనే శర్మవర్మామాత్యులను వెంటబెట్టుకుని రావలసిందని ఆజ్ఞాపించాడు. అతడు వచ్చేవరకు అలాగే గంభీరంగా ప్రతీక్షిస్తూ కూర్చున్నాడు. శర్వవర్మకు నిలుచున్న పాటుగా చక్రవర్తి పిలిపించడానికి గల కారణమేమో బోధపడలేదు. అందుచేత కంగారుపడుతూ చక్రవర్తి కెదురుగా వచ్చి నిలుచున్నాడు. చక్రవర్తి మంత్రిని చూచి కూర్చోమని కూడా అనలేదు:

"ఈ గుణాఢ్యామాత్యులరణ్యానికి వెళ్లినప్పటినించీ నాకు తిన్నగా నిద్ర కూడా పట్టడం లేదు!" అన్నాడు.

చక్రవర్తి ఆవిధంగా ప్రసంగించడానికి కారణమేమీ శర్వవర్మకు తెలియలేదు. అలాగే తెల్లబోయి నిలుచున్నాడు.

చక్రవర్తి మళ్లీ అందుకొన్నాడు:

"మీరు వెంటనే బయలుదేరివెళ్లి గుణాఢ్యామాత్యులెలాగైనా తిరిగీ మహామాత్య భారం స్వీకరించేటట్టు చెయ్యాలి!"

ఆ మాటతో శర్వవర్మ తలపై ఒక పెద్ద పిడుగు పడ్డట్టయింది! ఆ పరిస్థితిలో సార్వభౌముని మాటకెదురాడడానికతనికి సాహసం కలగలేదు! కనక నెమ్మదిగా నీళ్లు నమిలాడు:

"చిత్తం అలాగే! అయితే వారిప్పుడు తిరిగీ ఇక్కడికి వస్తారా అని—"

"ఎలాగైనా సరే! మీరు వారి నిక్కడికి తోడుకునివచ్చి తీరాలి!" అని గర్జించాడు చక్రవర్తి.

శర్మవర్మ కిక నీళ్లు నమలడంవల్ల లాభం లేదని అనిపించింది:

"అలాగే తోడుకువస్తాను గాని అంత నిలుచున్నపాటుగా వారినిక్కడికి తోడుకురావలిసినంత అవసరం ఏమి వచ్చిందీ!" అని నూటిగా అడిగాడు.

"అది మీ. కనవసరం!" అని తిరిగీ గర్జించాడు చక్రవర్తి. తరవాత కొంత తమాయించుకొన్నాడు: "గుణాఢ్య మాత్యులను అడవులపాలు చేశావనీ, పట్టపురాణిని కట్టుబట్టలతో పుట్టింటికి పంపించి వేశావనీ లోకమంతా నన్ననరానిమాట లంటున్నారు! నేనెంతటి అప్రతిష్ఠపాలై పోయానో మీకేమి తెలుసు!" అన్నాడలాగే రుసరుసలాడుతూ.

"దాసుల తప్పిదాలు ధర్మప్రభువులకంటగడుతుందీ పామరలోకం!" అని విదూషకుడింకొక సమిధ వేశాడు.

ఆ మాటతో శర్మవర్మా మాత్యునికిక ఊపిరే ఆడలేదు. ఒకమారు దురుసుగా విదూషకునికేసి చూచి నెమ్మదిగా విన్నవించుకొన్నాడు: "తమ ఆజ్ఞ ప్రకారం నేడే వింధ్యాటవికి వెళ్ళిపోతాను. కాయకష్టులా కాళ్లా వేళ్లా పడి వారిని ప్రార్థిస్తాను. అయితే మరి వారు నా మాట మన్నిస్తారో మన్నించరో అని మాత్రం భయపడుతున్నాను!"

"మీరు స్వయంగా వెళ్లి ప్రార్థిస్తే మీ ప్రార్థన అంగీకరించి తీరతారు. కావలిస్తే విశ్వంభర శర్మను కూడా వెంటబెట్టుకుని వెళ్ళండి. ఏమి చేసినా సరే! వారినిక్కడికి తోడుకువచ్చి తీరాలి! తెలిసిందా!"

అని చక్రవర్తి సింహాసనందిగి వెంటనే తన అభ్యంతర మందిరంలోనికి వెళ్ళిపోయాడు:

శర్మవర్మామాత్యునికీ భీభత్సంతో ఒక్కసారిగా తలకొట్టి వేసినట్టయింది. చక్రవర్తి ఆ విధంగా దురుసుగా ప్రసంగించడం అతడిదివరకెన్నడూ చవి చూడలేదు! అందులోను విదూషకుని సమక్షంలో ఆ విధంగా పరిచారకుని కాజ్ఞాపించినట్లాజ్ఞాపించడం అతనికి మరింత తలవంపయింది. చక్రవర్తి అక్కడనించి వెళ్లిపోయినదాకా అతడు దించినతల ఇక మళ్లీ ఎత్తనేలేదు. ఆతరవాత కొంతసేపటివరకు అలాగే తలవంచుకొని కూర్చున్నాడు. తరవాత తలఎత్తి విదూషకుని వైపు చూచాడు. అతనిని చూచిన తరవాత మళ్ళీ అతనికింకొకమారు తలకొట్టి వేసినట్లయింది!

చక్రవర్తి అభ్యంతర మందిరంలోనికి వెళ్లిపోగానే విదూషకుడు విశ్వంభర శర్మ పొట్ట చేత్తో పట్టుకుని కడుపు చెక్కలయ్యేటట్టు విరగబడి నవ్వుతున్నాడు!

౧౩

అటుపిమ్మట వినువెంటనే శర్వవర్మ తన భవంతికి చేరుకొన్నాడు. ఆనాటి చక్రవర్తి క్రోధావేశం తలుచుకొన్నకొద్దీ అతని హృదయం దహించుకుపోయింది. హఠాత్తుగా చక్రవర్తికంతటి క్రోధావేశం కలగడానికి కారణమేమో అతనికి బోధపడలేదు. పరిచారికలను కొందరిని పిలిపించి అంతఃపురంలో ఇటీవల జరిగిన విశేషాలన్నీ చాలా వరకవగాహన చేసుకొన్నాడు. అయినా చక్రవర్తి కతనిపై అంతటి ఆగ్రహం కలగడానికి కారణమేమో అతనికి తెలియలేదు.

కాని అంతమాత్రంచేత శర్వవర్మ కంగారు పడిపోలేదు. చక్రవర్తి క్రోధానికి అజ్ఞేయ

మైన కారణమేదో ఉండి తీరాలనీ క్రమ క్రమంగా అది తెలియక పోదనీ అనుకొన్నాడు.

విదూషకుడంతగా విరగబడినవ్వడం అతనికి మరింత యాతన కలిగించింది. ఆ అజ్ఞేయమైన రహస్యమేదో విదూషకునికి తెలిసి ఉండవచ్చునని అతనికి కొంచెం అనుమానం కలిగింది. ఏమైనా తానేమీ తొందరపడి పోకూడదనీ చక్రవర్తి ప్రసన్నంగా ఉన్నప్పుడింకొకమారాయన దర్శనం చేసుకోవడం మంచిదనీ అనుకొన్నాడు.

గుణాఢ్యుడు తిరిగివచ్చి మహామాత్యాధికారం స్వీకరించేపక్షంలో తన మహాప్రాభవానికిక తిలోదకాలే శరణ్యమనీ అంతకంటె వేరే గత్యంతరమేమీ లేదనీ నిశ్చయించుకొన్నాడు. అయితే గుణాఢ్యుడు తిరిగి వచ్చి మహామాత్యాధికారం స్వీకరిస్తాడా?

ఎలాగైనాసరే ఆ విషయంలో శాయశక్తులా ప్రయత్నించి తీరవలసిందేనని చక్రవర్తి అతికఠినంగా ఆజ్ఞాపించాడు. ఒకవేళ గుణాఢ్యుడు తిరిగి రాకపోతేనో!

ఏమైనా చక్రవర్తి దురాగ్రహానికి శర్వవర్మ గురికావలసిందే!

శర్వవర్మామాత్యునికదంతా ముంగునోయ్యి వెనక నుయ్యి మాదిరిగా కనబడింది అయినా అతిడంతమాత్రం చేత బెదిరిపోకుండా తిరిగి ఇంకొకమారు చక్రవర్తి సన్నిధికి వెళ్ళి గుణాఢ్యుని సందర్శించడానికి బయలుదేరుతున్నానని అన్నాడు. తన కర్తవ్యంలోగల కష్టసుఖాలన్నీ చక్రవర్తికింకొకమారు విన్నవించుకొన్నాడు. శర్వవర్మ అదృష్టవశాత్తు ఆనాడు చక్రవర్తి ముఖంలో కొంచెం ప్రసన్నభావం ప్రత్యక్షమైంది. అయితే గుణాఢ్యుడు తిరిగి మహామాత్య భారం స్వీకరించేటట్లు ప్రయత్నం చెయ్యవలసిందేనని చక్రవర్తి నొక్కి నొక్కి చెప్పాడు.

ఒకవేళ గుణాఢ్యుడే కారణం చేతనయినా దానికంగీకరించని పక్షంలో శాతవాహన సామ్రాజ్య స్థాన మహాకవి పదమైనా స్వీకరించేటట్లు చెయ్యవలసిందనీ అది అత్యంతావశ్యకమనీ అన్నాడు. శర్వవర్మకు చక్రవర్తి ప్రసన్న ముఖ భంగిమ చూడగానే మరి కొంచెం ధైర్యం కలిగింది. "ఒకవేళ వార్ధక్యంలో వారు దానికి కూడా సమ్మతించక పోతేనో—?" అన్నాడు కొంచెం సందేహిస్తూ.

"చక్రవర్తి బృహత్కథా మహాకావ్యం దక్షిణాపథ విద్వత్కవులకేగాక ఆర్యావర్త విద్వాంసులందరికీ అందించవలెనని అభిలషిస్తున్నారనీ, ఆ కావ్యం స్వయంగా పరిశీలించవలెనని ఎంతో ఉత్సాహిస్తున్నారనీ చెప్పండి! ఎలాగైనా వారా మహాకావ్యం మన ఆస్థానానికి సమర్పించేటట్లైనా ప్రయత్నించండి! అది చాలా ముఖ్యం!" అన్నాడు చక్రవర్తి కొంత లోతుగా ఆలోచించి.



ఫిలిమ్స్ డివిజన్ వారి డాక్యుమెంటరీ "ఖజురాహో" లో ఒక శిల్పం.
ఈ డాక్యుమెంటరీని మోహన్ వాధ్వానీ డైరెక్టు చేశారు.

ఆ చివరి మాటతో శర్వవర్మకు ప్రాణం లేచి వచ్చినట్లయింది.

ఇటీవలనే నందివర్మ అతని సన్నిధికి వచ్చి ఆ విషయంలో సాయం చెయ్యవలసిందని ప్రార్థించాడు. కాని అది గుణాఢ్యుని అభ్యర్థనగా పేర్కొని ఉండలేదు బహుశః గుణాఢ్యుడే ఆ విధంగా నందివర్మను పంపించి ఉండవచ్చునని శర్వవర్మ అనుమానించాడు. దానితో గుణాఢ్యుడు తిరిగి ప్రతిష్ఠాన నగరానికి రావాలని అభిలషిస్తున్నాడనీ క్రమక్రమంగా అది తన మహామాత్యాధికారానికొక పెద్దప్రతిబంధకంగా ఏర్పడగలదనీ భయపడ్డాడు. వెంటనే నందివర్మనా విధంగా మభ్యపెట్టాడు.

అటుపిమ్మటనే చక్రవర్తి అతనిమీద ఆ విధంగా విరుచుకు పడటం జరిగింది. బహుశః విదూషకుని వలననే ఆ విషయం అలాగ విషమించి ఉండవచ్చునని అందువల్లనే చక్రవర్తికి తనపైఅంతటి క్రోధావేశం కలిగిఉండవచ్చునని శర్వవర్మకుకొంచెం మాచాయగా స్ఫురించింది. కనకనే గుణాఢ్యుని దగ్గరకు వెళ్ళేటప్పుడు విదూషకుని వెంటబెట్టుకుని పోవడం మంచి కాదని నిశ్చయించుకొన్నాడు. మాటవరసకొకమారు తనతో రావడానికి వీలుపడుతుందా అని విదూష

★ గీర్వాణ భాషాభ్యాసం ★

శుణ్ణి అడిగిచూచాడు. విదూషకుడా మాటకు కొంచెం హేళనగా సమాధానం ఇచ్చాడు:

"పెళ్ళికి వెళ్ళేవారెవరైనా పిల్లినికూడా చంకబెట్టుకు పోతారా? మీవెనక నేనెందుకు? ఆమాత్రం స్వల్పకార్యం మీరు సాధించలేరు గనకనా?" అన్నాడొక నవ్వునవ్వి.

ఆ సమాధానంతో శర్వవర్మ ఒక పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టి వెంటనే వింధ్యాటవికి వెళ్ళిపోయాడు.

నందివర్మ అంతకుపూర్వమే వింధ్యాటవికి వెళిపోయారు. కొన్నిరోజుల పాటతడు వింధ్యాటవిలో లేనివిషయం గుణాఢ్యునికి తెలిసింది. దానికి కారణమేమని గుణసేనుని ప్రశ్నించాడు. గుణసేను డావిషయం తనకంతబాగా తెలియదనీ అయితే నందివర్మ బంధువుల నెవరినో సందర్శించడానికని ప్రతిష్ఠాన నగరానికి వెడితే వెళ్ళిఉండవచ్చుననీ అన్నాడు. నందివర్మ తిరిగివచ్చి ప్రతిష్ఠాన నగరంలో జరిగిన విషయాలన్నీ గుణసేనునితో చెప్పి అవన్నీ అతి రహస్యంగా దాచవలిసిందని ఆదేశించాడు. ఆపైన గుణసేనునికిక ఆ విషయంలో నోరుమెదపడానికి కూడా ధైర్యం చాల లేదు.

అటుపిమ్మట రెండుమూడు రోజులు గడిచిన తరవాత శర్వవర్మ వింధ్యాటవికి వెళ్ళి వెంటనే గుణాఢ్యుని సందర్శించాడు.

గుణాఢ్యు డతనిరాక కెంతో ఆశ్చర్యపోయాడు. ఆపైన శర్వవర్మ కోరికవిని మరింత నిర్ఘాంతపోయాడు. అయినా ఎంతో మర్యాదగా ప్రత్యుత్తరం ఇచ్చాడు:

"అయితే మీరింతదూరం శ్రమపడి ఇక్కడికి వచ్చిన దిందుకే అంటే నేను నమ్మలేకపోతున్నాను. లేకపోతే ఈ వయస్సులో నేను తిరిగీ ప్రతిష్ఠాన నగరానికి రావడమేమిటి చెప్పండి?"

"ఇది నా అభ్యర్థనకాదు. స్వయంగా సాతవాహన చక్రవర్తి చేసిన అభ్యర్థన. అంతవారి అభ్యర్థన తిరస్కరించడం సముచితంకాదు. ఆపైన మరి తమ చిత్తం!"

ఎంతచెప్పినా గుణాఢ్యుడా ప్రార్థన కంగీకరించలేదు. చివరకాస్థాన మహాకవిగా ఉండడానికి కూడా అంగీకరించలేదు. శర్వవర్మ దానికి లోలోపల సంతోషించకపోలేదు. అయితే పైపైకి చాలా నిరుత్సాహపడిపోయినట్టే నటించాడు. చిట్టచివరికి చక్రవర్తికి బృహత్కథ ఆర్యావర్త విద్వాంసులందరికీ అందించిన గౌరవమైనా దక్కించవలిసినదనీ, చక్రవర్తి స్వయంగా ఆ మహాకావ్యం చదివి ఆనందించవలెనని ఎంతో కుతూహలపడుతున్నారనీ అన్నాడు. గుణాఢ్యుడా అభ్యర్థనకింకా గౌరవంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు.

"అదంతా పైశాచీ భాషలో రచించిన కావ్యం. కేవలం ఆటవికులు అమాయికంగా గానం చేసుకోడానికే నేనది రచించాడు. ఆర్యావర్త విద్వాంసులు, అరుమాసాల్లో అఖండ గీర్వాణ పాండిత్యం సంపాదించిన చక్రవర్తి అది పరిశీలించి ఆనందించవలసినంతఘనత దానిలో ఏమీ లేదు! నా మాట నమ్మండి! చక్రవర్తికీ విషయంలో నా క్షమాపణ తెలుపుడు చెయ్యండి!"

ఆమాటలు వినగానే శర్వవర్మకు ముచ్చెమటలుపోశాయి. ఆవిధంగా గుణాఢ్యునికి విన్నవించడానికే అతనికి తలకొట్టివేసినంత పని అయింది. పైగా అతని వాక్యంలోని నిగూఢ వ్యంగ్యం శర్వవర్మ హృదయంలో ఒక విష దిగ్ధబాణంలా నాటుకొన్నది. నందివర్మ చెప్పిన దానినిబట్టి గుణాఢ్యుడు తప్పక ఆ ప్రార్థన అంగీకరింప గలడని శరతవర్మ నిశ్చయించుకొన్నాడు. కాని ప్రత్యుత్తరం ఆవిధంగా వినిపించేసరికిక నోటమాట లేక నిర్ఘాంతపడిపోయాడు. కొంత సేపటికి నెమ్మదిగా తనసంశయం వెల్లడించాడు. "ఇటీవలనే నందివర్మ ప్రతిష్ఠాననగరం వచ్చి ఈ విషయంలో చక్రవర్తి దర్శనం ఇప్పించవలసిందని నన్నభ్యర్థించాడు. అయితే—" అని శర్వవర్మ ఆ విషయం నెమ్మదిగా ఉపక్రమించాడు.

"నందివర్మ ఈ విషయంలో మీ సన్నిధికి వచ్చాడా? నిజంగానే!" అన్నాడు గుణాఢ్యుడెంతో ఆశ్చర్యపడి.

"అవును! అతడు మీ అభ్యనుజ్ఞ మీదనే నా దగ్గరకు వచ్చాడని అనుకొన్నాను."

"నా అభ్యనుజ్ఞ మీదనా? చక్రవర్తి సన్నిధికా?" ఎంతటి అభూత కల్పన!" అని గుణాఢ్యుడలాగే నిర్ఘాంతపోయాడు.

"ఆహవనీయాగ్నిలో హోమమైనా చేస్తానుగాని నేనా కావ్యం చక్రవర్తి కెన్నడు సమర్పించేది లేదు! స్వప్నంలోనైనా నా కటువంటి సంకల్పం కలగలేదు! మరి కలగబోదు కూడా!" అని తిరిగీ గర్జించాడు గుణాఢ్యుడు.

ఆ ప్రత్యుత్తరంతో ఆచార్యుని అభ్యనుజ్ఞలేకుండానే నందివర్మ ఆ విధంగా కోరి ఉంటాడని శర్వవర్మ గ్రహించుకొన్నాడు. ఇప్పుడైనా వ్యవహారం చెయ్యిదాటిపోకుండా జాగ్రత్త పడవలెనని నిశ్చయించుకొన్నాడు.

గుణాఢ్యుని అరణ్యగమనంతో చక్రవర్తికి కలిగిన పశ్చాత్తాపము, ఆమహాకావ్యంపై చక్రవర్తికీ, దక్షిణాపథ విద్వాంసులకు కలిగిన మహాగౌరవము, మొదలైన విషయాలేకరువుపెట్టి ఆకావ్యం చక్రవర్తి కర్పింపవలసిందని సవినయంగా అభ్యర్థించాడు. కాని గుణాఢ్యుడు వినలేదు! శర్వవర్మ గుణాఢ్యుని చేతులు పట్టుకొని బ్రతిమాలుకొన్నాడు. అయినా గుణాఢ్యుడు వినలేదు! పైగా నందివర్మ చేసిన ద్రోహానికతనిపై మండిపడ్డాడు. 'నందీ! నందీ!' అని గట్టిగా ఒకటిరెండు మారులు పిలిచాడు. అదృష్టవశాత్తు నందివర్మ ఆ సమయంలో అక్కడ లేడు. లేకపోతే శర్వవర్మ సమక్షంలోనే గుణాఢ్యు డతనిపై మండిపడేవాడు.

గుణాఢ్యుడు క్రోధావేశంలో ఉన్నప్పుడతనినిక ఎవరు అడ్డుకోలేరనీ ఆసమయంలో ఏది చెప్పినా ఇక బూడిదలో పోసిన పన్నీరేననీ శర్వవర్మకు తెలుసును. ఇక చేసేదేమీ లేక సవినయంగా గుణాఢ్యుని దగ్గర సెలవు తీసుకుని తిరిగి ప్రతిష్ఠాన నగరానికి బయలుదేరాడు.

—సశేషం

సుధా - మధూ

"" పళ్లూడిన ముసలిది ... పుచ్చొళ్ళను
సవరించినట్లు..."''

'ఏం అమ్మా! అంత అందంగా కూడా లేనా?'

'ఆహా! ఇద్దరు పిల్లల తండ్రీ - తల్లుల మర్యాదం...ఇంకెందుకే పోయేటంట?'

'మా అమ్మా నాన్నా వస్తున్నారని ఉత్తరం వచ్చింది. తెల్లచీర, కెంపురంగు రవిక, అంటే మా నాన్నకు ఎంతో ఇష్టం.'

'దంపేవుపో! ఉత్తరం నా అడ్రసుకు రాలేదా? డైరెక్టుగా రాణీగారి పేర నే వచ్చిందా?'

'అంత రహస్యాలు ఏమీ లేవు లెండి! సంపాదిస్తున్నది, మీరే గా?'

'అయితే, నీవు పోషింపవచ్చి, ఏదన్నా ఉద్యోగం చేస్తే, ఉత్తరం నీ అడ్రసుకే వస్తుందా? ఈ హడావుడిరోజుల్లో వీళ్లను ఆగుకోనేదెలా? లేవు కాలరికూడా రాలేదు! వూళ్లో అప్పులు జాస్తి అయినాయి!'

పుష్కలంగా పైసా లున్నా యని జీతాలువచ్చిన మొదటి తారికున న్నా అన్నారూ? మీ సర్వీసంతా, ఇంతేగా?'

'నా సర్వీసు తగలడిరి రేపు అక్టోబరుకు నాలుగేళ్ళు వెళ్తాయి అసలు, ఇంతకూ గత్యంతరం ఏమిటి....ఊబిలో చిక్కినట్లుంది. నా వ్యవహారం...!

'అమ్మాయి-అల్లుడూ ఉద్యోగ గిరిలో ఉండగా, మనల్ని చూద్దామని, మా అమ్మకు ఎంతకాలంనుంచో, ఆపేక్ష!'

'అయితే, నీవు ఉద్యోగం చేస్తున్నట్లే భావిస్తున్నావా? హతోస్మి!'

'అది కాదండి...మా అమ్మ అంటూ వుండేది ... అమ్మాయికి కంకిపాడులో ఉద్యోగమని...ఆమె ప్రాణానికి, మీరు ఉద్యోగం చేస్తున్నా, నేను చేస్తున్నట్లే వుండేది... నేనూ వెలగపెట్టానుగా చదువు. నేను నౌకరీ చేస్తూవుంటే, నా నవుకర్లు, పార్టీలు సలాములు చేస్తూ వుంటే, చూసి, గర్వించి, సంతోషిద్దామని ఆమెకి ఎన్నాళ్ళనుంచో కోరిక!'

'ఇప్పుడు కర్తవ్యం ఏమిటే?'

'ఏముందీ, వెంకట్రామయ్య కొట్లో, పచ్చాపలూ, బియ్యం తెండి!'

'ఆ! అలా దారికిరా. అంతేగాని, మా అమ్మకు నాన్నకు చేసినట్లు చెయ్యమన వుగా? ఏముందీ, ఆడబుద్ధి అపరబుద్ధి అన్నారు జుట్టు నెరిసినవాళ్లు...యిప్పుడు బాగా బోధపడింది. బాగా గుర్తుకు తెచ్చుకో...మూడేళ్ల క్రితం ..నాకు ఉద్యోగంఅయినక్రొత్తలో, నందిగామలో ....'

2

"మే, పదిహేనో తారీకున, మా అమ్మా నాన్నా నందిగామ వచ్చారు. ఉదయం తొమ్మిదిగంటలకి బస్సులో వచ్చారు. నేను వెళ్లి స్టాండింపగారింఛి వాళ్లనుతీసుకుని వచ్చాను. బండీ ఇంటిముందు ఆగింది. నీవు ఉదయం కాఫీ ఫలహారాలు సేవించి, ఆరోగ్యంగా ఉన్న దానివల్లా, చెయికున్న కుడిచేతి వేలు తెగోసుకున్నావు...కుడి కాలులో సీసాపెంకు విరిగి, బాధపడుతున్నావు...దానిలోని పరమరహస్యం పరమేశ్వరునికే ఎరుక! ఆ లోగుట్టు పెరుమాళ్ళకే ఎరుక!

దివాకరుని వెంకటేశ్వర్లు


"రామ రామ!"

"ఉస్ వుండూ! వృద్ధులయిన మా అమ్మా నాన్న కాస్త రెండు రోజులపాటు, మన కాపురం చూద్దామని వచ్చారు. ఇదేమిటని అడిగితే, ఖర్మ యిట్లా కాలింది...ఇంకా నయం లేచిన వేళావిశేషం బాగుంది. అజాగ్రత్తగా వుంటే, సాంతం కాసూ చేతులు పోయేవి, అన్నావు. అమ్మ మా సీ జాలి పడింది. నీవు కొరకొర చూశావు. అమ్మ వంటప్రయత్నంమీద నూతిదగ్గరకు వెళ్లింది. నీవు పోయి మంచంమీద పడుకున్నావు...

"ఉప్పురాచ్చిప్ప ఎక్కడుందే, సుధా! అని అమ్మ అడిగితే, ఉప్పు ఉందో లేదోనని పణిగావు. పాత ఉప్పుజాడీ చూపించావు. దానిలో, నవటాకు ఉప్పన్నా లేదుట. మిర్చి ఎక్కడంటే, మిర్చికూడ అయిపోయి నట్లుంది...ఏమోనండీ, ప్రతిదీ అయిపోయిం దని చెప్పటమూను, నా చేతుల్లో డబ్బు లయిపోయినాయని వారు సమాధానం చెప్పటమూను. ఆ వస్తువ వచ్చేటప్పటికి ఆరు యామాలు పడుతుంది...ఎంతజీతంవస్తే నేం, రెండో తారీకుకల్లా, ఇల్లు అయ్యవార్ల నట్టి ల్లులా ఉంటుంది...నా నాంతాడు తాకట్టు పెట్టారు; దాన్ని విడిపించుకరమ్మని ఆర్నెల్లనుంచి నెత్తినోరెట్టుకువాగుతున్నా నన్నమాటేగాని, నా మాట ససేమిరా ఖాతరు చెయ్యరాయిరి. ఆ నాంతాడు వుందో, సాంతం తెగనమ్మారో, తెలియటం లే!...చెప్పకుంటే సిగ్గుచేటుగాని, ఇంట్లో కాస్త యివిలేవు, అదిలేదు, అవి, తెండి, ఇది పట్టుకరండి అంటే, వూహూ దుమ్మెత్తిపోస్తారు. సంసారం చెయ్యను సన్యాసం స్వీకరిస్తా నంటారు...పిల్లులు పోట్లాడినట్లే, అన్నావు.

అమ్మ ఇది వినలేక, నాన్నదగ్గరకు వెళ్ళి "అబ్బాయిగారి వ్యవహారం ఏం బాగాలేదు ఎనభై రూపాయిల జీతం...వాడూ, అదీ, పిల్లాడు, పూలరంగడిలా కాపరం చెయ్యాల్సింది...పోనీ, మన మొహాన ఇంత పడేస్తున్నాడా అంటే, అదీ శ్రీరామరక్ష! ఇంత వరకూ కాని డబ్బు పంప ఎరగడు. వాళ్లి పటం వాళ్ల నెత్తిన కొట్టుకుంటారు. నా ఖర్మ యిట్లా కాలింది! ఏదో నాల్గు రోజుల పాటు రెస్టుగా కొడుకూ. కోడలు దగ్గరుందామని వస్తి—రామేశ్వరం పోయినా, శనేశ్వరం తప్పదన్నట్లు—ఆవిడగారికి కాళ్లూ చేతులు పడిపోయిరి. నేను సుఖపడే యోగ్యతలేదు...సాయంత్రం అయిదు గంటల బస్సు ఎక్కుదాం పదండి...నా జీవితం యిలా హారీ అనాల్సిందేను! అని నాన్న దగ్గర వాపోయింది.

"నాన్న నా దగ్గరికి వచ్చి ఏరా మధూ! కాపరం చెయటం లక్షణంగానే వున్నట్లున్నదే! ఏం బ్రతుకులురా ఇవి! యింట్లోకి కావలసినవన్నా పడేస్తే, ఆపైన ఏబంగారం తినకపోయినా, యింత పచ్చిపులుసన్నా కాచుకు తెల్లార్చవచ్చుగా! నాంతాళ్ళూ, చామంతి పూలూనూ తాకట్టు పెట్టేది



★ సుధా - మధూ ★

ఫూల్!" అని ఇంకా ఏమిటేమిటో అంటోంటే, నేను గబగబా నీదగ్గరకువచ్చాను.

"ఇంటి అద్దె వాళ్లుసెల్లది యివ్వాలత్తయ్యా! ఇంటి యజమాని ప్రతిరోజూ వస్తుంటాడు...ఇవ్వాళ వచ్చే వేళయింది...ఆయనకు ఇదిగో, యీ పూట, సాయంత్రం రమ్మంటారు...ఆయన ఓ పట్టాన మంచివారే...ఇంకోళ్లు యింకోళ్ళయితే, చెంబు తప్పేలా బయట వేస్తారు...మీకు తెలుసో లేదోను! అద్దె సవ్యంగా యివ్వకపోతే ఎలాగు చెప్పండత్తయ్యా...పాలదానికి మూణ్ణెల్లది, నిన్న యిచ్చాం...అది మంచిది కనుక ఊరుకుంది ... ప్రతీది ఇంతే...అదేమంటే, యన్.జి.వో.ని అంటారు..." అని ఇంకా యేమిటో చెప్తున్నావు... నేను ప్రవేశించగానే, అమ్మ కళ్ళనీళ్లు తుడుచుకుంటూ అక్కణ్ణించే వెళ్ళిపోయింది...

"ఏమిటి సుధా! నీకేమన్నా మతిపోయిందా? ఏమిటి ఈ పిచ్చివాగుడు!" అంటే నన్ను నువ్వు మంచం మీద కూర్చోమని సంజ్ఞ చేశావు.

"మీ అమ్మా, నాన్నా యిక్కడ తిష్ఠ వేసేందుకు వచ్చారు...రేపు నెల ఇన్నూ రెన్నూ ఒకటి కట్టాలి...బట్టల దుకాణంలో అరవై రూపాయల అప్పు ఉండిపోయింది.. ఈ నెలలో పాలూ పెరుగులు ఎక్కువ వాడేం..."

"అయితే..."

"అబ్బా వింటురా! ఇన్ని వున్నాయా? కుర్రాడు వస్తున్నాడని నూళ్లు కుట్టిస్తానన్నారా? ఎంతకాలం అమ్మకి, నాన్నకి పెట్టితే, మనం బాగుపడ్డటేను!..."

ఉష్...వాళ్లు యివ్వాళ ఉదయం వచ్చి సాయంత్రం వెళ్తానంటున్నారు. ఎవరన్నా వింటే, నోట్లో వుమ్మేయరుటే..."

"ఆఁ! మనమేమన్నా కీమలా డామా? సంసారంలో 'ఎకనమీ' తెలియకుండా, ఎలాగండి మీతో వేగడి? ... పోతే పోనివ్వండి...నాకు యిష్టం లేదు. ఈ ఋణాలు ఎలా తీరుతాయో, ఏమోను...నాం తాలు చేయమని ఆర్డరు యిచ్చారు గదా, తీరా ఇప్పుడు వద్దంటే, బాగుంటుందా?

"ఔనుగాని, నాంతాడు తాకట్టుపెట్టానని చెప్పావుటగా?"

"చెప్పరు మరి! ఇల్లు ఒకప్రక్కన గుల్ల అయిపోయేట్టు వుంది—సరదాపడి సెలవు పెట్టుకుంటే, ఎన్ని మాటలన్నారు! ఇవన్నీ గుర్తుండవండీ ఎందుకు వుంటాయి? అబ్బ వాగలేకుండా వున్నాను...పోనిస్తురూ... ఇలా కాలూ చేయి పడిపోయిన దానిలా వుండి వాళ్ల చేత చాకిరీ చేయించుకుంటే తీరా నే నేనరకాపనడతానో...ఏఖర్మ రాసిపెట్టి వుందో! నాకు భయంగా వుంది..."

నేను లేచివచ్చాను. నాన్న ఉత్తరీయం వేసుకున్నాడు. అమ్మ, చీరలు, సంచీలో పెట్టింది...

"వెళ్ళి వస్తాముగా మధూ!" అని నాన్న చెప్పాడు.

"ఇంకో నాలుగురోజులుండి వెళ్ళురుగాని.. ప్రొద్దుటేగా వస్తా..." అని నేననే టప్పటికి, అపలుకు నిశ్చయించాలికి బందరుఘీరంగిలా వినిపించింది...అమ్మ అహోహాలా చూసింది...

ఇద్దరూ ప్రయాణమైనారు...

"జాగ్రత్త... పెసరపప్పు వేసుకోకు" అన్నాడు నాన్న నిన్ను చూసి...

"పెసరపప్పు లేదు...మినపపప్పు లేదు అవేం తీసుకురాకరా!"

అమ్మ యీసడింపుగా మాట్లాడింది.

నందిగామ టపా బస్. నాలుగున్నరకు బయలుదేరుతోంటే, అమ్మా, నాన్నా దాంట్లో ఎక్కారు...ఇంటికి వచ్చాను.

"కెంపురంగు రవిక...తెల్లని చీరతో... తయారయ్యావ్!"

3

జట్కా వాకిట్లో ఆగింది...అత్తగారు, మామయ్య మహారాజా...సరోజదిగారు. బావమరిది కూడా వస్తున్నాడట. అయితే ఎప్పుడు వచ్చేదీ తెలియలా.

సుధ సంతోషసుధావాహినిలో తేలియాడుతోంది.

సుధ నూతి దగ్గరకు వెళ్ళి, మధును రమ్మన్నట్లు అనేక పోజులలో సంజ్ఞ చేసింది. వెళ్ళాడు...'బజారుకు వెళ్ళి ఓడజను రసాలు ...ఓ అరడజను ఇమాయితీలు తెండి...మా అమ్మ అప్పుడే వెళ్తానంటోంది..." సుధ అంది. మధు ఆమాటలు నమ్మలేకపోయాడు. బావమరిది కూడా వస్తున్నాడని చెప్పిన ఆవిడ తీరా అతను కూడా రాకుండా వెళ్తుందా...వీళు తన ఎముకలు కరకరా నమిలేట్లు వున్నారు...

"సరేలే! వుండటంయిష్టం లేకపోతే, ఏం చేస్తాం...వెళ్ళితే వెళ్ళమను...పోయేవాళ్ళను కాళ్ళు పుచ్చుకుని వుండమనటం కూడా అంత భావ్యం కాదు! అంతకాడికి రసాలు ...ఇమాయితీలు...ద్రాక్షలూ దేనికీ" సుధ కంగారు పడింది.

"జమానుతో సినిమా హాలుకు కబురు పంపండి..."

"ఇవ్వాళ మేనేజరు లేడ్లే వుంది!" ఆ మాటకు సుధ కళ్ళు మంటలు పుట్టి, నీళ్ళు వసగళ్ళలా పడసాగాయి. ఇంట్లోకి వచ్చేసింది. "సినిమాలు ఏమేమి ఉన్నాయి? 'సంతోషం' వచ్చినట్లు వుందే..." పాపం అత్తగారు కూడా సినిమా పిచ్చిలో వుంది.

"ఆఁ! ఏం సినిమాలో, ఏం సినిమా లోకమోను! ఇక్కడి ప్రొజక్టరు బాగుండదండీ. లైటింగు అసలే వుండదు...ఫిల్ము పుటికీ-పుటికిన నిమిషనిమిషానికి తెగుతుంది. ఏడున్నరకు మొదలుపెడితే, ఒంటిగంటకు యింటికి వచ్చినా వచ్చినట్లేను! ఆ కుర్చీల నిండా నలులూ-చీంబోతులున్నూ..." మధు అంగుళుని వుపన్యాసంతో బెదరాయించాడు.

సుధ ఆశ్చర్యంతో మధువంక చూసింది. ...మధును సుధ లోపలికి పిలిచి...

"మీకు గుడ్‌మార్నింగ్ సార్! ఈసారి మీ అమ్మా. నాన్న వస్తే..."

"మళ్ళా కథ ప్రారంభిద్దామా...ఈసారికి యీ కథ కూడా ట్రాజడీని చేస్తే మళ్ళా ఆపై కథ కామెడీ చేద్దాం..."

"అయితే నా మాట వినరన్నమాటేగా..."

"ఎందుకు వినాలీ అంట?' సుధ ధుమధుమలాడుతూ యింట్లోకి వెళ్ళింది.

"అమ్మా సినిమా మేనేజరు యివ్వాళ లేరట...రేపు వెళ్దాం సినిమాకు..." అంది కూతురు. అంతవరకు సినిమాలకు వూరికే నేవెస్తుంది...అని అనుకుంది ఆ మాతృహృదయం.

"ఒక రూపాయి యిస్తారూ...సేమ్యాలు కిస్‌మిస్-పచ్చకర్పూరం తెప్పించాలి."

సుధ అడిగింది బిక్కు బిక్కుమంటూను. తన దగ్గర నిల్వవున్న పైకం హరించిపోగా...

"భావుమ్మగారు మనకి రూపాయి ఇవ్వాలని చెప్పినట్లున్నావు...నా దగ్గర రూపాయి వుంటే, ఆంజనేయశర్మ-ఎప్పుడూ అడగనివాడు-అవసరం అంటే ఇచ్చేసివచ్చా!"

"మీరు అప్పులు కూడా యిస్తున్నారూ? అంతమాత్రం వుంటే యింక లేనిదేముంది." సుధకు కోపం వచ్చింది.

"కొంచెంసేపు మావాళ్ళతో మాట్లాడండీ. అలా ఎడం ఎడంగా మాటా-పలుకూ లేకుండావుంటే ఏమన్నా అనుకుంటారు". మధు తన తల్లి తండ్రులతో మాట్లాడటం లేదని గమనించి చెప్పలేక చెప్పలేక చెప్పింది

"నాలుకమీద పూతపూసినట్లుంది... నోరు తెరవనివ్వటంలేదు! దూడూ! నోటివెంట ఎలా నీళ్ళు కారుతున్నాయోను... అసలు నీతో మాట్లాడేప్పటికే..."

సుధ యింక మాట్లాడలేదు. ఎదురుగ్గా వున్న సీతారాముల పటానికి నమస్కరించింది.

మధు, రంగంలోకి దిగాడు...కంది పచ్చడి నూరుతున్న సుధ దగ్గరకు వచ్చి,

"సుధా, రేపు యిన్సూరెన్సు కట్టాలి. లేకపోతే లాప్స్ అయిపోతుంది. మూడు నెల్లనించీ వూరుకున్నాము. లేకపోతే, నీ గాజుల జత యివ్వు. అన్నింటికీ పనికి వస్తుంది."

ఈ మాట వినేప్పటికి, మధు చూస్తున్నంతలో, కందిపచ్చడి నలిగిపోయింది.

"లాప్స్ అయితే అవనివ్వండి....అన్నీ వుద్ధరించబడ్డాయి కనుక, యిది అఘోరించిందని బాధ పడటానికి...ఇంటికి మా అమ్మా నాన్నా వస్తే గాజుల జత యివ్వమంటారూ?"

"లేకపోతే, వెండికంచం తీసికొని వెళ్ళనా?"

"నాఖర్మ! ఎవరినని ఏంలాభం...ఇవ్వాళ గుర్తుకొచ్చిందా యిన్సూరెన్సు సంగతి!"

"మరి ఏం చెయ్యమంటావు? చిల్లర బాకీలూ అలాగే వున్నాయి."

ఈ రెండు రోజులూ ఆగండి...లేకపోతే కృష్ణాని అడగండి. ఒక యాభైసర్దుతాడేమోను."

"వాడు నిన్న నన్ను అడిగాడు...చేత్లో వన్నా లేదండా మనుకుని చివరకు నోటితోనే లేవన్నాను"

"వుప్పు చాలిందో లేదో చూడండి."

"అబ్బ కషాయం...అంత వేశావే, డబల్ డోసు!"

"అయ్యో నా మతి కాలిపోనూ. వుప్పు వేసినట్లే వున్నాను...మళ్ళా కాలపెటాను

★ సుధా - మధూ ★

కాబోలు! మీ కొక సలాం చేస్తాగాని, కాసేపు ఆగిరండి మాట్లాడుతాను..."

ఇంక మాట్లాడేందుకు రా చ కా ర్యా లేమున్నాయి? గాజులజత తీసి యివ్వు!" మధు లేచి వెనక్కి తిరిగేప్పటికి.

"ఇంకా కాలేదటే!" అంటూ అత్తగారు వచ్చింది. మధు నాలుక కొరుక్కుని అక్కణ్ణించి లేచివచ్చాడు.

"అల్లుడు గాజులజత అంటా డేమిటే! డబ్బుకు యిబ్బందిగా వుందేమిటి? పోనీ, అంత అవసరంగా వుంటే, వుత్తరంరాస్తే... డబ్బు పంపేవారుగా?"

"పంపినా అంతే కాలపెట్టినా అంతే! దిక్కుమాలిన కాపరం...వేగ లేకుండా వున్నానే!" విసుగ్గా సుధ అంది. తల్లి అక్కడినుంచి వెళ్ళి, భర్త దగ్గర కూర్చుంది.

"కృష్ణగాలి చల్లగా వస్తూంది. అల్లుడి గారి యిలు మహా బాగా వుంది!"

"ఆc! అన్నీ బాగానే వున్నాయి... అలుడి సంసారమే బాగుండలా."

"ఏం?"

"జీతమంతా ఏంచేస్తున్నాడో...ఏం సంపాదనో చూడండి...చటుబండలయిన సంపాదన...రెండో తారీఖుగదా, నిన్నను వస్తిమి. ఇవ్వాళనే మొదలా?"

"ఏం, ఏం జరిగింది?"

"నా బొంద! నా శ్రాద్ధం! అదేగాబోలు. ప్రొద్దుట మనం వచ్చిం దగ్గర్నుంచీ, నేను పరీక్షగా చూస్తున్నా."

"దేన్ని?"

"దేన్నేమిటి...అలుడిగారి ముఖార విందాన్ని! తుమ్మలలో ప్రొద్దూకినట్టే... ఇప్పటికి తేలింది. అయ్యగారి చేతిలో, కాని డబ్బు లేదుట. వూళ్ళో ఒక్క పైసా అన్నా అప్పు తేలేట్ట! అమ్మాయి గాజుల జత యిస్తే, అత్త మామలకు సుష్టుగా పెడతాట్ట!"

"ఎంత ఘోరం!"

"అందుకనే యీ పాపకర్మ మనం చూడా వద్దూ ... ఉండనూ వద్దు ... ఎంత పెట్టినా అంతే. అల్లుళ్ళకు మేలు లేదు...బూడిదలో పోసిన పన్నీరు. విన్నారు కాదు...రేపు ఫస్టు బస్‌కి ప్రయాణమువుదాం!"

"రికైరయ్యామగా...ఆ వూళ్ళో ఏం చేసేది...ఇక్కడ హాయిగా చల్లటి గాలి పీలుస్తూ, కృష్ణారామా అనుకుంటూ..."

"మీ కృష్ణా - రామా బంగారం కానూ ఒక్క పూటన్నా యిహ వుండ వద్దు. శుక్రవారం పూటా, అమ్మాయి గాజులు తీసుందేమోను!"

"ఒక పది నే నివ్వనా?"

"ఏడ్చినట్లే వుంది. మరిఛార్జీలు! అయినా ఖర్చుచేసే వాళకు పదిగాదుగదా, వెయ్యి యిచ్చినా, వుంటాయా దస్తాయా? ఈ సారి వాళ్ళు పచ్చగా వున్నప్పుడు వదాం రండి!"

"ఇప్పుడు కొంచం పండు రంగులో వున్నారా?"

"మీరొహరు శకున పక్షి మాటలు! నోరు మూసుకుని పండుకోండి!"

ఆపూటకి వాళకి అన్నం సహించ నే లేదు.

"రేపు వుదయం వెళ్తామోయ్ మధూ! గేదె మొన్ననే, యీనింది. దాని పోషణ పాలేరు సరిగ్గా చూడడు. ఈ సారి మళ్లా వస్తాంలే, సుధా!" వక్కలు వేసుకొంటూ మామగారు అన్నాడు.

"నాన్నా, సరోజ వుంటుంది వుండ నివ్వండి!" సుధ అంది.

"అది లేకుండా నాకు తోచదమ్మా! యీ సారి వస్తే, వుంచుతాలే..."

సుధ కాదన లేకపోయింది.

"రేపు ఉదయం వెళ్తామోయ్! మీ సంసారం చూడు చక్కగావుంది...ఇంకాస్త శ్రద్ధ వహిస్తే పైకి వస్తారు" అన్నాడు. సుధ తలవంచుకుంది. మధు చిన్న చిరునవ్వు నవ్వాడు.

"అదంతా సుధలో వుంది. సుధ జాగ్రత్త వహిస్తే బాగానే వుంటుంది...అయినా ఆడదాని చేతి అరం! వచ్చిన జీతం సుధకు యిస్తూ వుంటాను...ఆపైని దాని యిష్టం" సుధ తీక్షణంగా మధువంక చూసింది...

ఆ మర్నాడు సుధ తల్లిదండ్రులు ప్రయాణమై వెళ్ళారు!

ఆమర్నాడు మధు సుధనిచూసి నవ్వాడు. క్రితం రోజల్లా మాట్లాడలేదు. సుధకు కొంచెం కష్టం వేసింది. అసలేదిగాలుగా వుంటే, యీయన నవ్వటం దేనికని.

"నూటికో నాడు చూద్దాంగదా అని వచ్చారు. కళ్లలో నిప్పులు పోసుకున్నారు"

"కోపగించుకోకు!" ఇదిగో రెండు వందలూను. మొన్నను అనుకున్న పైకం వచ్చింది చీటి డబ్బు!...రేపు వుదయం టెలిగ్రాములు యిస్తున్నా!" అన్నాడు, మీ అమ్మాయికి చాలా సుస్తీగా వుందని అత్తమామల్ని రమ్మనిమనీ, తనకు చాలా సీరియస్ గా వుందని తల్లి దండ్రులకూ టెలిగ్రాంలు యిచ్చాడు—మధు.

మందీ మార్బలంతో, యిరుపైపుల వాళూ ఒక్క పర్యాయం వచ్చారు. చూసి ఆశ్చర్య పోయారు.

"పాప పరిహారార్థం ... ఇదివరకు మేం చేసిన కొంటెపనులకు ప్రాయశ్చిత్తంగా, మీరంతా, యిక్కడ ఓ వారంరోజులుండి మా అపూర్వ దంపతుల్ని ప్రతి పూటా ఆశీర్వదించాలి...ప్రొద్దూకింది రెండి సినిమాకు వెళ్దాం!" అన్నాడు మధు. అంతా పకపక నవ్వారు!

★



33

పరాయి ఇంట్లో కేవలం పరాధీనురాలై పడివుండటం ఇదే మొదటి సారి. సుఖమో, దుఃఖమో-ఇన్నాళ్లూ తనకు తన యింట్లో ఏకచ్ఛత్రాధిపత్యంగా వెళ్లిపోయింది. తన ఇంట్లో తన మాట-యీ గొప్ప ఇంట్లో కోడళ్లమాటకంటె తక్కువ యేమీ చెలామణీ కాలేదు...ఎప్పుడూ అక్కడచ్చి పడివుండటం, మనస్సుని సరిపెట్టుకుని ప్రవర్తించటం, మరొకరి నోటిమాట ప్రకారం నడచుకోవటం-సున్నపాకు తొడిమంత పాలు రాకూడదు. తొత్తు-తొత్తుకింద బడి తొత్తు...ఇది ఆమెకి దుస్సహంగా ఉంటోంది. చాకిరీ చేసిచేసి ఆమె ముఖం కందిపోతోంది-అయినా ఆ శ్రమకు విలువలేదిక్కడ. చచ్చేట్లు కష్టపడుతున్నా-మాట మాత్రమయినా తలుచుకునే వాళ్ళెవరూ లేరు. వాళ్లు యిచ్చేది సగర్వంగా నిర్లక్ష్యంగా, విసిరి పారేస్తారు. నీ శ్రమకు ప్రతిఫలం ఇస్తున్నామని మర్యాదగా యివ్వరు. మోకాలిబంటిగా కూరుకుపోవటమే!...

ఇది క్రమంగా దుస్సహమయిందామెకి. కాని గత్యంతరం ఏముంది? బయటికి పోయేందుకు పదుపాయం ఏది? ఎవరిస్తారాశ్రయం? ఎక్కడ నిలబడగలదు?

ఎప్పటికీ ఇలా గడపవలసిందేనా? బ్రతికున్నాళ్లూ ఆ బాపనీ పిన్నిలాగా?

పెళ్ళిసందడి ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఇవాళ 'ప్రీతిభోజనం' జంజెపడినపట్నుంచీ ఆడవాళ్ళ బళ్లు వెనుక గేటులోంచి వస్తూనే ఉన్నాయి. ముందు సింహద్వారం దాటగానే, ఎదురుగా రెండో అంతస్తు వరండాలోకి ఎక్కివచ్చే పాలగచ్చు మెట్లమీద నీలిరంగుపూలకార్పెట్ పరిచారు. వరండా నిండా మెట్లమీద గ్యాసులైట్లున్నాయి. మెట్టు ఎక్కివచ్చేచోట మొదట్లో పెద్ద పెద్ద లైటు పెట్టారు. ఇద్దరుకోడళ్లూ-ఇంట్లోతక్కిన ఆడవాళ్లూ అభ్యర్థన తెల్పుతూ అందరినీ పైకి పంపిస్తున్నారు. ఆహూతలైన స్త్రీలలో ముసిముసి నవ్వులవారు కొందరు, పకపక నవ్వులవారు కొందరు, గబగబ నడిచేవాళ్లు, పెళ్ళి నడకలు నడిచేవాళ్లు, సుందరీమణులు-రకరకాల నడకలతో మెట్లెక్కి పైకి వెడుతున్నారు.

అపూ చాలా సేపటినుంచి క్రింద వరాండాలో ఓ స్తంభం దగ్గరనుంచుని చూస్తున్నాడు సిరి సందర్శి. ఇలాంటి దృశ్యాన్ని వాడు జీవితంలో మొదటి సారిగా చూడటం ఇదే. పెళ్లినాటి రాత్రి వాడు పడుకుని

> అనువాదం
> మద్దిపట్ల సూరి

నిద్రపోవటంవల్ల — ఏమీ చూడలేకపోయాడు. అందరికంటె ఈ యింటి సుజాత చాలా బావుంది వాడికి. ఆమె మధ్యమధ్య మెట్లు దిగివస్తూ, పైకి వస్తున్నవారిలో ఎవరినో పల్కరిస్తూ, నవ్వుతూ—"ఇదేదాని వేళ మొత్తానికి మణీదీ! ఏకంగా ఎనిమిదయి పాక ఇప్పుడా? పొగడతోట వదినగారు రాలేదా?" అన్నది. ఆ పల్కరింపబడిన సుందరి నవ్వుతూ "బండి ఆరుగంటలకే సిద్ధం చేయించి పెట్టుకున్నాను... కాని బయలుదేరటం అంటే మాటలు కాదమ్మా! అన్నీ యథావిధిగా — నీకు తెలియనిదేముంది?" అన్నది.

సుజాత 'కాంచన' పువ్వురంగు చైనా క్రేప్‌సిల్కు, చేతుల్లేని చొక్కా తొడుక్కుంది. చక్కగా, శుభ్రంగా ఉన్న చేతులతో ఆహూత వనితలను దగ్గరగా తీసుకుని హత్తుకుని, ఎంతో ఆదరంగా వారి భుజంమీద ముఖం ఆనించి ఆరాసరి పైకి తీసుకువెడుతోంది వారిని—"పొగడతోట వదిన వచ్చే వేళలో కలకత్తా వెడుతుందిట—అని చెప్పింది అమ్మ. బుధవారం నాడు వెళ్ళింది అమ్మ—ఆ ప్రయాణం ఖాయమయినట్లేనా?" అని మాట్లాడుతూ పైకి వెళ్ళింది.

పైన చివరి మెట్టుమీద చిన్న కోడలుగారు కన్పించింది. బహుశా ముప్పైయేళ్లు పైనే ఉండొచ్చు. అపురూపసుందరి. ఆమె వేషంలో ఆడంబరం ఏమీ లేదు. సంపంగి రంగు, ఎర్రటి వెడల్పయిన అంచూ ఉన్న పట్టుచీర కట్టుకుంది. తలమీది అంచు దగ్గర డైమండ్ పిన్ను పెట్టుకుంది. మెట్లదగ్గర లైట్ల వెలుగులో ఆమె మెడలోని సన్నటి బంగారపు గొలుసు తళతళ లాడుతోంది. శాంత నిదానం, గాంభీర్యంగల ప్రకృతి ఆమెది. ఈ వయసులోకూడా ఆమె శరీర ఛాయ అలాఉండటం అపూర్వం. గడచేరిన సోదరుడొకడు పెల్లాళ్ళక్రితమే చనిపోయాడు. అంచేత ఆమెముఖంలో అనంత విషాదరేఖకూడా వ్యక్తమవుతోంది.

మణీదీ లేవబోతూ చిన్నకోడల్ని ఎదుటచూసి, మెట్లమీదే ఆగిపోయింది. "చిన్న వదిన వంట్లో ఎలాఉంటోందిప్పుడు? ఏమిటో, ఎప్పటికప్పుడు వద్దామనుకోవటమే కాని, తీరటంలేదు".

మానవులింతఅందంగా కన్పిస్తారనేదెరుగడు అపూ. వాడివాళే ఆమెని చూడటం. సోదరుడుపోయాక ఈ మధ్యనే వచ్చింది పుట్టింటినుంచి. వాడు ముగ్ధుడై రెప్పవాల్చకుండా చూస్తున్నాడామెకేసి. ఈ లైట్లు, ఈ సుందరీమణులు, మత్తెక్కించే విలువైన అత్తరులు, పిణానిస్వనా

జరిగినకథ :—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. బడి చదువుకూడా వాడికి ఏమీ అంటలేదు. ఇంట్లోనే తండ్రితాలూకు పుస్తకాలన్నీ చదివేస్తూ ఉండేవాడు. ఒకసారి వాళ్ల ఊళ్లోకి ఒకనాటక సమాజం వచ్చింది. వాళ్లువేసిన నాటకాలు చూసి అపూ తన్మయుడైపోయాడు. తనుకూడా పెద్దయ్యాక నాటక సమాజాల్లోచేరి నటుడైపోవాలని కలలు కన్నాడు. తను చూసిన నాటకం కథ ఆధారంగా స్వయంగా ఒక నాటకంకూడా రాసేశాడు. మొత్తానికి వాడి ఆదర్శాలకు ఆకాశమే అవధి. దుర్గకి మంచి సంబంధం ఏదన్నా చెయ్యాలని తల్లి ఆవేదన పడేది. కాని మంచిసంబంధాలనేవి హరిహరరాయ్ కుటుంబానికి ఎన్నటికీ అందని ద్రాక్షపండ్లే. ఎప్పుడో ఏదో అదృష్టం కలిసివచ్చి తమ సంసారం బాగుపడుతుందనీ, దుర్గ గొప్పింటి కోడలైపోతుందనీ, అపూ పెద్దవాడై ప్రయోజకుడై తమ కష్టాలు గట్టెక్కిస్తాడనీ ఆమె కలలు కనేది. కాని ఆ కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.

ఒకసారి దుర్గకి జ్వరం పట్టుకుని ఎన్నాళ్ళకీ తగ్గలేదు. హరిహరుడు ఊళ్ళోలేడు. తల్లీ, పిల్లలూ తిండికికూడా మొహం వాచిపోయారు. ఆఖరుకి ఒక భయంకరమైన రాత్రివేళ, వర్షం ప్రళయంగా కురుస్తున్నవేళ దుర్గ ప్రాణవాయువులు అనంతంలో లీనమైనాయి. ఆమె జనన మరణ, సుఖదుఃఖ ద్వంద్వాతీతమైన ఏదో అజ్ఞాతలోకానికి వెళ్లిపోయింది. హరిహరుడు ఊరినుంచి తిరిగి వచ్చినతరవాతగాని దుర్గ మరణం వార్త అతనికి తెలియలేదు. పిమ్మట హరిహరుని కుటుంబం అంతా నిశ్చిందిపురం విడిచిపెట్టి కాశీ చేరుకున్నారు. హరిహరుడు కాశీలో హరికథా కాలక్షేపాలతో జీవయాత్ర సాగిస్తూ కొంతకాలానికి జబ్బుచేసి చనిపోతాడు. సర్వజయకు కాశీలో జీవనం సాగక ఒక ధనిక కుటుంబంలో వంటగత్తెగా కుదురుకుంటుంది. కాశీ విడిచిపెట్టి ఆ కుటుంబంతో వెళ్లిపోతుంది. అపూ మళ్లీ కొత్తపరిసరాల్లో, కొత్తజీవితం ప్రారంభిస్తాడు.

★ పథేర్ పాంచాలి ★

...లాంటి కంఠస్వరాలు, నవ్వులపోవలు వాడికొకవిధంగా మైమరపింప చేశాయి. ఎప్పుడూ ఇలా జరిగితే ?

మెట్లదగ్గర ఎవరో అపరిచితుడైన కుర్రవాడు నిలబడిఉండటం చిన్నకోడలు చాలాసేపటినుంచి కనిపెట్టి చూస్తోంది. అందర్నీ ఆమె ఎరుగదు. ఆమె తండ్రికూడా చాలా శ్రీమంతుడు. తరచు పుట్టింటిదగ్గరే ఉంటూ ఉంటుంది. రెండడుగులు క్రిందికి దిగివచ్చి, "అబ్బాయ్, ఇలా రా పైకి. నుంచున్నావెందుకు? ఎక్కడినుంచి వచ్చావ్ నువ్వు?" అని అడిగింది.

అపూ ఇంకొకవైపు తిరిగి, వస్తున్న మరొక జట్టును చూస్తున్నాడు. చటుక్కున వెనక్కి తిరిగిచూసి; చిన్నకోడలుగారు తనను పిలవటం గమనించి, మొదట్లో బిత్తరపోయాడు. నమ్మకం కుదరనేలేదు. తర్వాత ఎక్కడలేని సిగ్గు వచ్చేసరికి, పైకివెళ్లటమా, అక్కడనుంచి పారిపోవటమా అని ఆలోచించసాగాడు. ఇంతలో చిన్నకోడలు ఆమే క్రిందికి దిగి వచ్చింది. దగ్గరకువచ్చి, "నువ్వు ఎక్కడ నుంచి వచ్చావ్ అబ్బాయీ?" అని అడిగింది.

అతికష్టంమీద ఎలాఅయితేనేం అపూ నోట్లోంచి మాట ఊడివచ్చింది. "నేను... నేను...ఇదే, మా అమ్మ ఈ ఇంట్లోనే ఉంటుంది—" అన్నాడు. వెంటనే భయం కూడా వేసింది వాడికి—'ఇక్కడ నుంచున్నావేమిటి-వంటమనిషి కొడుకు?' అంటారేమో ఎవరైనా. ఆ మాటవిని ఎవరినైనా పిలిచి, 'వీణ్ణి మెడపట్టి గెంటించేయ్' ఇక్కడినుంచి అంటుందేమోనని....

కాని ఆవిడ అలాంటిదేమీ చెయ్యలేదు. ఆమె ఆశ్చర్యపోతూ, "మీ అమ్మ ఈయింట్లో వుంటుందా? ఎవరు? ఏంచేస్తూ వుంటుంది? మీరిక్కడికివచ్చి యెన్నాళ్ళయింది?" అని అడిగింది.

అప్పూ నీళ్లు నములుతూ అడ్డదిడ్డం మాటలతో కొంతవరకు తనసంగతి చెప్పాడు. చిన్నకోడలు ఈసారి వచ్చినప్పుడే వీళ్ల సంగతి విన్నదల్లేవుంది. "ఓ, మీరు కాశీనుంచి వచ్చారుకదూ! నీపేరేమిటి?" అని అడిగింది. వాడి అందమైనముఖం, ఆ మాయక నేత్రాలు చూసేసరికి ఆమెకు జాలి కలిగిందల్లే ఉంది. "రారాదూ, పైన నుంచుందువుగాని, ఇక్కడెందుకు? పైకిరా..." అన్నది.

అప్పూ దొంగలాగా ఆమె వెనకాలే పైకి వెళ్ళి, ఓమూల నక్కి నుంచున్నాడు.


పైన ఆడవాళ్లంతా సభ తీర్చారు. వరండాఅంతా కార్పెట్లుపరిచి ఉన్నాయి. అటూ యిటూ గాజుతొట్లనిండా గులాబీ మొక్కలు. హాల్లో ఒకవైపున ఆర్గన్. ఒక అమ్మాయి బ్రతిమాలగా బ్రతిమాలగా వచ్చి, ఆర్గన్ముందు కుషన్ స్టూల్ వేసుకుని కూర్చుని, ఒకటి రెండుమాట్లు టుయ్ టుయ్ మనిపించి, ఒకపాట పాడింది. ఆ అమ్మాయి చూపులకేమంత అందకత్తెగాదు. చామనచాయగా ఉంటుంది. కంఠం మాత్రం కమ్మగా ఉంటుంది. తర్వాత ఇంకొక అమ్మాయి ఒకపాట పాడింది. ఈ అమ్మాయి అంత బావుండలేదు. చిన్నకోడలు కూతురు లీల ఓ హాస్యగేయం పాడి, అందర్నీ కడుపుబ్బ నవ్వించింది.

'ఈ సమయంలో అమ్మ ఒకసారి పైకి వచ్చి చూడకూడదూ? ఎక్కడున్నదో అమ్మ. ఏ వంటింట్లో పడిఉందో! ఏదైనా పనిలో ఉన్నదేమో! ఇలాంటివి మళ్ళీ ఎప్పుడు చూడకలుగుతుంది అమ్మ?' అని అనుకున్నాడు అప్పూ.

ఆడవాళ్ల సభ జరుగుతూనే ఉంది. ఇంతలో క్రిందినుంచివేదో గందరగోళం వినిపించింది. గిరీ సర్కార్ గొంతు గట్టిగా వినబడుతోంది.

దాసీ నదూ నవ్వుతూ పైకి వచ్చి చెప్పింది. "ఆఁ పాడు! చేసిన పని చూడండి. ఏం చెప్పేది! హిహిహి" "అహూతిలైన స్త్రీలలో ఇద్దరు ముగ్గురు ఏం జరిగిందే? ఏమిటి?" అని అడిగారు. "—క్రొత్త వంటవాడొచ్చాడే ఎక్కడినుంచో! పూరీలు వంపటానికి వెళ్లాడు. గుమాస్తాల భోజనశాల మెల్లాలో కూర్చుని పూరీలు వండుతున్నాడు. ఒక సారి బయటికి వెళ్లి వస్తానని చెప్పి, ఇంట్లో నెయ్యి దొంగిలించి పోతున్నాడు. అర్థ సేరుకి పైన ఉంది నెయ్యి...గుమాస్తాగారు పట్టుకున్నారు. రామ్ విహార్ సింగ్ పిలకపుచ్చుకుని కొట్టబోయాడు—"

సర్వజయకి ఇవాళ ప్రొద్దునుంచి ఊపిరి పీల్చుకోటానికి వ్యవధి లేకుండా ఉంది.



★ పథేర్ పాంచాలి ★

రెండు మణుగుల చేపలు తండసం ఆమె మీద పడింది. ప్రొద్దున ఎనిమిదినుంచి ఆమె ఈపనిలో నే ఉంది. గందర గోళం విని ఆమె లోపల్నుంచి బయటికి వచ్చి చూసేసరికి మెల్లాలో ఉన్న వాళ్లలో పాతిక ముప్ఫై యేళ్ళ వ్యక్తి, బక్క పలుచగా మాసిన గుడ్డ ఒకటి కట్టుకున్నాడు ఆ బ్రాహ్మణ యువకుణ్ణి, ఇద్దరు ముగ్గురు కలిసి, తిటడం కొట్టడం సాగించారు. అతను ఆ రోజు కని, రోజు కూలి మీద వంటకు పిలిపించబడిన వాడు. అతడు దొంగతనంగా నెయ్యి తీసు పోతున్నాట్ట! హుక్కా గుంట వేసుకు నే దాంతో...

ఆ హుక్కా ఒక ప్రక్కన పగిలిపోయి, నెయ్యి ఒలికిపోయింది. అతను తన తప్పును తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. ఇలా నెయ్యి తీసుకువెళ్ళటం మామూలేనని ఇందులో ఆశ్చర్యపడాల్సింది కాని, పంకే హింస తగిందికాని ఏమీ లేదన్న సంగతి ఆ కెచ్చిపోయిన జనానికి విచ్చచెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆమాట పూర్తికానీయకుండానే; దర్వాన్ శంభూనాథసింగ్ - అతణ్ణి ఒక్క త్రోపు త్రోశాడు. ఆదెబ్బతో 'అమ్మో' అంటూ ఒక ప్రక్కకు పోయి పడ్డాడు. తల ఓ స్తంభానికి కొట్టుకుని గట్టి దెబ్బ తగిలింది. బహుశా రక్తంకూడా వచ్చిందేమో!...

సర్వజయ క్షేమీదాసీని-"ఏం జరిగింది క్షేమీపిన్నీ! పాపం, అలా కొట్టారేమిటి బ్రాహ్మణ్ణి పట్టుకుని!" అని అడిగింది.

"కొట్టరూ? ఎముకలు విరగ్గొట్టంకే విడిచిపెట్టరు...అప్పుడే ఏమయింది! పోలీసులకు అప్పగిస్తారు... పెద్దపులి ఒడిలో గొర్రెపిల్ల కాపురమా?"

క్షేమి మాట్లాడుతున్నదల్లా చటుక్కున ఆగింది.

ఆమె మెట్లపై పుమాగ్గా అలాగే నుంచుని పోయింది సుమారు డెబ్భైయేళ్ల వృద్ధురాలు మెల్లిగా మెట్లమీదినుంచి దిగివస్తూ ఉండటం సర్వజయకూడా చూసింది. ఆమె వెంట ఈ యింటి యజమానురాలు, వెనుక కోడళు ఇద్దరూ, అరుణ-సుజాతా కూడా ఉన్నారు. దాసీలూ వాళ్లంతా కదలకుండా మెదలకుండా క్రింద వరండాలో బారుతీర్చి నుంచున్నారు. ఈమె వాళ్ల వెనుకనుంచి తొంగి చూస్తోంది. "ఆవిడ ఎవరు క్షేమీపిన్నీ?" అని అడిగింది సర్వజయ. క్షేమీ ఏదో గుసగుసలాడుతూ చెప్పింది-ఎవరో ఓ రాణీగారని—సర్వజయకి సరిగ్గా వినపడలేదు.

కాని ఇలాంటి ముఖకవళికలున్న ఆమెని ఇదివరకెక్కడో చూసినట్లు అనిపించింది సర్వజయకి. యజమానురాలు ఎవరినో పిలిచి, పెరటి గుమ్మం దగ్గరికి పాలకీ వచ్చిందేమో చూసి రమ్మని చెప్పింది. అవృద్ధురాలి వెంట ఆమె దాసీలుకూడా ఇద్దరు ముగ్గురువచ్చారు. వాళ్లు వెనకాల ఉన్నారు. ఎంతో ఆదరంతో, మర్యాదతో వీడ్కోలు ఇస్తున్నారు. ఆమెకి ఈయింటి దాసదాసీలంతా చటుక్కున సాష్టాంగపడి నమస్కరించారామెకి. సర్వజయ మనస్సులో అనుకోసాగింది—ఈమె ఎంత గొప్పదో-లేకుంటే వీళ్లంతా ఇంత గౌరవిస్తారా?-పదహారుగురు బోయీల పల్లకీ పెరటి గుమ్మందగ్గిర సిద్ధంగా నే ఉంది చాలా సేపట్నుంచి. వృద్ధురాలు అందులో ఎక్కింది. ఆమె దర్వానులు పల్లకీ వెనుక నిలబడ్డారు. ఆమెను సాగనంపి, యజమానురాలు, తక్కిన స్త్రీలు మేడమీదికి వెళ్లారు.

క్షేమి పిన్ని రొట్టెలుచేసే వంటగదిలోకి వచ్చి "డబ్బమ్మా, డబ్బు! డబ్బుకి ఎంత గౌరవమో చూశావుగా! ఆవిడకి పెద్ద జమీ ఉంది. బొంగ్లా దేశంలోని ఏకాలేజీకో రెండు లక్షల రూపాయలు విరాళమిచ్చింది-డబ్బుకి గౌరవం. ఇదుగో నే నున్నానుగా! వాళ్ళకి బంధువునికూడా...నన్నెవరు లక్ష్య పెడతారు?" అన్నది.

కాని సర్వజయదృష్టి అక్కడలేదు. ఆమెకిప్పుడే స్ఫురణకి వచ్చింది- ఇదే పోలికలు, ఇదే వయస్సులో ఉండిన తమ ముసలి ఇందిరమ్మ-వాలికలై పోయిన పంచె ముడి వైచుకుని కట్టుకునే ఆమె-వెనవది ఒక్క సీతాఫలంకోసమని ఎంత అవమానపడింది!... మిట మధ్యాహ్నమపుడు ఇంట్లోనుంచి వెళ్లగొట్టటం...నడివీధిలో ఆమె దిక్కులేని చావు... సర్వజయకి కన్నీళ్లు కట్టుపడలేదు.

అంతిక్యేదన మానవుల్ని మృత్యువు అవతలి తీరానికి చేర్చుతుందో లేదో సర్వజయకి తెలియదు. అయినా ఆమె ఇవాళ అపరిణత వయస్సులో తానుచేసిన అపరాధానికి మనసులో క్షమాపణ కోరుకుంటూ ప్రాయశ్చిత్తం చేసుకో తలచింది.

34

కొన్నాళ్లయిపోయాక - ఓనాడు అపూ లోపల వరాండాలోంచి వెడుతూంటేగా పైనుంచి చినబాబుగారి అమ్మాయి లీల మెట్లు దిగి వస్తోంది. వాడిని చూడగానే "ఇదుగో, ఆగు. నీ పేరేమిటి? అపూకదూ!" అన్నది.

"అపూ అని మా అమ్మ పిలుస్తుంది. అసలు పూర్తిపేరు శ్రీ అపూర్వ కుమార రాయ్" అన్నాడు అపూ.

వాడు కొంచెం తెల్లబోయాడు. ఈ యింట్లో పిల్లలెవరూ ఎన్నడూ తనని పిలిచి మాట్లాడరు. లీల దగ్గరకువచ్చి నుంచుంది. ఎంత చక్కని ముఖం! రాణూదీ అతసీదీ, అమలాదీ అందరూ బాగానే వుండేవాళ్లు. అప్పుడు అంతకంటె చక్కని ముఖాలను చూసి యెరుగడు. ఈ ఇంటికి వచ్చినప్పట్నుంచీ వాడి వెనుకటి అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా చిన్నకోడలంత చక్కనివాళ్లు ఉంటారనేది వాడి ఊహకుకూడా అందని విషయం. లీలకూడా తల్లిఅంత చక్కనిది. లీల ఆరోజున హాస్య గేయం పాడినప్పుడు అపూ ఆ అమ్మాయి ముఖంకేసే చూస్తూ నుంచున్నాడు. ఆ గేయం సరిగ్గా విననే లేదు.

"మీరు మా యింటికివచ్చి ఎన్నాళ్లైంది? క్రితంసారి ఇక్కడికి వచ్చినప్పుడు లేరే!" అన్నది లీల.

"మేము ఫాల్గున మాసంలో వచ్చాం. ఈ ఫాల్గున మాసానికి—"

"ఎక్కడినుంచి వచ్చారు?"

"కాశినుంచి. మా నాన్న అక్కడే పోయాడు—"

వాడికేమిటో విశ్వాసం కుదరటం లేదు ఈ సంఘటనంతా అవాస్తవంగానూ, అసంభవంగానూ తోస్తోంది వాడికి లీల—చిన్నకోడలిగారి కూతురు లీల—తనని పిలిచి మాటాడుతోంది! ఆనందంతో వాడి శరీరం గరిపొడుస్తోంది...

"నేను చదువుకునే గదిలోకి వెడదాం రా. మాష్టారు వచ్చే వేళయింది." అన్నది లీల.

"నేను రానా?" అని అడిగాడు అపూ.

లీల నవ్వుతూ "అరె! రమ్మంటున్నానుగా! నీకు యెక్కడలేని సిగ్గు! రా, నేను చదువుకునే గది చూడలేదా నువ్వు? ఆ పడమటివైపున-" అన్నది.

గది అంత పెద్దదేంకాదు. కాని చక్కని గది. ఓ పాలరాతి టేబుల్ దానికి అటూ యిటూ రెండు కుషన్ కుర్చీలున్నాయి పెద్దబొమ్మ క్యాలెండర్ ఒకటి. అద్దపుచ్ఛవనిగాజు కేసులో ఓ టైంపీసు, పుస్తకాల షెల్ఫ్ ఒకటి. నాలుగయిదు ఫొటోలుకూడా ఉన్నాయి ఈగోడకి,ఆగోడకి .. లీల ఓ లెదర్ బాగ్ తెరచి, "ఇవిగో నా సీటిబొమ్మలు, మాష్టారు కొనిపెట్టారు. భాగారాలు నేర్చుకుంటే ఇంకా కొనిపెడతానన్నారు. ఈ బొమ్మలు తడిపి అచ్చువెయ్యటం చేతవునా నీకు?" అన్నది.

"నీకు భాగారాలురావూ?" అని అడిగాడు అపూ.

"నీకు వచ్చా? నువ్వు చెయ్యగలవా?"

అపూ నిర్లక్ష్యంగా పెదవి విరచి "అదో, ఎప్పుడో వచ్చు నాకు" అన్నాడు. ఆ భంగిమలో అపూ ముఖం ఇంకా అందంగా కన్పించింది.

లీల నవ్వుతూ-"నువ్వు భలేగా మాట్లాడతావే!" అని అపూ పెదవిక్రింద చేయి పెట్టి, "ఇదేమిటి? పుట్టుమచ్చా!" నీముఖానికి ఎంతో బావుంది. నీ కెన్నేళ్లు? పదమూడా! నాకుపదకొండు. నీకంటె రెండేళ్ళు చిన్న నేను—" అన్నది.

"నువ్వు ఆరోజున పాడిన హాస్యపుపాట చాలా బాగావుంది నాకు" అన్నాడు అపూ.

"నీకు కవిత్వం తెలుసా!"

"తెలుసు. మా నాన్న దగ్గర ఓ పుస్తకం ఉండేది. అది చూచి నేర్చుకున్నాను."

"చదువుతావా!"

లీల కంఠమంత తియ్యని కంఠం అపూ ఇదివరకెప్పుడూ వినలేదు...వాడొక గేయం చదివాడు......

"దాశురాయ్ గేయాల్లోవివి. నా దగ్గర ఆ పుస్తకం ఉంది" అన్నాడు అపూ.

లీల పొట్ట చెక్కలయేట్లు నవ్వింది. "నీకు భలే మాటలు చేతవునే. ఇంతిలా నవ్విస్తున్నావే-"

లీల పొగడ్త వింటూంటే వాడికి పట్టలేని ఆనందం కలిగింది. అపూ సంతోషంతో "ఇంకొకటి చదవనా"....నాకు చాలా

★ పథేర్ పాంచాలి ★

తప్పు..." అన్నాడు. ఆ గేయాలకి అర్థం ఏమిటో లీలకి తెలియదు. కాని అపూ ఇంకొకటి చదివేసరికి మళ్ళీ కడుపుబ్బనవ్వి- "రాసుకుంటాను, 'ఉండు" అన్నది. లీల లెదర్ బాగ్‌లోంచి, కలం ఒకటి బయటికి తీసి, "చెప్పు" అన్నది.

అపూ చెప్పటం మొదలెట్టాడు. కొంచెం సేపయాక తెల్లబోతూ, "సిరా ముంచకుండా ఎలా రాస్తున్నావ్?" అని అడిగాడు.

"ఇది ఫౌంటెన్ పెన్. సిరా ముంచనక్కరం లేదు, దీనినిండా పోసి ఉంటుంది, తెలియదూ నీకు?"

లీల అపూ చేతి కిచ్చింది కలం. అపూ దాన్ని అటు త్రిప్పి, ఇటు త్రిప్పి చూసి, "బావుందిది. సిరా ముంచనే అక్కర్లేదు" అన్నాడు.

"అదికాదు. సిరా ముందు దీన్నిండా పోసుకోవాలి. ఇదుగో చూడు, చూపిస్తాను—"

"బావుంది. ఏదీ ఒక్కసారి చూడనియ్—"

లీల కలాన్ని ఇచ్చేసి-"నీకు అచ్చంగా ఇచ్చేస్తున్నాను" అన్నది.

అపూ తెల్లబోయి లీల ముఖంకేసి చూశాడు. తర్వాత సిగ్గుపడుతూ- "నేనుతీసుకోను" అన్నాడు.

"ఎందుకని?"

"ఉహూఁ తీసుకోను."

"ఎందుకని?"

"ఉహూఁ వద్దు."

లీల కొంచెంచిన్న బుచ్చుకుంది. "తీసుకోరాదూ? నేను మా నాన్నని అడిగి ఇంకొకటి తీసుకుంటాను. నువ్వు ఇది తీసుకో. చూడనియ్, ఏదీ నీ చెయ్యి? ఒస్...ఇంక తిరిగి ఇవ్వకూడదు మళ్లీ."

ఇదంతా అపూ మనస్సుకి ఒత్తిడిగా తోచసాగింది. "నిన్నెవరైనా తిడతారేమో!" అన్నాడు అపూ.

"ఫౌంటెన్ పెన్ ఇచ్చినందుకా? ఎవరూ తిట్టరు. అపూకిచ్చేశాను అని చెప్తాను మా అమ్మతో—మా నాన్ననడిగి ఇంకొకటి తీసుకుంటాను. మా నాన్న ఫోటో చూస్తావా?......ఆ క్యాలెండర్ ప్రక్కన ఉంది అదే. ఉండు తీస్తాను."

తర్వాత లీల ఇంకా రెండు మూడు ఫోటోలు చూపించింది. అలమరలోంచి కొన్ని పుస్తకాలు బయటికితీసి, "మాష్టారు కొని ఇచ్చారు. నువ్వు ఏ స్కూల్లో చదివావ్?" అన్నది.

అపూ అప్పుడు కొన్నాళ్లు ఆ కాశీలో స్కూల్లో చదవటమే, మళ్ళీ వీలుపడలేదు. "కాశీలో ఉండగా చదువుకున్నాను. ఇక్కడకొచ్చాక చదువుకోవటంలేదిహ." ఆ మాట చెప్పటానికి సంకోచంగా ఉండటంవల్ల—ఆ చివరిమాట—చదువుకోకపోవటమే మంచిదన్న ధోరణిలో అన్నాడు.

ఓ పుస్తకంలో చాలా బొమ్మలున్నాయి. అపూ అదిచూసి, "ఇది ఒకసారి చదువుకోటానికి ఇస్తావా?" అని అడిగాడు. "తీసుకో నాకింకా చాలాఉన్నాయి బొమ్మల పుస్తకాలు. మూడుసంవత్సరాలవి బైండ్ చేయించిన 'ముకుల్' ఉంది—అమ్మగదిలో అలమరాలో, తెచ్చి ఇవ్వనా? చదువుకుంటావా?—" అన్నది.

"నాదగ్గిరా ఉన్నాయి పుస్తకాలు. తీసుకురానా?"

"పద, నీగదిలోకే వెడదాం" అన్నది లీల.

లీలను తనయింట్లోకి తీసుకెళ్ళటానికి అపూకి సిగ్గుగాఉంది. కుర్చీలూ అవీ యేమీ లేవు. చిరిగిపోయిన మెత్తఒకటి, దళ్ళెం మీదవేసిన బొంత ఒకటితప్ప. అయినా లీల వెళ్ళింది. అపూ తన సినారేకు పెట్టెలోంచి ఏదో ఓ పుస్తకంతీసి చూపిస్తూ-సగర్వంగా-

"నేను వ్రాసినదిది. ఇదిగో చూడు అచ్చులో ఉంది నాపేరు." అన్నాడు.

లీల గబుక్కున వాడి చేతిలోంచి ఆ పుస్తకం లాక్కుని, "ఏదీ, చూడనియ్, చూడనియ్" అన్నది.

అది కాశీలోని ఆ స్కూల్ మ్యాగజైన్. పుత్రవాడు రాసినకథ అచ్చుఅయిరావటం హరిహరుడు చూడలేదు. అతడు చనిపోయిన మూడురోజులకి బయటికివచ్చిందా మ్యాగజైన్. లీల చదువుతోందది. అపూ లీల ప్రక్కనే కూర్చుని, ఆ అమ్మాయి చదువుతున్న పంక్తులు—తానుకూడా లోపల్లోపల మరొకసారి ఆవృత్తి చేసుకోసాగాడు. లీల చదవటం పూర్తిచేసి, అపూ ముఖంకేసి, ప్రశంసాపూర్వకంగా చూసి, "చాలా బావుంది. నేను తీసుకునివెళ్ళి మా అమ్మకు చూపిస్తాను" అన్నది.

అపూ కెక్కడలేని సిగ్గూ వేసింది. "వద్దు" అన్నాడు.

లీల వినిపించుకోలేదు, ఆ సంచిక చేత పట్టుకుంది. "నిశ్చిందిపురం"అని రాసిఉంది. "ఎక్కడ ఆ ఊరు?" అని అడిగింది లీల.

"నిశ్చిందిపురం మా ఊరు. మా స్వంత యిలున్నది అక్కడే అసలు. ఏడాదిక్రితమే మేము కాశీ వచ్చింది—"

ఈ సమయంలో, మోక్షదా గుమ్మంలోకి వచ్చి నిలబడి, లోపలికిచూసి, "అమ్మాయిగారూ! మీ రిక్కడికివచ్చి కూర్చున్నారా? అక్కడ మాష్టారొచ్చి కూర్చున్నారు. నేను మేడమీద, క్రిందగదులన్నీ వెతికలేక సతమతమయిపోయాను. అయినా మీరు ఇక్కడికొంపలో ఉంటారని ఎవరికి తెలుసు? రండి, రండి..."అనిపిలిచింది.

"నువ్వుపో, నేను వస్తానులే—" అన్నది లీల.

"కూర్చోదగిన చోటా ఇదీ? మాలాంటి వాళ్ళకే తలనొప్పిగా ఉంటుంది. ఆ గుర్రాల సావడిలో హిందుస్తానీ నౌకర్లు వాళ్ళు గుర్రాలదగ్గిర శుభ్రంగా బాగుచేస్తారో ఏమన్నానా? చూశారా ఎంత పాడు వాసన కొడుతోందో! రా, అమ్మా, చప్పున రా" అన్నది మోక్షదా.

"నేను రానుపో, నేనివాళ చదువుకోను. పోయి చెప్పుకో, పో. ఇక్కడికివచ్చి ఎవరు

అరవమన్నారు నిన్ను? వెళ్లి అమ్మతో చెప్పు, పో..." అన్నది లీల.

మోతుదా ఖడబడలాడుకుంటూ వెళ్ళింది.

"మీ అమ్మ కేకలెయ్యదూ? ఆమెని అలా అన్నావు దేనికి?" అని అడిగాడు అప్పూ.

మర్నాడు మధ్యాన్నం అప్పూ తనయింట్లో నిద్రపోతున్నాడు. ఎవరో కుదపటంతో మెళుకువవచ్చి, కళ్లు తెరిచి చూసేసరికి, లీల నవ్వుతూ ప్రక్కన కూర్చునిఉంది. తాను క్రింద చాపవేసుకుని పడుకుని నిద్దరోతున్నాడు, లీల మోకాళ్లమీద కూర్చుని, తనని నిద్రలేపుతోంది. ఇంకా అలాగే కాతుక దృష్టితో తనకేసి చూస్తోంది...నవ్వుతూ, "భలే, మధ్యాహ్నమప్పుడు ఇలా పడుకుని నిద్రపోతారేమిటి? నేను బయటినుంచి పిలిచాను. లోపలికివచ్చి చూసేసరికి మంచి నిద్రలో..." అన్నది.

అప్పూ చొక్కా అంచుతో కళ్ళు తుడుచుకుంటూ, గబగబా లేచి కూర్చున్నాను. "ప్రొద్దున చదువుకోడానికి రాలేదేం? ఆ చదువుకునేగదీ—అవీ అన్నీ చలికావు నేను. ఎక్కడా ఎవ్వరూ లేరు—" అన్నాడు.

లీల అప్పూ స్కూల్ మ్యాగజైన్ కాపీ చేతికిస్తూ—నిన్న రాత్రి అమ్మకు చదివి వినిపించాను నేను. అమ్మకూడా చదివింది" అని చెప్పింది. అప్పూ ఒళ్లు గరిపొడిచింది. అపరిమితమైన లజ్జ, సంకోచం కలిగాయి... చిన్నకోడలుగారు తన కథ చదివిందా!

"నాగదికి వెడదాం రా, నీకోసం 'సఖా-సాక్షి' బైండుచేసింది తీసుకువచ్చాను" అన్నది లీల.

అప్పూ దక్షిణంకేసి చూశాడు. తన మంచి లాగూ చొక్కా ఇంకా ఆరలేదు. ఇప్పుడు తొడుక్కుని వాటితో బయటికి వెళ్లడానికి వీల్లేదు. "ఇప్పుడు రాను నేను" అన్నాడు.

లీల ఆశ్చర్యపోతూ "ఎందుకని?" అని అడిగింది.

అప్పూ పెదవులు బిగించి, చిరునవ్వు ముఖంతో తల త్రిప్పాడు. అలాంటప్పుడు తన ముఖం ఎంత అందంగా ఉంటుందో వాడికి తెలియదు.

లీల రమ్మని బ్రతిమాలింది.

అప్పూ మళ్లీ అలాగే తల అడ్డంగా త్రిప్పుతూ నవ్వాడు.

"అబ్బా! ఎంత మొండివాడివి నువ్వు? 'రాను' అంటే ఇహ దానికి తిరుగు లేదల్లే ఉంది. సరే, ఉండు, పుస్తకం ఇక్కడికే—"

అప్పూ ఆపుకోలేక పకపక నవ్వాడు.

"అంత నవ్వు దేనికి? ఏమయింది, చెప్పు. చెప్పవనటానికి వీల్లేదు చెప్పు" అన్నది లీల.

అప్పూ నవ్వుముఖంతో దక్షిణంకేసి చూస్తూ సైగచేశాడు. ఏమీ మాట్లాడలేదు.

ఇప్పుడు లీల గ్రహించింది. దక్షిణం దగ్గరకు వెళ్లి, చెయ్యివేసి చూసి, "కొంచెం ఆరాయి. నువ్వు ఇక్కడే వుండు, నేను పుస్తకం తీసుకొస్తాను—ఫౌంటెన్ పెన్‌తో రాశావా? ఎలా ఉంది? బాగా రాయటం లేదూ?" అన్నది.

తర్వాత లీల తెచ్చిన పుస్తకం చూస్తూ చాలాసేపు గడిపారు ఇద్దరూ. పుస్తకం చాపమీద పెట్టి, ఇద్దరూ పరవనే మోకాలి దండే వేసుకు కూర్చుని, పుస్తకం మీదికి వంగి, చూస్తున్నారు. పట్టు కుచ్చులాంటి లీల కేశాలు, చొక్కా లేని అప్పూ శరీరానికి తగిలి, గిలిగింతలు పెడుతున్నాయి. లీల చటుక్కున పుస్తకం మీదినుంచి తల పైకెత్తి—"నీకు పాట వచ్చా?" అని అడిగింది.

అప్పూ తల ఊగించాడు.

"అయితే ఒకటి పాడు"

"నీకు వచ్చా?"

"ఏదో కొంత కొత్త—పెళ్లిలో ఆ రోజున వినలా?"

మోతుదా వచ్చి గదిలోకి తొంగిచూసి, "ఇదిగో, అమ్మాయి గారిక్కడ ఉంది. నేనడుకున్నట్టే అయింది. మేడమీదా లేక, చదువుకునే గదిలోనూ లేకపోయేసరికి వచ్చి తంగా ఇక్కడికే—ఇలా రా అమ్మా, ఈ పాలు కాసినీ త్రాగి వెళ్లమ్మా, దొరికారు ఎలాగో—వీటిని పుచ్చుకు తిరుగుతూ వెతకలేక సతమత మవుతున్నాను," అన్నది.

ఓ చిన్న వెండిగ్లాసు నిండా ఉన్నాయి పాలు. "అక్కడ పెట్టి వెళ్లు, తర్వాతవచ్చి గ్లాసు తీసుకు వెడుదువుగాని—" అన్నది లీల.

ఆ దాసీది వెళ్లిపోయింది. ఇంకాస్సేపు పుస్తకంలో బొమ్మలు చూడటంతో సరిపోయింది. ఒక్క చిటికెలో లీల ఆ పాలగ్లాసు తీసుకుని, "నువ్వు సగం త్రాగు" అన్నది.

అప్పూ సిగ్గుపడుతూ "ఊ హూఁ" అన్నాడు.

"నిన్న ప్రతిదానికీ బ్రతిమాలాలల్లే వుందే—మా పంజాబ్ ఆవుపాలు. త్రాగు. ఎంత తియ్యగా ఉంటాయని! మంచివాడివిగా నువ్వు—!" అన్నది లీల.

అప్పూ కళ్లు చిట్లించి—"ఊఁ. మంచివాడినా! నీదంతా చాలా ఇదేనే! అమ్మ మళ్లీ—" అన్నాడు.

లీల పాలగ్లాసు అప్పూ నోటిదగ్గిర పెట్టి "ఇంకా సిగ్గెందుకు? నేను కళ్లు మూసుకుంటానులే, త్రాగు" అన్నది.

అప్పూ ఒక్కగుక్క త్రాగేసి, మూతి ఇవతలకు తీసుకున్నాడు. పెదిమలకుఅంటుకున్న పాలను గబుక్కున తుడిచేసుకుంటూ నవ్వాడు.

లీల ఆగ్లాసు నోటిదగ్గిర పెట్టుకుని మిగిలిన పాలు త్రాగేసింది. తర్వాత ఆ అమ్మాయి కూడా కిలకిల నవ్వింది.

"చాలా తియ్యటి పాలు కదూ?"

"నా ఎంగిలి త్రాగావు ఎందుకు? ఇంకొకరి ఎంగిలి త్రాగొచ్చా?" అన్నాడు అప్పూ.

"నా యిష్టం" అని కాసేపాగి, "నీకు నీటిబొమ్మలు తీయటం వచ్చునన్నావుగా! ఏం వచ్చు? ఇవాళ నా. నీటిబొమ్మలు అతికించి తియ్యి కొనిని" అన్నది లీల.

(ఇంకా వుంది)

వాడిన మొగ్గ

(1)

ఏ. అనసూయ

టౌన్ సెంటర్ బ్లూలైట్ కాంతుల్లో రాసులు రాసులుగా పోసిఉన్న మల్లెపూల ముందు నిలబడి అమ్మేవాళ్ళ కంఠాలు గోలగా వినిపిస్తున్నాయి. విరబూసిన మల్లెవాసనలు టౌన్ నాలుగు మూలలకూ ప్రాకి ప్రాకి మానవు లందరికీ రాత్రి సమీపిస్తూందన్న జ్ఞానం కల్గిస్తున్నాయి.

పగలంతా కాన్పు కేసులుచేసి, చేతులు కడుక్కొని హాస్పిటల్లోనుంచి బైటకువస్తున్న లేడీనర్సు మీదుగా మల్లెపూల గాలులు ప్రాకి ప్రాకి సుళ్లుతిరిగి హాస్టలు విద్యార్థుల నాసాపుటాల్లోకి ప్రసరించాయ్. గజనీ దండయాత్రలా "ఈ ఒక్కసారి ప్రయత్నించి చూద్దా"మని కెమిస్ట్రీ ఈక్వేషన్లు భట్టీయం వేస్తున్న ప్రౌఢ విద్యార్థికి ఆ గాలులు సోకి మతి చెడిపోయింది.

గవర్నమెంటు ఆఫీసులకూ, మల్లెపూల వాసనలకూ చాలా దూరమే అయినా తమ తప్పులేకుండా పూలవాసనలు కలెక్టర్ ఆఫీసు కుహరాల్లోకి చొచ్చుకుపోయాయి. చిత్ర విచిత్రమైన సంజకాంతులు కరిగిపోయి, బ్లూలైట్ వెలుగుల్లో కలిసి టౌన్ అంతా వెన్నెలలు అలముకొని మల్లెపూల వాసనలు క్రుమ్మరిస్తున్నా, కలెక్టర్ ఆఫీసు మాత్రం ఫైళ్ళలో స్తంభీభూతమైపోయి ఉన్నది. జడప్రాయమైన ఆ వాతావరణంలో ఇంత చైతన్యం తెచ్చుకొని ఫైలు మూసేసి కోటు తగిలించుకొని, గబగబా బైటకు వచ్చినవాడు ఒక్క సుందరరావే!

కాలేజీ టైమైంతర్వాత కాసేపు పార్కులో కాలం గడిపి, ఇంటికిపోతూ, సుందరరావును కూడా కలుపుకు పోదామని కలెక్టరాఫీసు గేటులో ఆగిన ఫిలాసఫీ లెక్చరర్ శర్మను చూచేసరికి సుందరరావుకు ప్రాణం లేచివచ్చింది.

పూలదండలు చేతులకు తగిలించుకొని మల్లెపూలమ్మే కుఱ్ఱవాళ్లు రొదచేస్తూ శర్మనూ, సుందరరావునూ చుట్టుముట్టారు. సుందరరావుకు, ఇంటిదగ్గర పెద్దబ్బాయి పుట్టిన పండుగ ఆనాడే అని భార్య ఉదయం గుర్తుచేసిన సంగతి జ్ఞప్తికి వచ్చింది. బుట్టనిండా మల్లెపూలు కొనేశాడు.

శర్మ రెండడుగులు నడిచాడు. సుందరరావు శర్మకు ఒక మల్లెపూల పొట్లం అందించాడు. శర్మ అక్కర్లేదంటూ మరి రెండడుగులు నడిచాడు. సుందరరావుకు నవ్వు వచ్చింది.

"నా కిద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలూ; తలమీద ఒకటి రెండు వెంట్రుకలు తెల్లబడ్డట్టు కూడా అనుమానం; అయినా నాకీ పూలమీద మనసు తీరలేదు శర్మా!"

పెదవి కదిలీ కదలకుండా శర్మ చిన్నగా ఒక నవ్వు నవ్వి తన కీయవచ్చిన పూల పొట్లము సుందరరావు బుట్టలో పడవేసి అతని ప్రక్కగా నడవసాగాడు.

"నీ వెంత ఫిలాసఫీ లెక్చరర్ వైనా, కాపుర మేర్పడి నీ కింకా రెండేళ్ళన్నా కాలేదు శర్మా! ఏమో నీ యీ వైరాగ్యం నాకు నచ్చలా!" సుందరరావు నవుస్తూనే గట్టిగా నవ్వాడు.

"నీవు మహారసికుడవు" పెదవిపై ఏమాత్రం హాసరేఖ లేకుండా నెమ్మదిగా, పలికాడు శర్మ.

ఇంతలోకే ఇల్లు రానేవచ్చింది. శర్మ, సుందరరావు ఒకే ఇంట్లో రెండు సమాన భాగాల్లో అద్దె కుంటున్నారు. మధ్యగదులకు, వంటగదులకు మధ్య గోడలున్నాయి కాని వెనక దొడ్డి, ముందు మెట్లూ, దొడ్డీ ఇద్దరూ ఉమ్మడిగా వాడుకొనేవే.

సుందరరావు బైట తలుపు కొట్టాడు. సుందరరావుగారి చిన్నమ్మాయి, గబగబా వచ్చి తలుపుతీసింది. "నాన్నగారూ, మామయ్యగారు కూడా, ఇవ్వాళ మనింట్లోనే భోజనమట! పెద్దన్నాయి పుట్టిన రోజు పండుగని మామయ్యతో చెప్పమని అమ్మ చెప్పింది." నవ్వుకుంటూ, శర్మ సుందరరావు చిన్నమ్మాయిని బుజాన వేసుకొని లోపలికి వచ్చాడు. "మన యింట్లో ఉండే మామయ్యను ప్రత్యేకంగా పిలవాలా అమ్మా!" అంటూ సుంద్రరావు లోపల అడుగు పెట్టాడు. లోపల పెద్దబ్బాయి పుట్టినరోజు పండుగ పేరంటం అంతా అయిపోయి, ముత్తైదువల కలకలం అంతా సద్దుమణిగి ప్రశాంతంగా ఉన్నది.

సుంద్రరావుగారి చిన్నమ్మాయిని బుజాన వేసుకొని శర్మ తానుండే భాగంలోకి వెళ్లాడు. బైట తాళం పెట్టి ఉన్నది. బుజానున్న చిన్నమ్మాయి శర్మముఖంలోకి చూస్తూ చెప్పింది. "ఇవ్వాళ మా యింట్లో భోజనం చేయకుండా తప్పించుకోవాలని చూస్తున్నావా, మీయింట్లో తిందామన్నా అత్తయ్య ఇంట్లో లేదుగా,"

"ఎట్లా వెళ్ళింది తల్లీ" శర్మ మెల్లిగా అడిగాడు.

"మడమకింద ఎత్తుగా ఉండే చెప్పులు తొడుక్కుని డోర్యాల్ డోర్యాల్ గాఉండే సిల్కుచీర కట్టుకొని, కళ్ళజోడు పెట్టుకొని, చేతులో చిన్న సంచి పట్టుకొని టకాటకా నడుస్తూ వెళ్ళిపోయింది మామయ్యా! మా అమ్మ అత్తయ్య దగ్గరకు పోయి "ఒదినగారూ, అబ్బాయి పుట్టినరోజు పండుగ, పేరంటానికి రం"డని చెప్తున్నా; "ప్షా" టైమైందంటూ చకచకా వెళ్ళిపోయింది. మామయ్యా, సరే కాని "ప్షా" అంటే ఏమిటి మామయ్యా"


శర్మకు ముఖమంతా చెమటలు పోసింది. మెల్లిగా పెదవి కదిలిస్తూ "'ప్షా' తల్లీ, అంటే.... తెంమీద-బొమ్మలాడడం."

శర్మకు అక్కడ నిలవ బుద్ధి పుటలేదు. శర్మకు కాళ్లు కడుక్కోవడానికి నీళ్లు తెచ్చిద్దామని సుంద్రరావు లోపలికి వెళాడు. సుంద్రరావు భార్య ఇద్దరికీ భోజనపు ఏర్పాట్లు చేస్తూంది. శర్మ చరచరా బైటకు వచ్చాడు. దగ్గరున్న పార్కుకు వెళ్లి బెంచీ మీద కూలబడ్డాడు. మనస్సు పరిపరి విధాలుగా ఆలోచించ సాగింది.

"శారద బి. ఏ. ప్యాసైన అమ్మాయి. సుందరరావు ఇంటర్ కూడా ప్యాస్ కాలేదు. అయినా సుంద్రరావంటే శారదకు దైవసమానం;

శారద బ్రతిమాలి పేరంటానికి రమ్మన్నా, పోకపోవడానికి తను శారదకంటె ఎందులో గొప్ప? ఫర్ఫ్ ఫారం కూడా ప్యాస్ కాలేదే! తోట యిల్లాలు పిల్చిందన్న గౌరవంతోనైనా పేరంటానికిపోయి ఉండవచ్చునే!"

పార్కు గేటు మూసేవేళైంది. శర్మ ఇంటికి మెల్లగా నడిచివెళ్లాడు. పుష్పావతి అప్పుడే రిక్షాలో నుంచి దిగి ఏపుల్సు, ద్రాక్ష, టూత్ పేస్టు, హిమాలయాబొకే,



రమ్య

—ఫొటో: బి. రవీంద్రనాథ్.

పోన్న, ఉన్న బుట్ట లోపలపెట్టమని రిక్షా వాడికి చూపిస్తూ లోపలికి పోయి టార్చి వేసి తాళం తీసి స్విచ్ నొక్కింది.

పార్కునుంచి కాళ్ళీడ్చుకుంటూ వచ్చిన శర్మ లోపలి మెల్లాలోకి వచ్చి నవారు మంచం, వాల్చుకొని పక్క లేకుండానే చేరగిలబడ్డాడు.

కుర్చీలో కూర్చొని, కళ్ళజోడు తీసి, టేబిల్ ఫాన్ స్విచ్ వేసి హైహీల్ షూ విప్పుతూ పుష్పావతి అడిగింది.

"ఏమండీ, పనిమనిషి కారియర్ తెచ్చిందా?"

"తేలేదు"

"అసలిక్కడకు వచ్చిపోయిందా?"

"నేనున్నంత సేపట్లో రాలేదు"

"పోనీ, మీరైనా కబురుచేయకూడదూ?"

"కారియర్ హోటల్ నుంచి నేనే తెద్దామనుకున్నాను. కారియర్ లోపలుందేమో! తలుపు తాళం వేసి ఉన్నది"

"అవును మీరే తేస్తారు; మీ రెందుకు: నేనైనా హోటలుకు పోయి తీసుకు రావచ్చును. ఇక ఆ కాస్త లజ్జ మిగిలిఉన్నది" అంటూ పుష్పావతి టేబిల్ మీద ముఖం ఆనించి అట్లాగే పడుండిపోయింది.

శర్మ మంచం మీదనుంచి లేచివచ్చి టేబిల్ అంచుమీద సగం కూర్చొని అన్నాడు. "తప్పులేదు పుష్పా. హోటల్ నుంచీ కారియర్ నీవు తెచ్చినా, నేను తెచ్చినా తప్పులేదు. వంట నీకు అలవాటు లేనప్పుడు నేనైనా వండవచ్చు: మరి నాకు కాలేజీ పనెంది."

"వీలైతే కాలేజీ పనికి సెలవు పెట్టి కూడా ఇంట్లో వంట చేసుకోవచ్చు. కాని మరి నేను బ్రతికి పోయానుగదా!"

పుష్పావతి చెక్కిళ్లమీద కన్నీళ్లు కారడం ప్రారంభించాయి.

"సుఖం అనేది మనస్సు సర్దుకొని తృప్తి పడడంలో ఉంటుంది పుష్పా" ఉంగరమైనా లేని శర్మ పలుచని పొడుగైన వేళ్లు పుష్పావతి చెక్కిలిపుణికి రాల్చి నెకెన్ లో మెరిసిపోతున్న ఆమె కంఠం క్రిందుగా జారిపోయాయి.

"మీ ఫిలాసఫీ అర్థం చేసుకునే ఓర్పు నాకు లేదు. నేను మనిషిగా బతకాలి" పుష్పావతి చటుక్కున లేచి అవతలకి పోయింది.

శర్మ ఆలోచనలో పడ్డాడు. "నే చెప్పిన ఈ రెండు మాటల్లో నిజంగా ఫిలాసఫీ ఉన్నదా? ఎందుకు లేదు? ఇదీ ఒక ఆలోచనా రీతే గదా? అయినా నే నేమన్నా సోక్రటీస్ నా?........పుష్పావతి మనిషిగా బ్రతకడానికి నా ఫిలాసఫీ ఒక అభ్యంతరమా? నేను మనిషిలా కనిపించడం లేదూ?"

ఎదురుగా ఉన్న నిలువుటద్దంలో శర్మ ప్రతిబింబం కనిపించింది; కాళ్లమీద జీరాడే పుల్లదోవతి; నెను గుడ్డ లాల్చీ; మెడను చుట్టుకున్న బిళ్లమడత ఉత్తరీయం;

★ వాడిన మొగ్గ ★

తైలసంస్కారమైనా లేని మెలిదిరిగిన జుట్టు; పొడుగ్గా ఎఱ్ఱగా ఉన్న ముఖం;

"కాపురానికి వచ్చిన తొలినాళ్లలో పుష్పావతి మనస్సులో చిత్రించుకున్న తన భావిక అలంకరణకూ, తానుఉంటున్న పద్ధతికీ సంబంధంలేదు. ఔను! కాలేజిగ్రూపు ఫోటో లన్నిటిలో అందరూ నిండు సూటులో ముస్తాబై అందాలొలక బోస్తూంటే, పాతపద్ధతి తెలుగు పండితుడులా తన యీ చాదస్తపు వేషం ఏమిటి? ఈ వేషంలో తాను పుష్పావతి ప్రక్కన నిలబడితే తనను ఆవిడ భర్తగా ఎంతమంది పోల్చుకోగలరు?

ఒక్కగా నొక్క కూతురు—గారాబంగా పెరిగిన కలవారింటిబిడ్డ—పుష్పావతికి తనతో కాపురం నిజంగా ఏమీ సుఖంగా లేదేమో! ఇందులో తన తప్పేముంది? పుష్పావతి బంధువులు, ఆవిడ తలిదండ్రులు అందరూ పట్టుబట్టి చేసిన వివాహమేగదా? ఇప్పుడీ వైముఖ్యం ఎందుకు?

ఎంతసేపాలోచించినా శర్మ తను చేసిన తప్పేమిటో తెలుసుకోలేకపోయాడు.

ముక్కలు ముక్కలుగా కోసిన ఏపుల్సు, ద్రాక్షపండ్లు ఒక ప్లేటులో పెట్టుకొని పుష్పావతి శర్మ ముందుంచి వెళ్లిపోయింది.

ప్రక్కయింటిలో పిల్లల్ని నలుగురినీ దగ్గర పండుకోబెట్టుకొని కూరుకు తీస్తున్న శారదకు మెలకువవచ్చి భర్తను తట్టిలేపింది.

"అన్నయ్యగారు వచ్చినట్లున్నారు; భోజనానికి పిలుస్తారా?"

"ఆమె కూడా వచ్చింది, ఇద్దర్నీ పిలవనా?"

"ఆ, పోదురూ, వస్తే ఆయన్ను పిలవండి"

"అయితే కదలకుండా పడుకో."

"ఈ ఫలహారం అయినా తీసుకుపోండి, ఇంత తిని మంచినీళ్లు త్రాగి పడుకొంటారు, ఆ కాకపోయినా ఈ హోటలు భోజనాలేమిటి?...మన కెందుకు లెండీ!" రెండు పళ్ళాలతో ఫలాహారం పుచ్చుకొని సుందర్రావు శర్మగారి గదిలో అడుగుపెట్టాడు.

శర్మకు సిగ్గయింది. మాట్లాడటానికి ఏమీ తోచక "ఇంత ప్రొద్దుపోయి మీరూ మేలుకున్నారా?" అన్నాడు.

సుందరావు వెనకనే శారద కూడా చంటిపిల్లను భుజాన వేసుకొని నిలువబడి "వదినెగార్ని కూడా కొంచెం ఫలహారం చేయమని చెప్పండి" అని తిరిగి పోయి పండుకున్నది.

"అట్లాగే తీసుకుంటాములే. పోయి పండుకో సుందరం" అని శర్మ తెచ్చికోలు మర్యాద జరిపాడు. సుందరావు కూడా వెళ్లి పండుకొన్నాడు.

సుందరరావు శారద దగ్గర నిద్రపోతున్న రెండో కుర్రవాణ్ణి తీసుకొనివచ్చి తనమంచం మీద పండుకొని తాను కూడా కన్ను మూశాడు. కాని సుందరరావు కేమీ నిద్ర పట్టలేదు. శర్మ కుటుంబ పరిస్థితి అతనికి ఎంతో ఆందోళన కలిగిస్తూంది.

నిజానికి శర్మ తనకేమీ బంధువు కాడు. బంధుత్వం లేకపోయినా కులంవాడైనా కాడు. ఇంటర్ మీడియేట్ క్లాసులో సహపాఠి. ఏ మంచి సమయంలో మాటలు కలిశాయో, నాటినుంచీ నేటివరకూ పరస్పరం ప్రాణప్రాణంగా ఉంటున్నారు. ఇంటర్ చదివేటప్పుడే తనకు సంసారపు ఝంఝాటన ఏర్పడి కలెక్టరాఫీసుకు జీవితం అంకితం చేయవలసి వచ్చింది. శారద కూడా బి. ఎ. ప్యాసైంది కావడంచేత కాపురానికి వచ్చిన తొలినాళ్లలో హైస్కూల్ లో టీచరుగా పనిచేసింది కాని సంతు ఏర్పడడంతో ఉద్యోగానికి కాస్తా స్వస్తిచెప్పక తప్పిందికాదు. అట్లాగే ఒక్క రెక్కమీదనే ఇంత సంసారాన్నీ నెట్టుకొస్తున్నాడు. నెట్టుకొస్తున్నాడంటే అదంతా తన తెలివితేటలే కావని కూడా అతనికి తెలుసు. శారద బి. ఎ. ప్యాసైనా అతడు ఇంటర్ తప్పినా, దాంపత్యంలో అమృతం ఒలకపోసి, సంసారాన్ని స్వర్గతుల్యం చేయగల సౌజన్యం ఆమెలో ఉన్నది.

శర్మ స్వభావం సుందర్రావుకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. పెండ్లయి రెండేళ్లయినా కాలేదు. ఇంకా ఇంతవరకూ పిల్లా మేకా ఏమీ లేదు. అర్జవంటారా, సుందరరావు అర్జవకంటే రెండు రెట్లు: కట్నం వద్దని ఆదర్శప్రాయంగా భీష్మించుకున్నాడుగాని "ఊ" అంటే ముప్పైవేలు దూకిపడేవి. ఇప్పటికైనా బావమరిది ఒక్కడే కాబట్టి, మామగారికి తానొక్కడే అల్లుడు కాబట్టి ఎస్టేటులో కొంతైనా ముట్టకపోదు.

"పెద్దగా చదివింది కాకపోయినా అంత ఎస్టేట్ దారు కూతురుగావడమే ఆమె ఈ విపరీతపు ప్రవర్తనకు కారణం కావచ్చు అయినా ఈ పిచ్చి ఫిలాసఫర్ ముద్దుల పెండ్లాం మోజు తీర్చడానికైనా ఇంత పటాటోపంగా ఉండవచ్చునే. అది చేతకాక, నిరాడంబరంగా ఉండడమే ఆమె వైముఖ్యానికి కారణమా? ఇంత సన్నిహిత మిత్రుణ్ణి గదా, నేనైనా ఒకసారి శర్మతో ఈ విషయం ప్రస్తావించి అతనికి సలహా ఎందుకు ఇవ్వకూడదూ?"

సుందర్రావు ఈ ఆలోచనతో రాత్రంతా గడిపాడు.

శర్మ ఉదయానే లేచి ముఖం కడుక్కుండానే టేబిల్ మీద ఉన్న పత్రికలన్నీ ఒకటొక్కటే త్రిప్పడం మొదలుపెట్టాడు. 'ఎన్‌కౌంటర్', 'హిబ్బర్ట్ జర్నల్', 'భవన్స్ జర్నల్' అన్నీ పేజీలు త్రిప్పుతున్నాడు. పుష్పావతి ముందు మెట్లలో నిలబడి టూత్ బ్రష్‌తో పండ్లు తోముకుంటూ అన్నది:

"ఏమండీ, నాకీ అద్దెకొంపలో ఉండడం ఏమాత్రం ఇష్టంలేదు."


"ఎందుకని పుష్పా!" శర్మ నిదానంగా అడిగాడు.

ఈ మాటలన్నీ ప్రక్కగదిలో కాఫీ కాచుతూన్న శారదకు వినిపిస్తూనే ఉన్నాయి.

"మొదటినుంచీ నేనూ ఇంత గుట్టుగా బ్రతికినదాన్ని. ఏ వేళబడితే ఆ వేళ అడ్డమైన వాళ్ళంతా వచ్చిపోతూంటే ఈ అలగా కొంపలో నే నుండలేను. ఎట్లాగో ఈ రెండేళ్లు ముక్కుమూసుకున్నాను."

శర్మ శాంతంగా పల్కాడు: "ఏమిటి పుష్పా, నీవనేది? మనింటి కితరులెవరు వస్తున్నారు? సుందరంగారి పిల్లలూ వాళ్ళేగా? ముద్దుగా ముచ్చటగా కాస్త ప్రొద్దుపోతూంది నిజంగా వాళ్లుండబట్టేగా!"

"నే నొకరి పేరెత్తలేదు. అనవసరంగా తగాదాలో కీడ్చకండి. మీ తరహాకు తగినట్లు మీ ముద్దు ముచ్చటలు సాగించుకోండి. కాని నాకు, ఇంత స్థిమితంగా ఏకాంతంగా, కాపురం చేయడానికి మరుగుగా ఉన్న ఇల్లు కావాలి. త్వరగా ఇంకో ఇల్లు చూడండి."


ఆరోగ్యవంతులైన జనులు
ప్రతిరోజూ
లైఫ్‌బాయ్ సబ్బుతో
స్నానము చేయుదురు
LIFEBUOY
SOAP
— అది ప్రతిదిన* మలినములోని క్రిములను కడిగివేయును !
* మనకు ప్రతిదినం కాన్పవచ్చే మామూలు మురికిలో క్రిములున్నాయి మనలో ప్రతి వారికీ యీ క్రిములవల్ల రోగాల ప్రమాదం వుంది. అందుచేతనే చాలామంది ఆరోగ్య వంతులగు జనులు లైఫ్‌బాయ్ సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగి వేసుకొనుటవల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొనుచున్నారు — అది ఆరోగ్య వంతమైన హాయిని కలిగించును.

★ వాడిన మొగ్గ ★

"ఇళ్ళకేం, బస్తీలో చాలా ఇళ్లున్నై. కాని ఇరుగు పొరుగు ఇంత ఆప్యాయంగా జాలితో మనం వేళపట్టున భోజనం చేశామా, చేయలేదా? అని ఆలోచించే సజ్జనులు లభించడం కష్టం."

"ఒకరి జాలితో, దయతో నాకేం పని లేదు."

"మనం కూడా మానవులమేకదా పుష్పా! కష్టాలు రాకుండా ఉంటాయా?"

"మానవత్వంతో ప్రతికాలంటే అవశ్యం మన మీ యింట్లోనుంచి తేవాలనిపిస్తోంది. కష్టాలంటారా? ఇంతవరకు ఏమీ లేవు. ఇక మీ నోటిదలువనో, చేతిదలువనో వస్తే రావచ్చు."

"పుష్పా, అనవసరంగా నీవు మనస్సులో చీకాకు పడుతున్నావు."

"నా మనస్సేమీ చెడలేదు; ఈ యిరుగు పొరుగువారి అందచందాలవల్ల మీ మనస్సే చెడ్డది."

ముందింట్లో కూర్చున్న మగనికి కాఫీ యిచ్చి గదిలో తానూ కాఫీ పుచ్చుకుంటున్న శారద మాటలు వినిపించాయి. ఆమె మనస్సు కలుక్కుమంది.

పుష్పావతి అన్న ఈ మాటల్తో ఎదుటనే ఉండి వింటూన్న శర్మ సహనం భగ్నమై పోయింది. పుష్పావతిమీద చేయెత్తాడు. ఆమె బుడిబుగ్గమీద శర్మ ఐదువ్రేళ్ళ వాతలు తేలాయి.

నిశ్శబ్దంగా ఐదు నిమిషాలు గడిచాయి. పుష్పావతి ఏమీ మాట్లాడలేదు. కళ్ళనీళ్లు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. శర్మ ముఖం కడుక్కోకుండానే బైటకు వెళ్ళాడు.

రాత్రి ఏడింటికి శర్మ తిరిగి యింటికి వచ్చాడు. బైట తలుపు తీసే ఉన్నది. లోపలికి వచ్చి చూచాడు. ఎవ్వరూ ఇంట్లో ఉన్న అలికిడే లేదు. తన యింటి గది తలుపు తాళం పెట్టిఉన్నది. సుందరరావుగారింటివైపు వెళ్ళాడు. వారిలుకూడా తాళంపెట్టే ఉన్నది. శర్మకు ఆశ్చర్యం గల్గింది. ఇంటి నాలుగుమూలలూ కలయచూచాడు. ఎవ్వరూ కనిపించలేదు. బైట వాకిట్లోకి వచ్చాడు. అరుగుమీద ఎవరో పండుకుని ఉన్నారు. మసకచీకటిలో శర్మ "ఎవరునీవు" అని గట్టిగా అరిచాడు. పండుకున్న మనిషి దిగ్గున లేచింది.

"బాబూ, మీరా! నేను పనిమనిషిని లెండి"

"అమ్మగారేరి."

"పెట్టే, బెడ్డింగూ, మూటా ముల్లె సర్దుకొని ఇంతకుముందే ప్రయాణమైపోయారు. ఈ తాళంచెవి మీకివ్వమన్నారు."

"సుందరరావుగారేరీ?"

"వారింట్లో అందరూ మధ్యాహ్నమే ప్రయాణమై వెళ్లిపోయారు."

"ఎక్కడికి?"

"నాకు తెలియదుబాబూ, వెళేటప్పుడు అమ్మగారితో శారదమ్మగారేదో మాట్లాడి పోయారు. అమ్మగారూ ఏదో గట్టిగానే మాట్లాడారుబాబూ. ఇవరంగా నాకు తెలీదు. వత్తా"

పనిమనిషి వెళిపోయింది.

మరునాడు ఉదయం వచ్చి ఇల్లంతా ఊడ్చి కారియర్లో భోజనం తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. రాత్రికి భోజనం తేవడానికి మళ్లీ వచ్చింది. శర్మ ఈజీచెర్లో పండుకొని మాగన్ను పెట్టి నిద్రపోతున్నాడు. పనిమనిషి కారియర్ తోముదామని మూత ఊడదీసి చూచింది. ఉదయం తెచ్చిన పదార్థాలన్నీ అట్లాగే ఉన్నాయి.

పనిమనిషి శర్మ పండుకున్న కుర్చీ ప్రక్కగా నిలబడి పలికింది.

"బాబూ, అన్నం తిన్నట్టులేరు. మరి ఈపూట కారియర్ ..."

"భోజనం అక్కర్లేదమ్మా"

"పోనీ, లేచి అట్టా ముందు మెల్లాలో కూర్చోండి. ఇల్లంతా ఆగంగా ఉన్నది. చిమ్మిపోతాను"

"పొద్దున చిమ్మిందేగా, ఇదుగో ఇటు చూడూ, ఆ టేబిల్లో పర్సు ఇటు తీసుకురా, పాపం, ఈ రెండేళ్లనుంచీ ఎంతో ఒద్దికగా పనిచేశావు."

శర్మ పర్సుతీసి రెండు పదిరూపాయల కాగితాలు పనిమనిషి కిచ్చేశాడు. "ఏమిటిది బాబూ, ఇంత డబ్బెందుకు? నాకు ఇవ్వాల్సింది మొత్తం నాలుగురూపాయలుకూడా ఉండదు. అయితే నాతో పని తీరిపోయిందా బాబూ..." అంటూ పనిమనిషి కళ్లనీళ్లు పెట్టుకుంది.

"పోయిరా అమ్మా, పిల్లలుగలదానివి."

"మా బాబంత మంచివారికి రావల్సిన కష్టాలుగావు" అంటూ పనిమనిషి క్రిందపెదవి పైపళ్లతో నొక్కుకుంటూ పైటచెంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ నమస్కారంచేసి మెల్లగా వెళ్లిపోయింది.

శర్మ ఈజీచైర్లోనుంచి లేచి టేబిల్ ముందు కూర్చున్నాడు. శరత్ వ్రాసిన "కాశీనాథ్" నవల కనిపించింది. పది పుటలు త్రిప్పాడు. ఆ తర్వాత చదవలేకపోయాడు.

ఆ రాత్రి శర్మకసలు నిద్రపట్టలేదు. టేబిల్ ముందు కుర్చీలో కూర్చొని రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాడు.

మరునాడు మధ్యాహ్నం పోస్టుమాన్ కవరు తెచ్చిచ్చాడు. శర్మ కవరు చించి చూచుకున్నాడు. మామగారు వ్రాసింది. ఉత్తరం ధోరణి అతనికేమీ ఆశ్చర్యం కలిగించలేదు. ఇంకా కొంత కాలం జరిగిన తర్వాత జరుగుతుందనుకొన్నది కొంచెం ముందుగా జరిగింది అంతే! అందుకనే అతనికేమీ ఆశ్చర్యం కలగలేదు.

మరి సుందరరావు, పెళ్లాం బిడ్డలు ఏమైనట్లు? అప్పుడే పదిరోజులు గడచిపోయాయి. కనీసం ఇంతకనికరించి "ఫలానాచోట ఉంటున్నాము" అని ఒక ఉత్తరం ముక్క అయినా గీకి పడవేయవచ్చునే? పోనీ ఆఫీసు కెళ్ళి కనుక్కుంటే?...

"ఏదో అర్జంటు పనిమీద ఊరు విడిచి పోయినట్టు సెలవు పెట్టాడట"

శర్మకు ఆకలి దప్పుల ధ్యాసమే పోయింది. పనిమనిషితో పని లేదు. ఇస్త్రీ చాకలి వాడితో అసలు పనిలేదు. మొదట రెండు రోజులు కాలేజీకి వెళ్ళాడు. ఆ తర్వాత సిక్ లీవ్ పెట్టేశాడు. నెలాఖరున జీతం తెచ్చుకోవాలని కూడా తోచలేదు.

మరోవారం గడచిపోయింది. ఒక రోజు ఉదయం హఠాత్తుగా ఇంటిముందు గుఱ్ఱపు బండి వచ్చి ఆగింది. శర్మ లేచి వాకిట్లో కెళ్ళి చూద్దామనుకున్నాడు. ఈజీ చెయిరులో నుంచీ లేచిపోవాలంటే సత్తువ లేకుండా ఉంది. గబా గబా ఒక చిన్నమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చి శర్మ పొట్టమీద కూర్చున్నది. అంత చిన్న పిల్ల బరువును సహించే బలంకూడా శర్మ దగ్గర లేదు. కాని ఆ అమ్మాయిని చూడడంతోటే అతనికి ప్రాణం లేచి వచ్చినట్లైంది.

"తల్లీ, నిన్ను మళ్ళా చూస్తాననుకో లేదు. నీకుకూడా నామీద జాలి లేకపోయిందా అమ్మా"

బాగా పెరిగిన శర్మ గడ్డం మీద చిన్నమ్మాయి చిట్టి చేతులు వేసి రాస్తూంటే అతడేదో అనిర్వచనీయానందం అనుభవించడం మొదలెట్టాడు.

ఇంతలోకే ఆగదిలోకి, గోష్పాదమంత పిలకతో ఒక మనిషి హడావిడిగా వచ్చి శర్మ ప్రక్కగా కుర్చీ లాక్కొని కూర్చొని చిన్నమ్మాయిని తన దగరకు తీసుకొని,

"శర్మా, పొరపాటైంది. ఉత్తరం కూడా వ్రాయలేదు" అన్నాడు.

శర్మ సుందరరావు రూపం చూచి విషయం అంతా అవగాహన చేసుకొన్నాడు.

"నాన్నగారు ఆరోగ్యంగా ఉన్నారా?"

సుందరరావు కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, దాటిపోయి నిన్నటికి పదమూడు ఆ పల్లె ూళ్ళో అమ్మను ఒక్కర్తెను ఉంచడం ందుకనే అని వెంట తీసుకొచ్చాను." న్నాడు.

"పెద్దవాడు. కాలం తీరిపోయింది!— పెద్దతనం అనేమిటిలే—కొంచెం ముందు వెనకగా అందరమూ అక్కడికే" అంటూ శర్మ తల ప్రక్కకు తిప్పుకున్నాడు.

సుందరరావు శర్మను బాగా తేరిపార చూశాడు. కళ్ళుగుంటలుపడి, బుగ్గలు లోతుకు పీక్కుపోయి మనిషి పుల్లై— అసలే అల్పంగా ఉండే వాడు—మరీ కుష్కించిపోయి కన్పిస్తున్నాడు.

సుందరరావు ఇల్లంతా కలయచూశాడు. ఎక్కడి వస్తువు లక్కడే! గచ్చు నేలంతా అరంగుళంమందాన దుమ్ము పేరుకొని, చిందర వందరగా పడిఉన్నది. లోపలి ప్రక్కకు పోయి చూశాడు. పుష్పావతి ఉండదను కుంటూనే చూశాడు. కాబట్టి ఆమె కని పించనందుకు ఆశ్చర్యం కలగలేదు.

'ఈజీచెయిర్'కు అతుక్కుపోయి ఉన్న శర్మముఖంలోకి మరొక్కసారి చూశాడు. "ఏమిటిది శర్మా! నాకైనా హృదయం విప్పి చెప్పవూ?" అంటూ సుందర్రావు అతని చేయి పట్టుకున్నాడు. శర్మ శరీరం భగ్గున మండిపోతూంది.

"చెప్పడానికేముంది సుందరం; లీలగా దానంతట అదే అంతా సెట్టుకుపోతూంది" అంటూ శర్మ బలహీనంగా, ఎండి పగిలిన పెదవులమీదగా పల్చగా తెల్లని నవ్వు జార్చాడు. ఈతనితో వేదాంతం ముచ్చ టించడానికిది సమయంకాదని సుందరం ఎకదకా బయటకు వచ్చి, శారదతో ఇల్లు శుభ్రంచేసి కాస్త పొయిమీద ముందు మ్యపుజావపెట్టు" అంటూ బైటకుపోయి ...క్టర్ను వెంటబెట్టుకొచ్చాడు.

శర్మ వద్దని గట్టి పట్టుబటినా డాక్టరు, ...దరరావు పట్టుదలమీద పరీక్ష చేశాడు.

డాక్టరు బైటకుపోతూ వెంటవస్తున్న ందరరావును దగ్గరకు పిల్చి చెప్పాడు పల్స్ చాలా బలహీనంగా ఉంది. హృద యం బహుదుర్బలంగాఉన్నది. బడ్ ప్రెషర్ అని నా అభిప్రాయం అయినవాళ్ళెవరైనా ంటే...ముఖ్యంగా తల్లిగాని, భార్యగాని ంటే ఇరవైనాలుగుగంటలూ ఈ మనిషికి చర్యచేయాలి. చేస్తే కొన్నాళ్ళకు కొంత ం కనపడవచ్చు ఏమైనా కొంచెం నుదమే ననిపిస్తూంది."

* * *

శర్మకు తెలియకుండా సుందరం రాదిచ్చిన లిగ్రాం చూచుకొని శర్మ మామగారు టుంబంగా సొంతకారులో వచ్చేశారు.

పుష్పావతి కారులోనుంచి అడుగు క్రింద పెడుతూనే ఇంటిలోపలికి చూచింది

మొటమొదట్నే శారద కన్పించింది. చిన్న బొగ్గులకుంపటి రాజేసి ఆమె నీళ్ళు కాస్తూంది. చంటిపిల్ల గిలగిల ఏడుస్తూన్నది. ఆ పిల్ల సంగతి పట్టించుకున్నవాళ్ళెవరూ లేరు. శారదకు ఒక గజం దూరంలో మెత్తగా పక్కపఱచిన నవారుమంచంమీద నడుముల వరకూ దుప్పటికప్పుకొని శర్మ వెల్లకిలా పండుకొనిఉన్నాడు. సుందర్రావు పెద్ద కొడుకు శర్మ కాళ్ళొత్తుతున్నాడు సుంద ర్రావు, వేడినీళ్ళలో గుడ్డతడుపుతూ, శర్మ తలమీద అద్దుతున్నాడు. చిన్నమ్మాయి ఎడమచేత్తో విసనకర్రవిసుర్తూ కుడిచేతో శర్మ బుగ్గలు నిమురుతూ కూర్చుంది. చిన్న కుఱ్ఱవాడు సుందరరావు మోదగావాలి, "నాన్నా, మామయ్యకెప్పుడు నయమవు తుంది" అని అడుగుతున్నాడు.

శర్మ అందర్నీ కలయచూస్తూ, "సుంద రం! తరంగాలులేని సముద్రంలాగా నా మనస్సు ప్రశాంతంగా ఉంది ఇక నే నేమైనా ఫర్వాలేదు" అంటూ చిన్న మ్మాయి తల వెంట్రుకలలోకి సన్నని తన ప్రేళ్ళు పోనిచ్చాడు.

పుష్పావతి తండ్రి, లోపలికి వస్తూనే, తన వెంట తీసుకొనివచ్చిన డాక్టరుతో అన్నాడు: "దిక్కులేకుండా ఇక్కడ పడుండటమెందుకు? పరిస్థితి ఎట్లా ఉందో చూడండి మన డిస్పెన్సరీకి తీసుకుపోదాం"

సుందరంగాని, శారదగాని ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

పుష్పావతి తల్లి, తమ్ముడు కూడా "ఆలస్యం చేయడం మంచిదికాదు; త్వరగా బయలుదేరండి" అంటూ హడావుడి చేయ టం ప్రారంభించారు.

శర్మ కళ్ళుతెరచి అందరివంకా చూశాడు. తల్లిచాటుగా నిలువబడివున్న పుష్పావతివంక చూచి తల మామూలుగా త్రిప్పుకు పండుకున్నాడు.

మెల్లిగా సుందరరావు శర్మకు విషయం వివరించి చెప్పాడు. శర్మ అక్కడినుంచీ కదలడానికి ఏమాత్రం అంగీకారం సూచిం చలేదు.

శర్మ మామగారు ఒకటికి రెండుసార్లు చెప్పిచూశాడు. ప్రయోజనం లేకపోయింది "నాకు లక్షపనులు" అంటూ అందర్నీ అక్కడే వదిలి తానొక్కడు కారులో వెళ్ళి పోయాడు.

పుష్పావతి దిగ్భ్రాంతి చెందింది. మగని వంక చూచింది. శల్యావశిష్టంగా పడి ఉన్నాడు ఆమెకు తెలియకుండానే కళ్ళ వెంట జొటజొట నీళ్ళుకారాయి. గబగబా అతని మంచం ప్రక్కగా పట్టెమీద తల వాల్చి పులుకు పులుకున ఏడ్వ మొదలెట్టింది. పుష్పావతి ఉంగరాలజుట్టుమీదగా, నున్నని ఫాలంమీదుగా మెత్తని బుగ్గలమీదుగా శర్మ ప్రేళ్ళు జారిపోయాయి.

ఫ్యాషన్ పేరుతో చిన్నదిగా పెట్టు కొన్న పుష్పావతి ముఖంమీది తిలకం చెమ టకు కరిగిపోయింది కరిగిపోగా మిగతాది కాస్తా శర్మ వేళ్ళు రాసుకొని కనిపించ కుండా పోయింది. ★

రిస్టువాచీ

యల్లంరాజు సుందర కేశవరావు

ఎట్లాగైనాసరే! ఆ రిస్టువాచీ కొనుక్కొన్నే అదృష్టం పట్టేటు చేస్తే ఆంజనేయ స్వామికి అయిదు కొబ్బరికాయలు, పాల వాని, కొడతానని మనస్ఫూర్తిగా మొక్కు కున్నాడు మురళీకృష్ణ. నిజంగా అతను అట్లా మొక్కుకోటం సబబుగానే వుంది. ఎంత అందమయినవాచీ! తన చేతికి చక్కగా అతికినట్టు సరిపోయింది. ఎంతో అందంగా చంద్రబింబంలాంటి మొహమే సుకుని, పల్చగా నాజూగ్గా వున్న ఆ రిష్టువాచిని చూసీ చూడగానే ప్రాణాలొదిలేసినంత పని చేసేడు. తియ్యని మామిడిపండు రసం గొంతుకలో చిక్కుకుని వుక్కిరిబిక్కిరయి నట్టయింది. అసలు తన కొక వాచీ అవసర మని దాన్ని చూసినప్పుడేగాని తట్టలేదు. కానీ...ప్రస్తుత పరిస్థితుల్లో అమితంగా విచారించవలసిన విషయం ... అతని దగ్గర, మధ్యాహ్నం కాఫీ తాగడంతో చిల్లిగవ్వ కూడ లేకుండా పోయింది. మరి యెట్లా కొనడం? ఒకటి రెండు రూపాయలయితే, జీతం రాగానే యిస్తానంటే యెక్కడైనా పుట్టించవచ్చుగాని, వొక్క మాటుగా వంద రూపాయ లప్పిచ్చే మహాత్ము డెవరండీ? వాడెవడో యిప్పుడు వాచీ యిచ్చేసి రెండు మూడు నెలలాగి డబ్బు పుచ్చుకు పోకూడదూ? ఏడిసినట్టే వుంది. ఇప్పుడు డబ్బె అవసరం లేకుంటే అంత అందమయిన వాచీ అమ్మడానికి వాడికేమైనా వెర్రె త్తిందా! మరింకెట్లా డబ్బు సంపాయించటం? వెంటనే డబ్బు సంపాయించ టానికి వున్న మార్గాలన్నీ వొకటి తరువాత వొకటె మనఃపథంలో మెరిసాయి. కిళ్ళీ కొట్టు పెడితే? అప్పడాలొత్తి అమ్మితే? లేక పోతే వాళ్ళదొడ్లో వెలిబూడిదుంది. దాంతో టూత్ పవుడరు చెయ్యొచ్చు. ఏడిసినట్టే వుంది. ఒక్క మార్గంకూడా సుగమంగా లేదు. ఆగండి! ఆ! బలే వుపాయం. ఎవడింటికన్నా కన్నం వేస్తే? బాబోయి, వాచీకి వొక దణ్ణం. ఎముకల్లోకి సున్నం లేకుండా విరగతంతారుగద! మరెట్లాగయ్యా చచ్చేది? ఈ వచ్చేవాడెవడో రెండు నెల్ల క్రింద వచ్చేడవకూడదూ? అప్పటి కతను కష్టపడి అయిదొందల రూపాయలు కూడ బెట్టాడు. వెంటనే అందులో సగం అతని భార్యామణిగారి చేతి గాజులుగాను, సగం అతని ఏణ్ణర్థం కుమారుని మామిడి పిందెల మొలత్రాడుగాను మారిపోయింది. ఆపళంగా ఆవిడ ఆ కొడుకు నెత్తుకుని పుట్టింటికి పోయింది. పుట్టిల్లంటే జ్ఞాపకమొచ్చింది. వస్తూ వస్తూ ఆవిడగారు కొంత తీసుకొచ్చి పట్టుంది. మొన్న యెందుకో ఆవిడ పరోక్షంలో పెట్టి తీసేటప్పటికి పదిహేను పది రూపాయల నోట్లు జిగేలుమంటూ దర్శన మిచ్చాయి. కాని, వొక్కటే చిక్కు. అన్నీ వుండి అల్లుడి నోట్లో శని అన్నట్టు ఆవిడ దగ్గరనుంచి డబ్బాడిపడాలంటే వెయ్యేండ్లు తల్లక్రిందుగా తపస్సు చెయ్యాలి.

మరెట్లా యింక? ఆలోచించాడు. తలకాయ తిరిగి నోట్లోకొచ్చి పడేదాకా ఆలోచించాడు. చివరికి మెరుపులాంటి ఆలోచన తట్టింది. ఆహా!...ఓహో!...ఏం ఆలోచన! చాణక్యుడికైనా యిల్లాంటి ఐడియా తట్టి వుండదు. అసలు అతనుమాత్రం తన మెదడుకు యింత పదునుందని యెప్పుడయినా అనుకున్నాడా? ఇదేమిటి! తను యింకా యిలా ఆలోచిస్తూనే కూర్చున్నాడు? పుణ్యకాలం కాస్తా గడిచిపోయిందంటే ఆ వాచీ కాస్తా మరొకడి చెయ్యి అలంకరించి కూర్చుంటుంది. వెంటనే దారి తప్పించి సత్యన్నారాయణ యింటికి పరిగెత్తాడు.

"అరే సత్యం! ఎలా గయినా రక్షించాలిరా".

ఇది ఆపద్బాంధవుడు మురళీ కృష్ణుడి ప్రార్థన.

"నీకేం భయంలేదు! నేనున్నాను!"

ఇది సత్యనారాయణస్వామిఅభయహస్తం.

"అసలు సంగతిసందర్భ మడక్కుండా నీకేం భయంలేదు నేనున్నాను అంటావు. నీ బొంద నాకెందుకురా భయం?"

"అయితే మరి సంగతిసందర్భాలు వివరించు."

దాంతో, వున్న పరిస్థితులు, తన పథకం అందులో అతగాడి విధి అరటిపండొలిచి చేత పెట్టినట్టు వివరించి చెప్పాడు.

"ఒరే! వెధవ వాచీకోసం అట్లా చేయటం యేం బావుందిరా?"

"మరెట్లారా చచ్చేది!"

"సరేలే! అట్లాగే కానియ్యి."

మురళీకృష్ణుడికి విమానం ఎక్కినంత సరదా వేసింది.

ఆ మూడోనాడు తను వాచీపెట్టుకొని ఆఫీసు కెడుతుంటే దారిలో యెవరో టైమ్ అడగటాన్ని, దానికి తను "పదిన్నర" అని చెప్పడాన్ని వూహించుకుంటూ యింటికి చేరుకున్నాడు.

* * *

ఆంజనేయులస్వామి దయవల్ల వేసిన పథకం యింతవరకు సవ్యంగానే నడిచింది.

ఆ సాయంత్రం ఆఫీసునుంచి యింటికి వస్తూనే అలవాటుప్రకారం "బాబూ" అని కేక పెట్టాడు. బాబు యింట్లో లేడని తనకు తెలుసు. ఇంతకుముందర తనేగా బాబుని

కెళ్ళి సత్యం వాళ్ళింట్లో దిగబెట్టింది. ఎలాగూ ఈ సంగతి సుశీలకు తెలీదు. ఈపాటికి బాబు వాళ్ళింట్లో పిల్లలతో చక్కగా ఆడుకుంటూవుంటాడు.

సరాసరి వంటింట్లో కెళ్ళాడు.

"సుశీలా! బాబు ఏడీ?"

"అదేమిటండి! మీతో రాలేదూ? ఇందాక వీధిలోకొచ్చి చూసి లేకపోతే మీరు తీసికెళ్లారేమో అనుకొన్నా. అయితే ఎక్కడికెళ్లాడు? వుండండి. పక్క వాళ్లింట్లో చూసివస్తా."

పక్కవాళ్ళింటికి, ఆ చుట్టుపక్కల వాళ్ళిళ్ళకి రాలేదన్న సంగతి తొందరగానే తెలిసింది.

"ఏమండీ! యెవరింటికీ రాలేదుట."

"అయినా వాణ్ణి వరండాలో వదిలేసి వంటింట్లో సువ్వేం చేస్తున్నావు!" ఎంతో కోపంతో అడిగాడు.

"అప్పుడు మీరిక్కడే వున్నారు కదండీ!"

"ఆ! ఇదంతా నేను చూస్తూ కూర్చున్నానా యేమిటి?"

"అవుతే యెక్కడికెళ్లాడండీ? వరండాలో ఆడుతుంటుంటే యెవరైనా ఎత్తుకుపోయారేమో! మామిడిపిందెల మొలతాడు కూడా వుంది. పోనీ, తొందరగా స్టేషనుకెళ్ళి రిపోర్టివ్వండి."

"ఆ! పోలీసులవల్ల యేమవుతుందే!"

"మరెల్లాగండీ!" అప్పుడే కళ్లల్లోంచి నీళ్లొస్తున్నాయి.

"పత్రికలో ప్రకటనయిస్తే సరి."

"మరదయినా తొందరగానే చేయండీ."

"ఆ ■ ■ తీసికొచ్చిన తండ్రెవరో, ఎంతైనా బహుమానమివ్వాలి."

"సరే ఇద్దాం! తొందరగా పోయిరండీ"

"మరి డబ్బేది?"

"నాదగ్గరుంది. మొన్న వస్తూ వస్తూ మా అన్నదగ్గర తెచ్చాను. తొందరగా వెళ్ళిరండి."

మురళీకృష్ణుడు ఆదరా బాదరా అఘమేఘాలమీద పరిగెత్తాడు.

*   *   *

మరునాడు సాయంకాలం అయిదు గంటలకి యెవరో మహానుభావుడు పాపం చిట్టి బాబుని వెతికి తీసుకువచ్చి మామిడిపిందెల మొలత్రాడుతో సహా అప్పజెప్పాడు.

వాణ్ణి అమాంతం లాక్కుని ముద్దులవర్షం కురిపించింది సుశీల. ఆవిడ కళ్లనుంచి ఆనంద బాష్పాలు రాలాయి. ఆ పరిస్థితిలో ఆవిడకి పదంద రూపాయలు లెక్కలోకి రాలా, బాబు దొరికినట్లు మురళీకృష్ణుడికి కబురెళ్ళింది.

*   *   *

ఆరాత్రి ఆఫీసునుంచి మురళీకృష్ణ యింటికి వచ్చి చొక్కా వంకెకి తగిలిస్తుంటే, అతగాడి చేతినున్న వాచీ కొట్టొచ్చినట్టు కనబడింది సుశీలకు.

"ఏమండీ! ఎవరిదండీ ఆ వాచి?"

"నాదే!"

"మీకు వాచీ యెక్కడిదండీ?"

"కొన్నాను."

"ఎప్పుడు?"

"సాయంత్రం." "బాబూ యిలా రా నాన్నా."


బాబు వొక్క గంతులో తండ్రి చేతుల్లో కెళ్లాడు.

"నిన్న సాయంకాలం నువ్వూ నేను కలిసి అమ్మను తీసికెళ్లకుండా వొకచోటికెళ్ళాము కదురా!"

సుశీలకంతా అర్థమయింది. ఆమెకొక్కసారిగా కోపమొచ్చింది. దాంతోపాటు ఆపుకోలేనంత నవ్వూ వచ్చింది. ఆ నవ్వులో మురళీకృష్ణుడిపట్ల హృదయపూర్వకమైన జాలి వుంది.


ఆమె అతని వాచీ పెట్టుకున్న చేయి తన చేతిలోకి తీసుకుంది, "బలేవారండీ మీరు!" అంటూ.

★



"జనగణమన అధినాయక! జ


ఆగస్టు




★

భారత
స్వాతంత్ర్య

★






ను హే, భా ర త భా గ్య వి ధా తా!"



పదిహేను



★

నవమ
వార్షి
కోత్సవం.

★

బొంబాయి సినిమా లేఖ


బొంబాయికి దిలీప్‌కుమార్‌లా, బెంగాల్‌లో అగ్రశ్రేణి బాక్సాఫీస్ నటుడుగా చెలామణీ అవుతున్న ఉత్తమ్‌కుమార్ మీద ఎవరో అఘాయిత్యం తలపెట్టారు. రోజుకు నాలుగు షిఫ్టులు పనిచేసే కొద్దిమంది నటులలో ఉత్తమ్‌కుమార్ ఒకడు. అంతపని రద్దీ ఉన్నా ఇంకా, నిర్మాతలు ఎడతెరిపి లేకుండా అతణ్ణి వెంటాడుతూ చేస్తుంటారు.

జూలై 12వ తేదీన ఉత్తంకుమార్ 'హారానో సూర్' అనే చిత్రం సెట్ మీద నటిస్తున్నాడు. ఇద్దరు యువకులు స్టుడియోలోకి వచ్చి పనిగట్టుకుని ఉత్తంకుమార్ గురించి అవీ ఇవీ అడిగి ఆరాలు తీయడం సాగించారట. ఆ సాయంత్రం ఆ నటుడి ఆప్తమిత్రుడు అలో సర్కార్‌ను వాళ్లు ఎలాగో మాయచేసి ఒక సందులోకి తీసుకు వెళ్ళారట. అక్కడ అతన్ని హింసపెట్టి, ఉత్తంకుమార్‌ను ఎలాగైనా స్టుడియో ఇవతలకి తీసుకురమ్మని బలవంతం పెట్టారట. అలో సర్కార్ మొత్తానికి వాళ్లకి లొంగకుండా తప్పించుకు బయటపడ్డాడు. ఉత్తంకుమార్‌ను బుక్ చేసుకోడానికి తిప్పలుపడే నిర్మాతలలో, విఫలుడైన ఏ నిర్మాతో ఇలా అఘాయిత్యం తలపెట్టి కిరాయిమనుషుల్ని ఈపనికి పురమాయించి ఉంటాడని అనుకుంటున్నారు.

ఆరాధ్య దైవంలా వెలుగుతున్న ఉత్తంకుమార్ పేరు చెప్పి, మొత్తంమీద రోజా విడో ఒకటి ఇటువంటివి జరుగుతూనే ఉంది. ఈ మధ్యనే, అభాండాలు వేయనరిగిన ఒక పత్రికారచయిత ఉత్తంకుమార్‌కూ, ఒక నటీమణికీ లేనిపోని సంబంధాలు అంటగట్టి అవాచ్యాలు వ్రాశాడు. దానిమూలంగా ఉత్తంకుమార్ భార్య కలత చెంది అఘాయిత్యం తలపెట్టింది. పరిస్థితులు విషమించేలోగా, అదృష్టవశాత్తూ అభాండాల బండారం బయటపడి, అపోహలు తొలగిపోవడం, పరిస్థితులు చక్కబడడం జరిగింది.

* * *

బొంబాయిలో దిలీప్‌కుమార్ కథ కూడా దాదాపు ఇదే పంథాలో ఉంది. ఆ మధ్య పాకిస్తాన్‌కు చెందిన కుర్రవాడు దిలీప్ మీద ద్రావకం పోయడానికి ప్రయత్నించాడు. కొన్నాళ్ళ తరువాత ఇంకో విశేషం జరిగింది. దిలీప్‌ను ఎవరో కత్తితో పొడిచారట నిజమేనా అంటూ, ఒక పార్సీ యువతి బొంబాయిలోని పత్రికా కార్యాలయాలకు టెలిఫోన్ చేసి అడగడం సాగిం



ఆర్. సి. తల్వార్ నిర్మించిన "మేం సాహెబ్"లో షమ్మీకపూర్, మీనాకుమారి.



మహీవారి "శ్రీ గౌరీమాహాత్మ్యం"లో ఆశాలత.



సాహిణీవారి కొత్తచిత్రం "పెంకి పెళ్ళాం"లో రామారావు, రాజసులోచన.

★ బొంబాయి సినిమా లేఖ ★

చింది. అక్కడితో నగరం అంతా అట్టుడికినట్టుడికి పోయింది.

ఒకసారి, అస్వస్థతవల్ల దిలీప్ విశ్రాంతి కోసం ఒక నర్సింగ్ హోంకు వెళ్ళి చేరాడు. ఎటొచ్చీ ఆవైనం నిర్మాతలెవరికీ తెలియ చెయ్యలేదు. అంతే ఒక్కపెట్టున రకరకాల పుకార్లు బయల్దేరాయి. ఒకానొక బొంబాయి నటిని వెంటబెట్టుకొని దిలీప్ ఎక్కడికో వెళ్ళిపోయాడని ఒక కథ ప్రచారం కొసాగింది. తమాషా ఏమిటంటే, ఈ 'కథ'లో హీరోయిన్ కూడా కొన్నాళ్ళు కనబడలేదు. ఆమె ఊరునుంచి తిరిగి వచ్చాక పరిచితులు ఈ సంగతి చెప్పారు.

ఆ అమ్మాయి అంతా విని ఊరుకుంది. ఔనూ అనలేదు, కాదని అంత కన్నా అనలేదు.

మళ్ళా ఒక్కసారి పుకారు రాయుళ్ళు పుంజా కొని ద్విగుణీకృతజవసత్వాలతో పాతకథకు చిలవలు పలవలు చిత్రించి, రంగులు వేసి ప్రచారం చెయ్యడం మొదలు పెట్టారు.

ఒకరోజున ఒక పెద్దమనిషి, పూనా వెళ్ళి అక్కడ ఒక నర్సింగ్ హోంను చూడబోయాడు. అక్కడ దిలీప్ కనబడ్డాడు. బొంబాయిలో తాజా తాజా పుకారుగా చెలామణి అవుతున్న "కథ" పుట్టడానికి పూర్వంనుండి, ఆ కథ ముదిరి వికారం అయినప్పటి వరకూ కూడా దిలీప్ ఆ నర్సింగ్ హోంలోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నట్లు తేలింది.

నిజం, అఖండాల బండారం, మళ్ళా ఒకసారి బయట పడ్డాయి.

* * *

చిత్ర నిర్మాతలు స్టుడియోలో సెట్లలో కాలక్షేపం చేసే రోజులు మారుతున్నట్లు కనబడుతోంది. చాలా మందికి కథా స్థలానికి వెళ్ళి, ఆయా ప్రాంతాలలో సహజ వాతావరణంలో సన్నివేశాలు చిత్రించాలన్న మోజు ఎక్కువవుతోంది. కొంతమంది విదేశాలకు వెళ్ళాలని ఉబలాట పడుతున్నారు; వెళ్తున్నారు కూడా. దర్శక నిర్మాత బిమల్ రాయ్ తమ కొత్త చిత్రం "మధుమతి" షూటింగ్ కొంత కౌస్లా వాకీయాలో జరపడం విదితమే. ఆ చిత్రం హీరో దిలీప్ కుమార్ కూడా ఆయనతో "కార్లవి వాలీ"కి వెళ్ళాడు. "యహూదీకీ లడ్కీ" నిర్మాత శివాజీచా ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు—ముఖ్యంగా కథానాయకుడు (దిలీప్ కుమార్) రథాన్ని తోలడం ఉన్నవి, రోమ్ నగరంలో చిత్రించాలని సంకల్పించారు. ఈ చిత్రానికి కూడా బిమల్ రాయ్ దర్శకత్వం నిర్వహిస్తున్నారు. దిలీప్ నటిస్తున్న మరో చిత్రం "నయాదౌర్"కు కూడా మార్గ్ లోయలో కొన్ని దృశ్యాలు చిత్రిస్తారు. "ఏక్ హీ రాస్తా" చిత్రం తీసిన బి. ఆర్. చోప్రా ఈ చిత్రం దర్శకుడు. కమ్యూనిటీ ప్రాజెక్టులు ఈ చిత్రంలో కథా వస్తువుకు ఆలంబనం. మధుబాల, చాంద్ ఉస్మానీ ఇందులో ముఖ్య భూమికలు నిర్వహిస్తారు.


* * *

జె పి సిప్పీ నిర్మించిన "చంద్రకాంత", "అనోఖీ" అనే పాకిస్తానీ చిత్రం మొన్న విడుదల అయ్యాయి

మంచి చిత్రానికి కావలసిన ముఖ్యావసరాలలో దర్శకుని ప్రతిభ తప్ప మిగతావన్నీ



హిందీనటి రూప్‌మాల



ప్రభా ప్రొడక్షన్స్‌వారి “ఆడపెత్తనం”లో గుమ్మడి, రేలంగి, నాగేశ్వరరావు.

★ బొంబాయి సినిమా లేఖ ★

పుష్కలంగా ఉన్న చిత్రం “చంద్రకాంత”. నటీనటుల కృషి, పెద్దపెద్ద సెట్‌లు, భారీ సమూహ దృశ్యాలు, కంటికింపైన నృత్యాలూ చిత్రానికి ముఖ్యాకర్షణలు. దుర్మార్గుడైన ఒక వీరుడి కథ. అవినీతికీ, అన్యాయానికీ నిలయుడుగా ఆ విజేత నిరంకుశ పరిపాలన సాగిస్తూ ఉంటాడు. ఒక రాజకుమార్తె, ఈ దుష్పరిపాలనకు ఎదురుతిరిగి, అంతంచేస్తుంది. ఈ విధంగా సాహసోపేతమైన ఈ కథను బాగా రక్తికట్టించడానికి ఎంతో అవకాశం ఉన్నా, దర్శకుడు అటువంటిప్రయత్నాలు ఆట్టే చేసినట్టు కనబడదు. పాత్రలను రూపొందించడం, కథ నడపడం మొదలైన వాటిలో కట్టుదిట్టమైన తీరూ తెన్నూ లేదు.

బీనారాయ్, భరత్ భూషణ్, జానీవాకర్, హీరాలాల్, మనూ ముంతాజ్ ప్రభృతులంతా ఎవరికివారు, లోపంలేకుండా కృషిచేసి మంచి నటన ప్రదర్శించారు. చిత్రం రక్తికట్టడానికి వీరివల్లనే ఎక్కువ దోహదం జరిగింది.

* * *

రిపబ్లిక్ పిక్చర్స్ (అమెరికా) నిర్మించిన “ఫాబ్యులస్ (ఎస్పెలీటా) సెనోరిటా” ఆధారంగా గోయెల్ నిర్మించిన “అల్ బేలీ” (గీతాబాలీ) ఆధారంగా తయారైన పాకిస్తానీ చిత్రం “అనోఖీ” ఇందులో ఫాబ్యులస్ సెనోరీటాగా ‘శీలారామాని’ నటించింది. నటనలోగాని, నృత్యాలలోగాని, శీలారామాని, ఎస్పెలిటాముందు ఎందుకూ పనికిరాదన్న విషయం చిత్రంలో కొట్టొచ్చినట్టు కనబడుతుంది. కొట్టొచ్చినట్టు కనబడే మరో ముఖ్యాంశం ఈ చిత్ర నిర్మాతలు కేవలం కథ విషయంలో నేకాక, సెట్స్, కెమెరా కోణాలు, అలంకరణ మొదలైన అన్ని విషయాలలోనూ ఆద్యంతం అసలు చిత్రాన్ని అనుకరించారు. అచ్చ తెలుగులో చెప్పాలంటే “పచ్చి కాపీ” కొట్టారన్నమాట. అయినా, అది కూడా కలిసిరాలేదు. చిత్రం పొడుగునా అవకతవకలూ, అసంగతాలూ, కొల్లలుగా ఉన్నాయి ఇందులో, సెనోరిటా డాన్సుల కన్న, జెరీ లూయిస్, హాస్యం పేరుచెప్పి చేసే కుప్పిగంతులు ఎంతో మెరుగు. ఇందులో ఒక ముఖ్య భూమిక నిర్వహించిన “షానవాజ్” దర్శకత్వంకూడా నిర్వహించాడు. ★

(ఆంధ్ర వారపత్రిక - బొంబాయి విలేఖరి.)

చలన చిత్రాలకు ప్రభుత్వ బహుమతులు

కేంద్ర నిర్ణాయక సంఘం

ప్రభుత్వం బహుమతులిచ్చి గౌరవించ తగు చలన చిత్రాలను నిర్ణయించే కార్యక్రమంలో ప్రాంతీయ సంఘం కార్యకలాపాలు పూర్తికావచ్చాయి. వారు సిఫార్సు చేసే చిత్రాలను కేంద్రనిర్ణాయకసంఘం పరిశీలించడంకూడా ఒకవంక ప్రారంభమైంది.

ఈ కేంద్ర సంఘానికి శ్రీ మంగళ్ దాస్ పక్వాసా అధ్యక్షుడు. శ్రీమతులు అమ్ము స్వామినాథన్, ఉమా నెహ్రూ, శ్రీయుతులు కృష్ణ కృపలానీ, సయద్ నరుల్లా, ఆర్. డి. దినకర్, ఎం. డి భట్, ఎస్. కె. సిద్ధాంత, ఎ. భాష్యంఅయ్యంగార్, అర్ధేందు ముఖర్జి, శశిధర్ ముఖర్జీ, డి. రామానుజం ప్రభృతులున్నారు.

ఈ సంవత్సరం పోటీకి మొత్తం 51 చిత్రాలు వచ్చాయి ఇతఃపూర్వం. ఈపోటీలో పాల్గొన నిరాకరించిన శ్రీ వి. శాంతారాం తమ టెక్నికలర్ చిత్రం "ఝనక్ ఝనక్ పాయల్ బాజే"ను పంపడానికి అంగీకరించారు.

* *

"భారత్ దర్శన్"కు బహుమతి

కార్లోవీ వారీలో జరిగిన జెకోస్లావేకియా నవమ చలన చిత్రోత్సవంలో "గ్రాండ్ ప్రిక్స్" (ప్రధానబహుమతి) "ఇల్ అల్ ది గైస్ ఇన్ దివర్ ల్డ్..." అనే ఫ్రెంచి చిత్రానికి లభించింది.

(ఈ చిత్రం గురించిన వివరాలు మే 9 వ తేదీ గల "ఆంధ్ర వారపత్రిక" లో ప్రచురించబడ్డాయి).

డాక్యుమెంటరీ చిత్రాలలో భారత దేశం పంపిన "భారత్ దర్శన్" అనే చిత్రానికి బహుమతి లభించింది. దేశాలమధ్య మైత్రిని పెంపొందించడానికి చేసే కృషి పేరిట ఇచ్చిన ఈ బహుమతిని భారత ప్రతినిధి శ్రీ డా॥ కె. ఎస్. ఖోస్లా అందుకొన్నారు.

బహుమతి ప్రదానసభకు జెకొస్లొవాకియా అధ్యక్షుడు శ్రీ జపోటోకీ అధ్యక్షత వహించారు.

ప్రపంచాభ్యున్నతికి, మానవ ప్రగతికి దోహదంచేసే చిత్రాలుగా "మిడ్ ది డార్క్ నెస్" (జపాన్), "దికేస్ ఆఫ్ సెర్జీయుమవాన్ పీవ్" (రష్యా) లకు బహుమతులిచ్చి గౌరవించారు హంగేరీయన్ చిత్రాలు "ది ఆర్టిస్" "హాఫ్ ఎ పింట్"లకు జ్యూరీ ప్రత్యేక బహుమతి లభించింది.

డాక్యుమెంటరీలలో ఇటాలియన్ చిత్రం "పికాసో" పోలిష్ చిత్రం "అండర్ వన్ స్కై" బ్రిటిష్ చిత్రం "నో బుల్ కార్సికా" రష్యన్ చిత్రం "సీక్రెట్ ఆఫ్ సబ్ సైన్స్" చైనీస్ చిత్రం ఫయల్ రీజియన్, జెక్ చిత్రం "రోడ్ లీడ్స్ టుటిబెట్" లకు లభించాయి.

* * *



జోగారావు అకాలమరణం

"చంద్రహారం" లో నిక్షేపరాయుడుగా 'ఏదినిజం' లో తిరుపతిగా, నటించి, సర్వత్రా ఆదరాభిమానాలు మూరగొని కొద్ది కాలంలోనే మంచి పేరు గడించుకొన్న యండమూరి జోగారావు ఆగస్టు 1 వ తేదీ ఉదయం మృతిచెందారని తెలుపుటకు విచారిస్తున్నాము. ఆయనవయసు 33 సంవత్సరాలు.

జోగారావు కొంత కాలంగా అస్వస్థతతో తీసుకొంటూ వచ్చారు. క్షయలక్షణాలున్నట్లు తెలియడంతో జనరల్ ఆస్పత్రిలో చేరారు. వారం తిరిగేసరికి అకాలమరణం సంప్రాప్తం అయింది.

నవ్వుతూ నవ్విస్తూ ఎప్పుడూ హుషారుగా తిరిగే జోగారావు మృతి చలన చిత్ర పరిశ్రమలో వారందరికీ సంతాపం కలిగించింది.

జోగారావు నటించిన మొదటిచిత్రం విజయవారి "షావుకారు" తరువాత "పెళ్ళి చేసిచూడు" "చంద్రహారం". ప్రతిభావారి "శేముక్క," "ఏదినిజం" చిత్రాలలో నటించాడు. మరణకాలంనాటికి అతడు పాల్గొంటున్న చిత్రాలు సాహిణీవారి "పెంకి పెళ్ళాం", అశోకావారి "భూలోకరంభ," ఆర్. ఆర్. పిక్చర్స్‌వారి "కార్తవరాయన్ కథ," నందీవారి "సౌభాగ్యవతి."

* * *

సినిమా వార్తలు

శరత్ నవల "నిష్కృతి" ఆధారంగా అన్నపూర్ణా పిక్చర్స్ వారు నిర్మిస్తున్న "తోడికోడళ్ళు" వాహినీలో చురుకుగా తయారవుతోంది. ఇది అన్నపూర్ణా పిక్చర్స్ రెండవ చిత్రం. వీరి తొలి చిత్రం "దొంగ రాముడు" ఆంధ్రలో విజయవంతంగా నడిచింది. మొన్న నే ఆ చిత్రాన్ని "తిరుట్టురామన్" పేరిట తమిళంలో డబ్ చేసి విడుదలచేయడం కూడ విదితమే.

"తోడి కోడళ్ళు" చిత్రానికి శ్రీ ఎ. సుబ్బారావు దర్శకుడు. నాగేశ్వరరావు, సావిత్రి, రంగారావు, రేలంగి, జగ్గయ్య, కన్నాంబ, సూర్యకాంతం పాల్గొంటున్నారు. ఈ చిత్రం తమిళంలో కూడా తయారవుతోంది. ఈ చిత్రానికి మాటలు ఆత్రేయ, పాటలు కొసరాజు, ఆత్రేయ వ్రాస్తున్నారు.

అనుపమా పిక్చర్స్ వారు నిర్మిస్తున్న "ముద్దు బిడ్డ" చిత్రం పూర్తి అయిపోయినట్టే. ఈ నెలాఖరులోగానే విడుదల చేయగలరని తెలుస్తోంది. శ్రీ తిలక్ దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో లక్ష్మీరాజ్యం, జమున, సూర్యకాంతం, నాగయ్య, జగ్గయ్య, సి. ఎస్. ఆర్, చదలవాడ కుటుంబరావు, రమణారెడ్డి, పేకేటి, మొదలగువారు పాల్గొంటున్నారు. ప్రధాన పాత్ర, ముద్దుబిడ్డగా మాస్టర్ వెంకటేశ్వర్ నటిస్తున్నాడు. శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు.

* * *

నందీవారి "సౌభాగ్యవతి" రేవతీ స్టుడియోలో చురుకుగా తయారవుతోంది. సావిత్రి, రామారావు ఇందులో ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీ జంపన చంద్రశేఖరరావు దర్శకత్వం నిర్వహిస్తున్నారు. ఇప్పటికి 10 రీళ్ల వరకూ ఎడిటింగ్ పూర్తి అయింది. సెప్టెంబరు ఆఖరువారంలో గాని, అక్టోబరు మొదటి వారంలో గాని ఈ చిత్రం విడుదలకావచ్చునని కుంటున్నారు.

* * *

సాహిణీవారి "పెంకి పెళ్లాం" శ్రీ కమలాకర కామేశ్వరరావు దర్శకత్వాన వాహినీలో తయారవుతోంది. మూడువంతుల పైచిలుకు చిత్రం పూర్తిఅయింది. రామారావు, రాజసులోచన, శ్రీరంజని, సూర్యకాంతం, రేలంగి, రమణారెడ్డి ప్రభృతులు పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి శ్రీ కె. ప్రసాదరావు సంగీత దర్శకుడు. ★

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్ వాలెస్

అరుణ వలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

34. ప్రభుత్వానికే ఎసరు

ఇన్‌స్పెక్టర్ పార్ లండను తిరిగి వచ్చేసరికి సాయంత్రం పత్రికలన్నిటిలోనూ కొత్త అద్భుతం ప్రత్యక్షమైంది.

అరుణవలయం అతి సాహసోపేతమైన కార్యక్రమం తలపెట్టింది.

పత్రికలకు అధికారులు జారీచేసిన ప్రకటనలో, ఆ ఉదయం మంత్రులందరికీ టపు చేసిన లేఖ ఒకటి అందినదనీ, అది అరుణ వలయం నుండి వచ్చిందనే సంగతి తప్పిస్తే దాన్ని గూర్చిన ఆచూకీ ఏమీ తెలియరాలేదనీ ఉన్నది. ఆ లేఖలో ఇలా ఉన్నది:

"మమ్మల్ని పట్టుకోవడానికి మీ పోలీసు శాఖ, అధికారికంగానూ, అనధికారంగానూ చేసిన ప్రయత్నాలు, డెరిక్ యేల్ అసాధారణప్రజ్ఞా, చీఫ్ ఇన్‌స్పెక్టర్ పార్ పట్టుదలా అన్నీ వ్యర్థమైనాయి. మేము మా కార్యక్రమ విజయంకోసం పలువురు వ్యక్తులను మట్టుపెట్టవలసివచ్చింది. వారి మీద మాకు వ్యక్తిగత ద్వేషమేమీ లేకపోయినా, ఇతరులకు హెచ్చరికగా హత్యలు చేయవలసివచ్చింది. ఈ వుదయమే శామ్యూల్ హేగిట్ అనే లాయరును రూపుమాపవలసివచ్చిందని తెలపడానికి విచారిస్తున్నాము. ఈ హేగిట్‌ను కీ॥ శే॥ హోర్స్‌ఫ్రాయంట్ ఒకానొకపనిలో నియోగించాడు. ఆ పని కొనసాగిస్తున్న సందర్భంలో హేగిట్ మమ్మల్ని కనిపెట్టేసేటంత వరకూ వచ్చాడు. అతడు వ్యక్తిగతంగా తనొక్కడే ఈ పని సాగించాడు గనుక, మా ప్రతీకారం అతని కంపెనీలోని ఇతరులపైకి పోకుండా అతనితోనే ఆగిపోయింది. అతని శవం బ్రిక్స్‌టన్, మార్స్‌డెన్ మధ్య రైలుమార్గం పక్కన కనిపిస్తుంది.

పోలీసులు మమ్మల్ని నిరోధించలేకపోయారు గనుకనూ, ప్రజలకు మేము అత్యంతహానికరంగా పరిణమించామని అధికారులు వెలిబుచ్చిన అభిప్రాయంతో మేము పూర్తిగా ఏకీభవిస్తున్నాము గనుకనూ, ఇకమీదట మా చర్యలను నిలిపివేయడానికి ఒక షరతుమీద అంగీకరిస్తున్నాము. పదిలక్షల పౌనులు మాకు స్వాధీనం చెయ్యాలి. ఏ విధంగా ఈ ధనం మాకు అందజేయవలసిందీ మేము తరవాత తెలియజేస్తాము. మమ్మల్ని నిర్నిబంధంగా క్షమిస్తున్నామని కూడా వ్రాతమూలకంగా ప్రకటించాలి. అవసరం వచ్చినప్పుడో, మేము ఎవరమో తెలిసిపోయినప్పుడో ఆ క్షమా ప్రకటనను మేము ఉపయోగించుకుంటాము.

మా షరతులను అంగీకరించకపోతే విషాదకరమైనఫలితాలు సంభవిస్తాయి. పన్నెండుగురు పేరుపొందిన పార్లమెంటు సభ్యులను మేమీ దిగువ పేర్కొంటున్నాము. వీరిని హామీగా మేము ఉపయోగించుకుంటాము. మా షరతులకు అంగీకరించినట్లు ప్రభుత్వం వారం రోజులలోగా ప్రకటించకపోతే ఆ పన్నెండుగురిలోనూ ఒకరిని రూపుమాపివేస్తాము"

ప్రభుత్వ కార్యాలయానికి రాగానే ఇన్‌స్పెక్టర్ పార్‌కు మొదటగా కనిపించిన వ్యక్తి డెరిక్ యేల్. అతడు చాలా ఆందోళితుడై ఉన్నాడు.

"ఇది మరీ అన్యాయంగా ఉన్నదే. నేను నేరస్థుణ్ణి కనుక్కోగలిగాననుకున్న సమయంలో ఇది వచ్చింది. నాకు భయంగానే ఉంది. పైగా ఇవ్వాళ నేను వేసుకున్న కార్యక్రమం అనవసరంగా మానుకున్నాను" అన్నాడు యేల్. పార్‌కు వెంటనే జ్ఞాపకం వచ్చింది.

"అవునవును, ఇవ్వాళేగా నువ్వు హతం కావలసినరోజు. అయినా అరుణవలయం వాళ్ళు వ్యక్తులను క్షమించి ప్రభుత్వంమీద పగపట్టారు. గనుక బహుశా నిన్ను కూడా క్షమించేసి ఉంటారు" అన్నాడు పార్. యేల్ నవ్వాడు.

"ఇవ్వాళ సమావేశంలోకి వెళ్ళేముందు నీతో ఒక ముక్క చెప్పాలి. నేను పూర్తిగా నీ అధికారం క్రింద ఉన్నాను. నువ్వు ఏం చెయ్యమంటే అది చేస్తాను. నన్ను పోలీసుశాఖలోకి చేర్చుకుందామని, అరుణ వలయం కేసులన్నీ నాకు అప్పగించాలనీ మంత్రివర్గం అనుకుంటోంది. ముందు నన్నడిగారు. అడిగితే నాకు వద్దని చెప్పాను. ఈ కేసు దర్యాప్తుకు నువ్వే సమర్థుడవనీ, నేను నీ క్రింద తప్ప ఇంకెవరి క్రిందా పనిచెయ్యననీ చెప్పేశాను."

"బావుంది. కాని మంత్రివర్గం నీతో ఏకీభవించక పోవచ్చు" అన్నాడు పార్.

మంత్రివర్గం సమావేశమైంది. అరుణ వలయం బెదిరింపులు అందిన సభ్యులందరూ మొదటినుంచీ సభలో పాల్గొన్నారు. కొంతసేపైన తరవాతగాని ఇతరులను పిలవలేదు.

ముందు డెరిక్ యేల్‌ను లోపలికి పిలిచారు. ఒకపావుగంట తరవాత పార్‌ను పిలిచారు.

హాజరైనవారందరినీ పార్ ఎరుగును. కాని వారి రాజకీయాలపై అతనికి గౌరవం లేదు. అసలు అతడు గదిలోకి రాగానే, సభ్యులు కూడా అతనిపై క్రోధవీక్షణాలు ప్రసరించారు. తనపై ఎవరికీ సదభిప్రాయం లేదని అతడు సులభంగానే పసికట్టాడు. ప్రధానమంత్రికి పార్ వినయంగా నమస్కరించాడు గాని, ఆయన చాలా ముభావంగా తలపంకించడంతో అతని నమ్మకం దృఢపడింది.

"మిస్టర్ పార్!" అని ప్రధానమంత్రి కటువుగా సంబోధించి "అరుణవలయం గూర్చి మేము చర్చిస్తున్నాము. ఇదిజాతీయ సమస్యగా తయారైందని నీకు తెలిసిందే. మంత్రివర్గంలోని కొందరికి వాళ్ళు ఉత్తరాలు పంపినట్లు నువ్వు పత్రికలలో చదివే వుంటావు" అన్నాడు.

"చదివానండి" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"నువ్వు చేస్తున్న దర్యాప్తు ఏమీ బాగా లేదని మేమంతా అనుకుంటున్నాము. నీకు అన్ని సౌకర్యాలు, అన్ని అధికారాలు ఇచ్చాముకూడా. ముఖ్యంగా నీకు–" అని

ఎదురుగావున్న కౌగిలంలో ఏదో చూసి చెప్పబోతుండగా, షార్ అడ్డంవచ్చి,

"నా కేమేమి అధికారాలిచ్చారో సభ వారికి చెప్పడం నాకిష్టంలేదు" అన్నాడు.

ప్రధానమంత్రి చకితుడైనాడు. "మంచిది. నీకు అసాధారణ సౌకర్యాలు, అధికారాలు ఇచ్చినప్పటికీ, కొన్ని సందర్భాలలో హత్యాస్థలాలలో నువ్వు హాజరై వున్నప్పటికీ నేరస్థుణ్ణి పట్టుకోలేకపోయావు." ఇన్‌స్పెక్టరు ఈ నిందను అంగీకరించినట్లు తల ఊపాడు.

"డెరిక్ రేల్ రెండుహత్యలను చూసీనీ రెండుసార్లూ హంతకులనుపట్టుకోగలిగాడు. అసలు నాయకుణ్ణి కనుక్కోలేక పోయినప్పటికీ అతడు కొంతవరకూ కృతకృత్యుడైనాడు. అసలీకేసును అతనిచేతికే అప్పగించాలని మేము మొదట అనుకున్నాము. అయితే నువ్వు అధికారంలో ఉంటే నీ క్రిందపనిచేయడానికిమాత్రమే అతడంగీకరించాడు గాని పూర్తిబాధ్యత తీసుకోడానికి ఇష్టపడడంలేదు. మేము దానికి అంగీకరించాము. నువ్వు రాజీనామా పెట్టావనీ, కమీషనర్లు నీ రాజీనామాను ఆమోదించారనీ తెలిసింది. అయితే కొంతకాలంపాటు నీ రాజీనామాను వాయిదా వెయ్యాల్సివుంటుంది" అని చెప్పి ప్రధానమంత్రి కొంచెం ముందుకువంగి నిశ్చితంగా చెబుతున్నటు గంభీర కంఠంతో "అరుణవలయం షరతులకు మేము అంగీకరించడం అసంభవం. అంగీకరిస్తే న్యాయానికీ, ప్రభుత్వ ధర్మానికీ అర్థంలేకుండాపోతుంది. మంత్రివర్గసభ్యులకు నువ్వు సరియైన రక్షణ ఏర్పాట్లు చేస్తావనీ, హంతక భయం నుండి కాపాడతావని ఆశిస్తున్నాను."

ఇన్‌స్పెక్టరు నెమ్మదిగా లేచి నుంచుని "అరుణవలయం చెప్పినట్లు చెయ్యలేగాని, మంత్రివర్గంలోని ఏ సభ్యుడికీ అండనులో ఉన్నంతకాలమూ ఏ భయమూ లేదనీ, ఎవరిమీదా ఈగైనా వాలనివ్వననీ హామీ ఇస్తున్నాను. అరుణవలయం నాయకుణ్ణి పట్టుకోగలనో లేదో అనేదిమాత్రం చూడవలసివుంది" అన్నాడు.

"ఈ హాగిట్ అనేవాడు ఖూనీ అయినట్లేనా?" అని ప్రధాన మంత్రి అడిగాడు.

డెరిక్ రేల్ సమాధాన మిచ్చాడు:

"ఇవాళ ఉదయమే హాగిట్ శవం కనిపించిందండి. మార్స్‌డెన్‌లోని తన ఇంటికి నిన్నరాత్రి హాగిట్ రైలులో వెడుతుండగా మార్గ మధ్యంలో హత్య జరిగిందండి."

"ఘోరం! ఏం హత్యలు, ఏంహత్యలు! వీటికి అంతూ పంతూ ఉన్నట్లు కనబడడం లేదు."

సభనుండి బయటికి వచ్చేసరికి చాలామంది గుమిగూడి ఉన్నారు. అరుణవలయం



'గృహ' పరిశ్రమ

ఫోటో: శ్రీపాద వెంకన్న.

గూర్చి చర్చలు జరుగుతున్నాయని జనానికి ఎలాగో తెలిసింది.

డెరిక్ యేల్‌ను అందరూ గుర్తుపట్టి పూర్వ ధ్యానాలు చేశారు. ఇన్‌స్పెక్టరు పార్‌ను ఎవరూ గుర్తుపట్టలేదు. అదీ నయమే అనుకున్నాడు పార్.

అరుణవలయం దురంతాల్ని గూర్చి నగరమంతా అట్టుడికినట్టుడికిపోతోంది. కొన్ని పత్రికలు అరుణవలయం చిహ్నం కూడా రంగుల్లో ప్రకటించాయి. అరుణవలయం బెదిరింపు కొనసాగుతుందా లేదా అని నలుగురు చేరిన ప్రతిచోటా చర్చలు సాగాయి.

థాలియా డ్రమండ్ కార్యాలయంలో కూర్చుని సాయంకాలపు పత్రిక చదువుతోంది. ప్రతివాక్యం, ప్రతిమాట శ్రద్ధగా చదివేస్తోంది. డెరిక్ యేల్ లోపలికి వచ్చాడు.

“మిస్ డ్రమండ్! దీన్ని గూర్చి నీ అభిప్రాయం ఏమిటి?”

“బ్రహ్మాండంగా ఉంది. అద్భుతంగా ఉంది” అన్నదామె.

“ఇందులో ఏముంది అంత గొప్పగా మెచ్చుకోడానికి? నీ అభిప్రాయాలన్నీ బలే చిత్రంగా ఉంటాయే!”

“మిస్టర్ యేల్! నేను చిత్రమైన మనిషినని మీరే చాలా సార్లు అన్నారుగా.”

తలుపుదగ్గరఆగి యేల్ వెనక్కి చూశాడు. అతని తీవ్ర దృక్కులకామె ఏ మాత్రం చలించక తనుకూడా అంత తీవ్రంగానూ చూసింది.

“ఇక మీద నేను పోలీసు ప్రధాన కార్యాలయంలో పనిచేయవలసి ఉంటుందనుకుంటాను. నీలాంటి వ్యక్తి అటువంటి చోట పనిచేయడం కష్టం గనుక, నువ్విక్కడే ఉండి నా చిన్న చిన్న పనులన్నీ చేసి పెడుతూ ఉండు,” అని యేల్ చెప్పాడు.

“అరుణవలయాన్ని పట్టుకునే బాధ్యత మీరు వహించారన్న మాటేనా?”

యేల్ “ఉహూ ఇన్‌స్పెక్టర్ పార్‌దే ఆబాధ్యత. నేను అతనికి సహాయంగా మాత్రమే పని చేస్తాను,” అన్నాడు.

అంతకంటె ఎక్కువగా తనకొత్త అధికారాన్ని గూర్చి అతడు మాట్లాడలేదు. తరవాత ఆఫీసు వ్యవహారాలలో మునిగి పోయారు. మధ్యాహ్న ఫలాహారానికి యేల్ బయలుదేరాడు. వెడుతూ వెడుతూ థాలియాతో అపూట ఆమె చేయవలసిన పనులు చెప్పి వెళ్ళాడు.

అతడు అట్లా వెళ్ళగానే టెలిఫోన్ మ్రోగింది. థాలియా రిసీవరు తీసి ఎవరని అడిగి, అవతలికంఠం వినగానే ఒక్కసారిగా ఉలికిపడింది.

“ఆ, అవును నేనే” అన్నదామె.

“అక్కడ మిస్టర్ యేల్ ఉన్నారా?” అని టెలిఫోన్‌లో జాక్ అడిగాడు.

“ఇప్పుడే బయటికి వెళ్లారు. ఇప్పుడు రారు. ఏమైనా అర్జంటుగా చెప్పాల్సి ఉంటే, నేను చెబుతాను,” అని థాలియా సమాధాన మిచ్చింది.

“అర్జంటో కాదో చెప్పలేను. ఇవ్వాళ పొద్దున నేను మాతండ్రిగారి కాగితాలన్నీ తిరగేస్తుంటే, వాటిలో మార్లకు సంబంధించిన కాగితాలు చాలా కనిపించాయి,” అన్నాడు జాక్.

“మార్ల కాగితాలా?”

“అవును. మార్లను గూర్చి మాతండ్రిగారికి చాలా తెలుసనుకుంటాను. మార్ల కొంతకాలం జైల్లో ఉన్నాడట. నీకు తెలుసా?”

“అందులో ఆశ్చర్యమేమీ లేదే,” థాలియా అన్నది.

“మాతండ్రిగారు తనతో వ్యాపారం చేసేవారిని గూర్చి లోతుగా తెలుసుకుంటే తప్ప సంబంధం పెట్టుకునేవారు కారు. మార్ల అతి దుర్మార్గుడు లాగా ఉన్నాడు. వాడి కాగితాల్లో ఒక కవరు ఉన్నది. ఆ కవరుమీద ‘ఉరి తీస్తున్నప్పుడు ఫొటో’ అని ఉన్నది. దానిమీద సీలుకూడా వేసి ఉన్నది. బహుశా దాన్ని ఎవరూ చూడలేదనుకుంటాను.”

“నువ్వు చూశావా?” ఆమె తొందరగా అడిగింది.

“లేదు. ఏం, ఎందుకూ?” జాక్ ఆశ్చర్యపోతూ అన్నాడు.

“నేనొకటి అడుగుతాను, చేస్తావా జాక్!”

సాధారణంగా ఆమె అతన్ని మిస్టర్ వియర్డ్‌మోర్ అని గౌరవపూర్వకంగా సంబోధిస్తుంది. ‘జాక్’ అనిసన్నిహితత్వంతో పిలవడం ఇదే మొదటిసారి. “ఓ తప్పకుండా. నువ్వడిగితే ఏం చెయ్యమన్నా చేస్తాను.”

“ఆకవరు నువ్వు తెరవవద్దు మార్ల కాగితాలన్నీ సురక్షిత ప్రదేశంలో దాచు. ఇదే నేను కోరేది.”

“ఇంతేగద. తప్పకుండా. అలాగే చేస్తాను. ఎంత చిత్రమైన కోరికకోరావు!”

“దాన్ని గూర్చి ఎవరికైనా చెప్పావా?”

“ఇన్‌స్పెక్టర్ పార్‌కు ఒక చీటీ రాసి పంపాను.”

ఆమె అది విని గాబరాపడింది.

“ఇంకెవరికీ చెప్పనని వాగ్దానం చేస్తావా? ముఖ్యంగా ఫొటోను గూర్చి,” అని అడిగింది.

“ఎవ్వరికీ చెప్పను. నీకు కావాలంటే దాన్ని పంపిస్తాను.”

“వద్దు వద్దు. నీ వద్దనే ఉండనియ్యి,” అని చెప్పి రిసీవరు మూసివేసింది.

గబగబ ఆయాసపడుతున్నట్లు ఊపిరి తీస్తూ కొంత సేపు కూర్చుంది. తరవాత లేచి టోపీ పెట్టుకొని ఆఫీసు మూసివేసి మధ్యాహ్న ఫలాహారానికి బయలుదేరింది.

35. మంత్రితో థాలియా స్నేహం

నాలుగో తేదీ గడిచింది. డెరిక్ యేల్‌కు హత్యా ప్రమాదం దాటిపోయింది. తాను లండను నుండి వెళ్లిపోయి ఎక్కడో చేపలు పట్టుతూ విశ్రాంతిగా గడుపుదామనుకున్న రోజు వృధా అయిపోయిందని యేల్ విచారపడ్డాడు. కాని పార్ మాత్రం “నువ్వు లండను వదిలి వెళ్ళక పోవడమే మంచిదైంది. వెళ్ళితే తిరిగి వచ్చేవాడివి కాదు,” అన్నాడు.

యేల్ నవ్వి “నీకు అరుణవలయం శక్తిసామర్థ్యాల మీద బాగా నమ్మకం ఉన్నట్లుందే” అన్నాడు.

ఉత్తర మేదో వ్రాసుకుంటున్న పార్ తల ఎత్తకుండానే “అవును,” అన్నాడు.

కాసేపాగి "బ్రుజాన్ ఏదో వాఙ్మూలం ఇచ్చాడట గదూ?" అని యేల్ అడిగాడు.

"ఇచ్చాడు. కాని దానివల్ల ఏమీ ఉపయోగం లేదు. అరుణవలయంవారు అనేకులు వ్యక్తుల నుండి బలాత్కారంగా సంగ్రహించిన ధనాన్ని, చాలా కాలంగా తనకు తెలియకుండానే చెలామణీ చేసి పెడుతున్నానని అతను ఒప్పుకున్నాడు. అరుణవలయంలో తాను ఏ పరిస్థితులలో చేరిందీ చెప్పి, చేరినప్పటినుండి బుద్ధి పూర్వకంగానే నేరాలు చేసినట్లు అంగీకరించాడు"

"మార్ల్ హత్యానేరం బ్రుజాన్ పై మోపుతున్నారా?"

"లేదు. దానికి తగినంత సాక్ష్యం దొరకలేదు," అని చెప్పి, పార్ ఉత్తరం మడచి, కవరులో పెట్టాడు.

"నువ్వు ఫ్రాన్సు వెళ్లి కనుక్కున్న విశేషాలేమిటి? ఆ సంగతి ఎప్పటికప్పుడు అడుగుదామనుకుంటూనే మర్చిపోతున్నాను."

కుర్చీలో వెనక్కి చేరబడి కాళ్ళని పైకి జాలిగించి పార్ సమాధానమిచ్చాడు.

"ఫ్రాయంట్ కనుక్కున్న విశేషాలే నేనూ కనిపెట్టాను. ముఖ్యంగా మార్ల్ గురించి, అతను చేసిన నేరాల్ని గురించి దర్యాప్తు చేశాను. మార్ల్ ఒక దొంగల ముఠాలో ఉండేవాడు. అతడు, అతని స్నేహితుడు లైట్‌మన్ ఇద్దరికీ ఉరిశిక్ష పడింది. లైట్‌మన్‌కు ఏదో పొరబాటువల్ల ఉరితప్పింది అతనికి ద్వీపాంతరవాస శిక్ష వేశారు. అక్కడతను చనిపోయాడు."

"లేదు. పారిపోయాడు," అని యేల్ చెప్పాడు.

"ఏమో పారిపోయాడేమోగాని, నా దృష్టిఅంతా లైట్‌మన్ మీద కంటె మార్ల్ మీదే ఉంది"

"ఫ్రెంచి భాష నీకు వచ్చా?" అని యేల్ అడిగాడు.

"ఓ, బాగా మాట్లాడగలను ఎందుకూ?"

"అబ్బే, ఏం లేదు, ఈ దర్యాప్తు అంతా ఎలా సాగించావా అని."

"ఫ్రెంచిలోనే సాగించాను-" అని పార్ సంభాషణ తప్పించబోయాడు.

యేల్, అందుకుని "లైట్‌మన్ పారిపోయాడు. ఇప్పుడెక్కడున్నాడో మరి," అన్నాడు.

పార్ కొంచెం విసుగ్గా "ఎక్కడుంటేనేం నేనా సంగతి ఆలోచించదలుచుకోలేదు," అన్నాడు.

"మార్ మీద ఆసక్తి నీ ఒక్కడికేకాదు, ఇంకా మరికొందరికి కూడా ఉన్నట్లు తోస్తుంది. మార్ల్ కాగితాలు కొన్ని తనకు కనిపించాయని జాక్ బిఝుర్దుమోర్ వ్రాసిన చీటీ ఒకటి నీ బల్లమీద చూశాను. జాక్ తండ్రికూడా నీలాగే దర్యాప్తు చేశాడట."

ఆ రోజున యేల్ పోలీసు కమీషనర్‌తో విందారగించ బోతున్నాడని పార్‌కు తెలిసింది. విందుకు తన్ను పిలవలేదని పార్ కోపం తెచ్చుకోలేదు. అతను మంత్రివర్గ సభ్యులకు రక్షణ ఏర్పాట్లు చేయడంలో మునిగి ఉన్నాడు. పైగా ఇలాంటి విందులంటే అతనికి తలనొప్పి.

పార్ విందుకు వచ్చి ఉంటే డెరిక్ యేల్‌కు ఇబ్బంది కలిగేది. పార్ పనో

★ అరుణవలయం ★

తుంలో అతడొక విషయం కమీషనరుకు చెబుదామనుకున్నాడు.

విందు ముగిసిపోతున్న సమయంలో యేల్ తను చెప్పదలచిన విషయం చెప్పాడు. అదివిని కమీషనర్ నిర్ఘాంతపోయాడు. నమ్మలేక పోయాడు.

"పోలీసు కార్యాలయంలో నేరస్థుడా! అసంభవం మిస్టర్ యేల్" అన్నాడాయన.

"ఏదీ అసంభవం కాదు. మీరొక్కసారి జరిగిన నేరాలన్నీ పరిశీలనగా చూడండి. నేను చెప్పేది సంభవమో కాదో తెలుస్తుంది. అరుణవలయం నాయకుణ్ణి పట్టుకోవడానికి మనం చేసిన ప్రయత్నాలన్నీ ముందే వాడికి తెలిసిపోయాయి. జైలుగదిలోకి ప్రవేశానుమతి ఉన్నవాడే ఎవడో ఆ నిల్లీని ఖూనీ చేశాడు. ఫ్రాయంట్ హత్య మాడండి. బోలెడుమంది పోలీసులు కాపలా ఉండగా ఫ్రాయంట్ హత్యచేయబడ్డాడు. లోపలికెవ్వరూ రాలేదు, బయటికెవ్వరూ పోలేదు." అని చెప్పాడు యేల్.

కమీషనర్ ఆలోచించి "మనం నిర్మొగమాటంగా మాటాడుదాం. నీ ఉద్దేశం పార్ దోషి అనా?" అన్నాడు.

డెరిక్ యేల్ నవ్వేసి "కాదు కాదు. పార్ దోషి అని నేననడంలేదు. నేను చెప్పేదల్లా మీరు జాగ్రత్తగా ఆలోచించాలని మాత్రమే. ప్రతివివరమూ, ప్రతి నేరమూ పరిశీలనగా చూస్తే ఒక విషయం మీకు స్పష్టంగా కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది: అధికారంలో ఉన్నవాడే ఎవడో దీని వెనుక ఉన్నాడనిపిస్తుంది," అన్నాడు.

"పార్?" అని మళ్లీ కమీషనరు ప్రశ్నించాడు.

"పార్‌ను శంకించడం లేదుగాని, బహుశా అతని కిందిఉద్యోగి ఎవడో పార్‌ను బలవంతంగా ఉపయోగించుకుంటున్నాడేమోనని నా ఉద్దేశం. నేమజరిపేవిచారణద్వారా పార్ దోషి అని తేలితే అతనిపై అభియోగం వేయడానికి నేను వెనుదీయను. ఆ మాటకొస్తే, మిమ్మల్ని కూడా నేరాలకు బాధ్యులుగా చేయడానికి వెనుదీయను."

కమీషనరు కొంచెం తెల్లబోయి చూశాడు. "అరుణవలయం గూర్చి నాకేమీ తెలియదని నేను ప్రమాణం చెయ్యగలను," అన్నాడు వెంటనే తనుచేసిన ప్రమాణం తనకే హాస్యాస్పదంగా కనిపించి నవ్వాడు.

ఇంతలో కమీషనరు తాము కూర్చున్న రెస్టరాంటులో కొంతదూరాన కూర్చున్న జంటను చూపిస్తూ "ఆ అమ్మాయి ఎవరు? నీకేసి ఇందాకటినుంచీ చూస్తోంది," అన్నాడు.

"ఆమె పేరు థాలియా డ్రమండ్. ఆమెతో కూర్చున్నవాడు రాఫేల్ విలింగ్స్ అనుకుంటాను. అరుణవలయంవారు హత్య చేస్తామని బెదిరించిన మంత్రులలో ఒకడు," అని యేల్ చెప్పాడు.

"థాలియా డ్రమండ్? ఓ. ఈమె కొంతకాలం క్రితం ఏదో దొంగతనంచేసి జైల్లో పడిందిగదూ? కొంతకాలం ఫ్రాయంట్ వద్ద సెక్రటరీగా పనిచేసింది కదూ?"

"అవును. ఆమె చాలా చిత్రమైన యువతి. అన్నిటికంటే ఆమె సాహసం, నిబ్బరం ఇంకా చిత్రమైనవి. ఈ క్షణంలో ఆమె నా ఆఫీసులో కూర్చుని ఉత్తరాలకు జవాబులు రాస్తూనో, టెలిఫోన్ పిలుపులు వస్తే నా తరఫున సమాధానాలు ఇస్తూనో ఉండాలి. ఇక్కడికెందుకు వచ్చిందో మరి"

కమీషనరు ఆశ్చర్యపడ్డాడు. "ఇప్పుడు నీ దగ్గిర పనిచేస్తోందా ఈ పిల? నిజమే సాహసురాలే. దొంగతనాలు మరిగిన ఈ యువతితో మంత్రి విలింగ్స్‌కి ఏం పని?" అని అడిగాడు.

తనకీ తెలియనంలేదని డెరిక్ యేల్ చెప్పాడు.

థాలియా లేచి స్నేహితుడితో కలిసి బయటికి వచ్చింది. ఆమె వెళ్లేటప్పుడు యేల్ కూర్చున్న బల్లను దాటుకొనే వెళ్లింది ఆమెకేసి అతడు సాభిప్రాయంగా చూశాడు. ఆమె నిర్భయంగా చిరునవ్వు నవ్వి, తన ననుసరించి వస్తున్న మంత్రితో ఏదో మెల్లిగా చెబుతూ నడిచిపోయింది.

"చూశారా ఆమె ధైర్యం?" యేల్ అడిగాడు.

యేల్ తన ఆఫీసుకు తిరిగి రాగానే, అంతకుముందే అక్కడికి చేరుకున్న థాలియాను చూసి ఇలా అన్నాడు:

"మిస్ డ్రమండ్! నీతో కొద్దిగా మాట్లాడాలి. నిన్ను నేను పనివేళలో ఇక్కడ ఉండమంటే రెస్టరాంటుకెందుకు వెళ్లావు? నేను స్పష్టంగా చెప్పాను కూడాను."

"కాని ఏం చెయ్యను మిస్టర్ యేల్! మంత్రి విలింగ్స్ తనతో విందారగించ రమ్మని మరీ మరీ ఒత్తిడిచేస్తే వెళ్లాను. మంత్రిగారు రమ్మంటే రాననడం బావుంటుందా?"

"నీకు ఆయన ఎలా తెలుసు?"

నిర్లక్ష్యంగా, నిశితంగా అతనికేసి చూసింది.

"వ్యక్తులతో రకరకాలుగా పరిచయం కలిగించుకోవచ్చు. పత్రికల్లో మాట్రిమోనియల్ ప్రకటన చేయవచ్చు. పార్కులో తటస్థపడవచ్చు. లేక ఎవరన్నా పరిచయం చేయవచ్చు. నేనాయనకి పరిచయం చేయబడ్డాను."

"ఎప్పుడు?"

"ఇవాళే మెరాన్ క్లబ్బుకి అప్పుడప్పుడు వెళ్ళడం నాకలవాటు ఇవాళ అక్కడికి వెళ్ళినప్పుడు ఆయనతో పరిచయమైంది."

యేల్ జేబులోంచి కొంత డబ్బు తీసి బల్లమీద పెట్టాడు.

"ఈవారం నీకు రావలసిన జీతం ఇదుగో. రేపటినుంచీ నువ్విక్కడికి రావలసిన పని ఉండదు" అని యేల్ నెమ్మదిగా చెప్పాడు.

ఆమె కనుబొమలెత్తి చూస్తూ "ఏమిటిది? మీరు నన్ను సంస్కరించి ఉద్ధరిద్దామనుకున్నారుగా?" అని గంభీరంగా అడిగింది. ఆమె ఎక్కడా వ్యంగ్యం గోచరించనంత గాంభీర్యంతో అలా అనేసరికి అతడు ఆశ్చర్యపడి, తరవాత నవ్వుకున్నాడు.

"నిన్ను సంస్కరించడం నాతరమా? నువ్వు చిల్లర డబ్బులు దొంగిలించినా నేను ఊరుకున్నానుగాని, నేను ఆఫీసులో ఉండమని నీతో స్పష్టంగా చెప్పివెళ్ళిన తర్వాత నా ఆదేశాన్ని నువ్వు ఉల్లంఘించడం సహించలేను."

ఆమె బల్లమీది డబ్బుతీసి లెక్క పెట్టుకున్నది

"సరిగ్గా ఇచ్చేశారే మీరు న్యాకేట్ వారనుకుంటాను," అంది.

"మిస్ డ్రమండ్! నువ్వు బాగుపడడానికి ఒకటే మార్గం ఉంది."

"ఏమిటది?"

"పెళ్ళి చేసుకో. నేనే పెళ్ళి చేసుకుందామా అని ఉంది," యేల్ అన్నాడు.

ఆమె నవ్వు అణుచుకోలేక ఊగిపోయింది. చివరకు నవ్వు ఆపుకుని "బలే హాస్యంగా మాట్లాడతారే మీరు! నిజంగా మీరు సంస్కర్తలే. నన్ను సంస్కరించాలని మాత్రమే పెళ్లిచేసుకోదలచారన్నమాట. వేరే ఏ భావమూ లేదన్నమాట."

"నిన్ను ప్రేమిస్తున్నానను కుంటున్నానా? లేదు."

"ప్రేమిస్తున్నా ననుకున్నాను. పోనీ లెండి. నా జీతం తీసుకుని నా దారినపోతాను. మీలాంటి అద్భుత ప్రజ్ఞాశాలివద్ద పనిచేసే అదృష్టం కలిగించినందుకు కృతజ్ఞురాల్ని."

అక్కడితో ఉభయుల సంభాషణ ఆగిపోయింది.

ఉద్యోగం పోయినందుకు ఖాలియా విచారపడలేదనడానికి వీలులేదు. తన్ను బర్తరఫ్ చేయడానికి కారణం, డేల్ తన్ను గాఢంగా అనుమానించి ఉండవచ్చు. అనుమానిస్తే ప్రమాదమే. తనకుఅరుణవలయంతో సంబంధం ఉన్నదనేకాక, ఇంకా పెద్ద రహస్యాలే ఏవో అతనికి తెలిసిఉండవచ్చు.

ఆమె తన బసకురాగానే ఆమె కొక ఉత్తరం అందింది. కిందటిరాత్రే ఒక ఉత్తరం వచ్చింది. మళ్లీ ఇప్పుడొక ఉత్తరం! అరుణవలయం నాయకుడు నాకెందుకు ఉత్తరాల మీద ఉత్తరాలు వ్రాస్తున్నాడు. ఆమె తలుపులు బిగించుకుని ఉత్తరం చదవ సాగింది.

"చెప్పినపని చక్కగా నేచేశావు. మంత్రి విలింగ్స్‌తో పరిచయం అతి నిపుణంగా కలిగించుకున్నావు. అతనితో స్నేహం వృద్ధి చేసుకో. అతనిలో చిన్న చిన్న మనో దౌర్బల్యాలేవైనా ఉంటే జాగ్రత్తగా కనిపెట్టు. నేను చేసిన ప్రతిపాదనపై అతని అభిప్రాయం, మంత్రివర్గాభిప్రాయం తెలుసుకో. ఇవ్వాళ నువ్వు మధ్యాహ్న ఫలాహార సమయంలో ధరించిన దుస్తులు బాగాలేవు. ఖర్చుకు వెనుదీయక మంచి దుస్తులు కొనుక్కో. నిన్ను ఇవ్వాళ మధ్యాహ్నం డెరిక్ డేల్ ఉద్యోగంనుంచి తొలగిస్తాడు. అయినా విచారపడకు. నీకు అక్కడ పనేమీ లేదు. ఇవాళరాత్రి మళ్ళీ మిస్టర్ విలింగ్స్‌తో విందారగించబోతున్నావు. అతనికి స్త్రీలోలత ఎక్కువ. వీలుంటే అతడు నిన్ను తన ఇంటికి ఆహ్వానించేట్లు చేసుకో. అతనివద్ద ప్రాచీనకాలపు రక రకాల ఖడ్గాలున్నాయి. అవన్నీ ఒక గదిలో పదిలపరచాడు. అవంటే అతనికి ఎంతో ప్రీతి. అవి చూసేమిషతో అతని ఇల్లంతా పరిశీలించు."

అరుణవలయంనుండి వచ్చిన ఈ లేఖతో పాటు కవరులో రెండు నూరు పౌనుల నోట్లు కొత్తవి ఉన్నాయి. అవి చేతి సంచీలో పెట్టుకుని ఆమె ఏదో ఆలోచించ సాగింది.

(ఇంకా ఉంది.)

ఆకూ, వక్కా

జి. సత్యారావు

కాలజా వెత్తిల్, కాలజా పాక్ వుమ్ము కాని, దాన్లో ఇంతసున్నం వేసుకుని ఘుమాఘా కబురుచెప్పుకోవటం మద్రాసు నగరంలో ఏ కిళ్లీకొట్టుదగ్గరచూసినా కనిపించేదృశ్యమే! ఆకు వక్క వేసుకుని వాళ్లు వెళ్లిపోయినతర్వాతగూడ చిరస్థాయిగా కన్పించే దృశ్యం ఆ ప్రక్క గోడల నిండా సున్నం మరకలు, తంబ ముద్దలు, ఉమ్మిధారలు.

ఆకు వక్క వేసుకోవటం మనదేశపు ఆచారాలలో ఒక విశిష్టస్థానం ఆక్రమించింది. ఇది బహుశా మరే దేశంలో నూ లేదేమోగూడా! మొగలాయి చక్రవర్తుల కాలంలో ఇది ధనికుల అలవాటు. ఆరోజుల్లో ఇది ఒక గొప్పగా పరిగణించబడేది. కాని ఈనాడు ఇది సామాన్య కుటుంబీకుని జీవితావసరంగా పరిణమించింది. అసలు తాంబూలం లేందే ఈ దేశంలో దేవుడుకూడా తృప్తిపడడు.

కలో గంజో తాగి ఆకు, చెక్కముక్క వేసుకుంటేనేగాని ఆ పూట భోజనం 'నిండు'గా వుండదు. మనిషి అలవాట్లను బట్టి, ప్రాంత ఆచారాన్ని బట్టి దీని మోతాదు, సేవించే సమయాలు మారుతూ వుంటాయి.

పల్లెటూరికుర్ర రైతు పొలంలో పనిచేసి వచ్చి, స్నానంచేసి, సుష్టుగా భోంచేసి వీధి అరుగుమీద కూర్చుంటాడు. రెండు ఆకులు, వక్క నోట్లో వేసుకుని తన పాటి పొలంలో స్వయంగా పండించిన పొగాకు పాయలుతీసి, చుట్టచుట్టుకుని నోట్లో పెట్టుకొని వెలిగించుకుని తృప్తిపడతాడు. అతనికి ఆ సమయంలోవుండే ఆనందం, తృప్తి మరెప్పుడూ వుండదనే చెప్పాలి. అతనికి తాంబూలంతో అప్పుడే పని. మరి ఆరోజుకు పనిలేదు.

రాయలసీమలో ఆకు వక్క ప్రాధాన్యం చాల ఎక్కువ. ఇది మర్యాదసూచకం. సర్కారుజిల్లాలలో ఇంటికివచ్చిన అతిథికి కాళ్లు కడుక్కోటానికి నీళ్ళిచ్చి, దాహం ఇవ్వటం ఆచారం. కాని రాయలసీమ గ్రామాల్లో అతిథిని సత్కరించటం అంటే ముందుగా ఆకు వక్క యివ్వటం; ఆతర్వాతనే మిగతా మర్యాదలు.

ఎనిమిదేళ్ల క్రితం కర్నూలు జిల్లాలో ఉద్యోగం చేస్తున్న మా అన్నదగరికి వెళ్లుతున్నా. మార్కాపురంలో ఉదయం రైలు దిగాను. అక్కడినుంచి ఆ గ్రామం 25 మైళ్లుంటుంది. ఉన్న బస్సు ఒక్కటే సాయంత్రం 6 గంటలకు బయలుదేరుతుంది. ఆ మారుమూల కుగ్రామంలో ఉద్యోగం చేస్తున్న వాళ్లంటే అదో మర్యాద గౌరవం! వాళ్లతరఫువాళ్లన్నా ఆదరం! పగలల్లా ఎలాగో గడిపి సాయంకాలం బస్సులో ఎక్కాను. నా వాలకం చూస్తే ఆ ప్రాంతపు వాడినికానని ఇట్టే గుర్తుపట్టొచ్చు. బస్సులో నా ప్రక్కనే కూర్చొన్న ఒకాయన ప్రశ్నించాడు ఎక్కడికి పోతున్నారని! ఎక్కడ ఉన్నారని! సంగతి చెప్పాను. "ఓ, మా చిన్న గుమాస్తాగారి తమ్ముడివా!" ఎక్కడలేని ఆప్యాయత. జోడోనుండి ఒక డబ్బాతీశాడు. అందులో అన్నీ అరలే! ఆకులు వక్కలు సున్నం వేరువేరు అరలలో వున్నయ్యి. ఒక ఆకు తీశాడు దాన్ని సగానికి తుంచాడు. "ఇంత" సున్నంతీసి దానికి రాశాడు. ఇంత పొగాకుకొడ తుంచాడు. పెద్దవక్క గుడ్డ క్రింద పెట్టి కొరికి ఒక చెక్క యిచ్చి వేసుకోమన్నాడు. నాకు చెడ్డ చిరాకేసింది. నాకు అలవాటులేదన్నాను. నవ్వుకున్నాడు. అది ఆ ప్రాంత మర్యాదని ఆయన చెప్పాడు.

నిద్రలేచి—లేస్తూనే సిగరెట్టు ముట్టించడం ఈ రోజుల్లో ఒక అలవాటు. ఈ అలవాటు అన్నిచోట్లా తయారవుతున్నది. కాని రాయలసీమ గ్రామాలలో దీనికిముందుగా ఆకు వక్క వేసుకోవాల్సిందే! గట్టిగాచూస్తే ఆ కొద్దికాలమూ తప్ప రోజల్లా నోట్లో ఆకు వుండాల్సిందే! అప్పుడప్పుడు పళ్లసందుగా ఆ వుమ్మిని బాణాసగా, సుతారంగా, వుమ్మివేయడం జరుగుతుంటుంది.

ఇక తమిళనాడులో వెత్తిల్ పాక్ మానవ శరీరంలో ఒకభాగంగా తయారయిందనే చెప్పాలి. రోజుకు రూపాయి తెచ్చుకునే కూలివాని దగ్గరనుంచి వేలరూయలు జీతం తీసుకునే ఆఫీసరు వరకు ఇది సహజగుణంగా తయారయింది. కూలివారి జోడ్లో వుంటుంది ఆఫీసరు బల్లలో వుంటుంది. అంతే లేదా!, యుద్ధాలలో సైనికులు ఆహారపు పొట్లాలు వెంట తీసుకు వెళ్లుతున్నట్లు రోజంతటికీ సరిపడ్డ ఆకులు సామగ్రి వెంట వుంటూనే వుంటుంది.

ఈ ఆచారం వలన ఆమధ్య మద్రాసు సచివాలయంలోను, శాసనసభా ప్రాంగణంలోను "న్యూసెన్సు" జాస్తీ అయిందని, ఇది నిర్మూలించుటకు కట్టుదిట్టాలు చెయ్యాలని తలపెట్టారు. తెల్లగా సున్నంకొట్టిన గోడలపై ఎవరో ఒక ప్రబుద్ధుడు వెత్తిల్ పాక్ వుమ్మివేశాడుట. ఎవరో ఏమిటి దాదాపు ఇది ఒక అలవాటు! చెయ్యాలని ప్రత్యేకంగా ఉద్దేశ్యం కాకపోయినా అదిమాత్రం జరిగిపోతుంటుంది.

ఒక మహాపాపి దారినిపోతూ ఒక శివాలయం దగ్గర కూచుని పేద తీర్చుకునే సమయంలో తాంబూలం వేసుకుని చేతికిఅయిన సున్నాన్ని గోడను రాశి వెళ్లాడుట. చచ్చిన తర్వాత అతనికి మోక్షం లభించిందంట! కారణం శివాలయానికి వెల్లవేశాడుట! అలా అయితే మద్రాసులో గోడలనిండా సున్నం రాచేవాళ్ల విషయం ఏమవుతుంది! 'పట్టణ సౌందర్యం పాడుచేస్తున్నార'నే నేరస్తులేగా వీళ్లందరు!

తాంబూలం సేవించడంలోకూడ కొన్ని సున్నితాలూ వున్నయ్యి. ఇవి మనుషుల అలవాట్లనుబట్టి ప్రాంతీయ ఆచారాల్ని బట్టి మారుతుంటయ్యి. అసలు తాంబూలం సేవించడం ధోరణి చూసి ఆయా మనుషుల గుణగణాలను కొంతవరకు ఊహించవచ్చునేమో!

మద్రాసులో మామూలు బీడాలు రెండు రకాలు. అరణా - ఒరణా అందులో వేసే రంగు సుందదార మొత్తాన్ని బట్టి ఆకుల సంఖ్యను బట్టి ఈధర మారుతూ వుంటుంది. తాంబూల సేవనంలో ఇక మూడో పద్ధతి, 'వెత్తిల్-సీవల్' (పచ్చివక్క సన్నగా తరిగినది) ఇది బీడాగా దొరకదు.

ఇక తెలుగు దేశంలో కిల్లీ ధర అణా నుంచి రూపాయి వరకు వుంది. సేవించే వ్యక్తి తాహతును బట్టి, అందులో వేసే

(56-వ పేజీ చూడండి)



సర్వప్రియ సరోజినీదేవి

ఇల్లిందల సరస్వతీదేవి

దౌర్భాగ్యపారతంత్రములు తెంప
సౌభాగ్య భారత జాతకమ్ము రచింప
సౌందర్యమూర్తివై స్వచ్ఛంద దూతివై
భోగిపండుగ పాలు పొంగింపగా వచ్చి
నావె సరోజినీదేవిమ తల్లి!

(రాయప్రోలు)

'రాజకీయాలలో పురుషులు ఉన్నంత వరకూ శాంతి లేదని సి. పి. గవర్నరుగా ఉన్న పట్వాభిగారు ఒక పర్యాయము దివ్య సందేశమిచ్చారు. అన్ని పదవులూ స్త్రీలకు వదలి పెట్టితే నేగాని శాంతి ఏర్పడదని ఆయనకు అంతర్వాణి పలికినట్లయినది.

శ్రీ పట్వాభిగారి ఊహాలకు కారణము లేకపోలేదు. సంయుక్త రాష్ట్రాలకు ప్రప్రథమ గవర్నరుగా సరోజినీదేవి 1947లో స్వతంత్ర భారతములో నియమింప బడ్డది. ఆమె పరిపాలనను చూసివచ్చిన తరువాత కలిగిన అభిప్రాయముతో ఇచ్చినదా సందేశము.

మన దేశపు స్వాతంత్ర్యోద్యమములో స్త్రీలు పురుషులు అనేకులు పాల్గొన్నారు. స్త్రీలలో మహోత్కృష్టికి అతి సన్నిహితముగా మెలగి ఆయన విశ్వాసానికి పాత్ర అయినది స్వర్గీయ సరోజినీదేవి.

సరోజినీదేవి తండ్రి అఘోర్ నాథ్ చటోపాధ్యాయ. గొప్ప గొప్ప డిగ్రీలు పొందిన ఉద్దండ పండితుడు. ఈమె తల్లి వరదా సుందరీదేవి, ఈ పుణ్య దంపతులకు 1879లో ఫిబ్రవరి 18వ తేదీన జన్మించిన ప్రథమ పుత్రిక సరోజినీదేవి. తన రాష్ట్రములో విద్యాభివృద్ధికై కృషి చేయవలసినదని హైదరాబాదు నైజాము ఆయనను ఆహ్వానించి అర్థించారు. అఘోర్ నాథ్ చటోపాధ్యాయ హైదరాబాదు రాగానే నిజాము కళాశాలలో ఆచార్యునిగా నియమింప బడ్డాడు ఈ పండితుడు కవితా హృదయము కలవాడు కాని ఈయన పుత్రికకు అబ్బిన కవిత్వము పిత్రీయము కాదు. ఈమె తల్లి వరదా సుందరీదేవి బంగభాషలో కొన్ని మనోహరమైన గీతాలను రచించిన కవయిత్రి. సరోజినీదేవి మధుర కవిత్వానికి మూలము మాతృదేవి. ఆమె సోదరులలో జ్యేష్ఠుడు రాజకీయరంగములో అతివాది. ఆమె కనిష్ఠ సోదరుడు రసజగద్విహారి. కాని సరోజినీదేవి ఉభయ రంగాలలో ఉన్నత శిఖరాల నందుకొనుటే కాక, కర్కశమయిన రాజకీయ క్షేత్రములో రసవాహినులను ప్రవహింపచేసిన కళామూర్తి. ఆమెకు ముగ్గురు చెల్లెళ్ళు, వారిలో ఒకరికి కళా ప్రియత్వమూ ఇంకొకరికి ప్రజాసేవా అభిమానము. తల్లికన్న సంతానములోని గొప్పగుణాలన్నీ ఒక్క సరోజినిదేవిలో మూర్తీభవించి పరాకాష్ఠ నందుకొన్నాయి. విద్యాసాగరుడు, రామకృష్ణ పరమహంస, వివేకానందవంటి వేదాంతులూ, బంకించంద్ర, రవీంద్ర శరచ్చంద్రులవంటి మహాకవులూ, నేతాజీవంటి రాజకీయవేత్తలు, జగదీశ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్రరేవంటి విజ్ఞానశాస్త్రవేత్తలూ ఉదయశంకరుని వంటి నాట్యాచార్యులూ జనించి పావన మొనర్చిన వంగదేశము సరోజినీదేవి జన్మస్థానము. వీరందరి ప్రజ్ఞా

★ సర్వప్రియ సరోజినీదేవి ★

ప్రాభవాలు సరోజినీదేవి రక్తములో పాదు కొన్నాయి.

సరోజినీదేవిని గొప్ప పండితురాలిని చేయవలెనని తండ్రి సంకల్పించి ఆంగ్ల భాషలో అక్షరాభ్యాసము చేశాడు. ఆయన ఆశయము ఫలించింది. కాని ఆమెకు వంగ భాషలో కంటె ఆంగ్ల భాషలోనే కవిత్వము సాగింది. ఆమె తన 12 వ ఏట మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణురాలయింది కాని 11 వ ఏటనే ఆమె హృదయములో కవితాబీజము నాటబడ్డది. బాల్యములో గణితములో ఒక సమస్య విడక చాలా బాధపడ్డది. ఎంతసేపు ఆలోచించినా ఆమెకు ఆ చిక్కు విడ లేదు – కాని ఒక చక్కని గీతము వ్రాయ గలిగింది. అదే ఆమె కవితకు ప్రారంభము. ఆనాడు ఉద్భవించిన ఆ సెలయేటి గానము మహాప్రవాహరూపమై పొంగి పొరలి విశ్వమంతటా ఆవరించి ప్రతిధ్వనించింది ఆమె తన 13 వ ఏట ఒక గీతాన్ని రచించింది. అదే మొదలు ఆమె కవయిత్రిగా బిరుదు పొందటానికి.

సరోజినీదేవిని తండ్రి విద్వాంసురాలినిగా చేయ తలపెట్టితే ఆమె కవయిత్రిగా ప్రఖ్యాతిగాంచింది. ఆమెది మొదటినుండీ దృఢమైన ఆరోగ్యముకాదు; అప్పుడప్పుడు మంచమెక్కించేది. ఆ కాలములో వైద్యులు ఆమెను ప్రక్కమీదనే ఉండి విశ్రాంతి తీసుకోమనేవారు. కాని సరోజిని కవితా హృదయము ఆ కాలములోనే గంతులు వేసేది. ఆ మందుసీసాల మధ్య మంచము మీద కూర్చుని, కలము నిలుపకుండా ఏకధాటిగా కవనము వ్రాయ నారంభించేది. ఒక పర్యాయము ఆ విధముగా వ్రాసినది, 2000 పంక్తులుగల ఉత్తమ నాటకమయినది.

1895 లో ఆమె కవితాశక్తికి అబ్బుర పడిన హైదరాబాదు నిజాము, విదేశాలలో ఆమె ఉన్నత విద్యాభ్యాసము చేయటానికి సాలుకు 4500 రూపాయల విద్యా వేతనాన్ని ఇచ్చాడు. వెంటనే ఉన్నత విద్యకై ఆమె ఇంగ్లండుకు పంపబడ్డది.

లండనులో కింగ్సు కళాశాలలోను, కేంబ్రిడ్జిలోని గిర్టన్ కళాశాలలోను ఆమె విద్యాభ్యాసము చేసింది అక్కడే ఆమె పద్యరచన అధికముగా చేసింది ఒక ప్రముఖ విమర్శకుడి పరిచయ భాగ్యము ఆమెకు అక్కడ ఉండగా లభించింది. 'ఆయన 'ఇక్కడ కవులమాదిరిగా పక్షులనూ కుంకీ శృమా వరించవద్దు. మీ దేశములోగల ఫల పుష్పభరితాలయిన మహావృక్షాలను వర్ణించి భారతదేశ వాతావరణములో కవిత్వము వ్రాసినట్లయితే ఉత్తమ కవయిత్రిగా ప్రసిద్ధి చెందగలవని జోస్యము చెప్పాడు. అది ఒక సలహాగనె కాక – ఆదేశమై ఆమె కవిత్వములో ఒక గొప్ప మార్పును కలిగించి అపారమైన ఖ్యాతిని చేకూర్చింది.

మామిడి చిగుళ్లకై వృతు వృతు మూ వలకే కోయిల ప్రాపంచికమయిన కట్టుబాట్ల కోర్వగ అధికారుల ఆజ్ఞలకు లోబడి విద్యార్జన చేయటమంటే సరోజినీదేవి హృదయాన్ని కట్టివేసినట్లయినది. దానికితోడు ఆమె ఆరోగ్యము సన్నగిల్ల నారంభించింది. వెంటనే ఆమె విద్యావ్యాసంగము చాలించి ఆరోగ్యానికై స్విడ్జర్ లాండ్ వెళ్లింది. ప్రకృతి సౌందర్యానికి పేరు మోసిన ఆదేశము ఆమెకు ఆరోగ్యాన్ని చేకూర్చటమే కాకుండా కవితాశక్తినికూడా ఇనుమడింప చేసింది 1898 లో ఆమె స్వదేశానికి తిరిగి వచ్చింది

ఆమె తన 16 వ ఏట నైజాము రాష్ట్రములో చీఫ్ మెడికల్ ఆఫీసరుగా ఉన్న మేజరు ముత్యాల గోవిందరాజులునాయుడు గారిని ప్రేమించింది. ఆయననే వివాహము చేసుకొన సంకల్పించింది. ఆమె విద్యార్జనకు విదేశాలకు వెళ్లివచ్చిన తరువాత వివాహము చేసుకోగలనని తండ్రితో చెప్పగా, ఆయన కీ. శే కందుకూరి వీరేశలింగంపంతులుగారిని సంప్రదించాడు. పంతులుగారు శుభస్య శీఘ్రమని మదరాసు నగరములోని బ్రహ్మమందిరములో వివాహము జరిపారు. ఆ కాలములో ఒక వంగదేశపు బ్రాహ్మణ కన్య ఒక ఆంధ్ర బ్రాహ్మణేతరుని వివాహమాడటము ప్రశంసార్హమయిన సాహస కార్యము. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలూ ఇద్దరు కుమారులూ కలిగారు. కుమారులలో జయసూర్య పెదవాడు. ఈయన హోమియోపతిలో ప్రసిద్ధిగాంచిన వైద్యుడు. సరోజినీదేవి ప్రథమ పుత్రిక పద్మజ. ఈమె హైదరాబాదు రాష్ట్ర సాంఘిక రాజకీయరంగాలలో ప్రముఖ స్థానముగల మహిళ. ద్వితీయ కుమార్తె లీలామణి ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయములో శిక్షణ పొందిన విద్యావతి కొంత కాలము హైదరాబాదులోని ఉస్మానియా మహిళా కళాశాలలోను నిజాము కళాశాలలోను ఆంగ్ల అధ్యాపకురాలుగా పనిచేసింది. ప్రస్తుతము కేంద్ర విదేశాంగ శాఖలో పని చేస్తున్నది

సరోజినీదేవి సంసారములో మునిగి పోయినా ఆమె కవితా హృదయము మరుగు పడలేదు. ప్రవక్త, వక్త, కవి ఈ ముగ్గురూ ప్రజాసేవకు పాటుపడేవారు. వీరు ముగ్గురూ ఒకరినిమించినవారొకరు. ఈ ముగ్గురి గుణాలు ఒకరిలో ప్రభవించినట్లయితే అది అత్యంత ప్రతిభావంతమయిన జీవిత మన్నమాట. ఈ మూడు ఉత్తమ గుణాలు సరోజినీదేవిలో ముద్దకట్టి మూర్తీభవించాయి. స్త్రీ పురుష జాతులలో పురుషలోకము గాంభీర్యశోభితము. నారీ లోకము లలితగుణ రంజితము. తర్క వ్యాకరణ గణితాది కఠిన విద్యలు పురుష ప్రకృతి కనుగుణమైనవి. కవిత్వ సంగీత నృత్యాది లలిత కళలు కోమల హృదయముగల స్త్రీలలో సహజ లావణ్యప్రభలతో రాణించేవి. భారత దేశములో ఆంగ్ల భాషలో మృదు మధురముగా కవిత్వము చెప్పగల స్త్రీలలో సరోజినీదేవి ఒకతెగా (వంగదేశీయులలో) పేరు గాంచింది.

1914 లో ఆమె రాయల్ సొసైటీ ఆఫ్ ది లిటరేచర్‌కు సభ్యురాలుగా ఎన్నుకో బడ్డది. ఆ కారణముచేత ప్రముఖ ఆంగ్ల కవులతో అధిక పరిచయము అబ్బినది. ఈ పరిచయ ఫలితముగా ఆమె కవితకు ప్రోత్సాహము కలిగింది. ఆమె రచనలు నాలుగు సంపుటాలుగా ప్రచురింప బడ్డాయి ప్రథమ సంపుటము సువర్ణ ప్రాంగణము (The Golden Threshoed) దీనిలో 1899 నుండి 1905 వరకూ ఆమె రచించినవి చేర్చబడ్డాయి. ఇది 1905 లో ప్రకటింపబడి పెక్కు ముద్రణలంది లోక ప్రఖ్యాతి గాంచినది రెండవ సంపుటము జీవన్మరణగీతాలు (The Poems of Lfe and Death) దీని నామము సార్థకమైనదని లోకమంతా భావించింది. మూడవ సంపుటి కాల విహంగము (The Bird of Time). ఇది 1912 లో ప్రకటింపబడ్డది. దీనిలో ఈమె కవిత పరిణతి చెందినదని విశ్వసింపబడ్డది. ఈమె రచనలన్నిటిలో ఇది సర్వోత్తమమైనది. దీనితో ఈమె కీర్తి ఇనుమడించింది. నాలుగవ సంపుటి భిన్న గరుత్తు (The Broken Wing) ఇది 1917 లో ప్రకటింప బడినది ఇది ఈమె రచనలలో కడపటిది. ఈమె కవిత వైషమ్యాలను పారద్రోలి విశ్వశాంతిని చేకూర్చగల మధుర ప్రవాహమని దేశదేశాలలో మారు మ్రోగింది. ఆమెకు ప్రాచ్యదేశపు కోకిల (The Nightingale of the East) అన్న బిరుదు లభించింది.

దీని తరువాత సరోజినీదేవి హృదయము రాజకీయాలమీద మ్రొగ్గింది. అయినప్పటికీ ఆమెలో కళాదృష్టి నశించలేదు. రాజకీయాలలోనే తన కళాదృష్టిని జొప్పించింది. దానిలోనే తన కళా హృదయాన్ని విస్తృతము చేసుకొన్నది. మన దేశములో అనేకమంది వక్తలు జన్మించారు, కాని సరోజినీదేవిలో ఒక వింతైన ప్రతిభా విశేషమున్నది. ఆమె తన అసమాన వక్తృత్వ నైపుణ్యముతో శ్రోతల నాకర్షించి ఆనంద

పఠిస్తూ వేలాది ఉపన్యాసాలిచ్చింది ఆమె ఉపన్యాసాలు ప్రజలలో దేశాభిమానాన్ని పురికొల్పేవి. ఆంగ్ల, హిందీ, ఉర్దూ, వంగభాషలలో అనర్గళంగా ఉపన్యసించింది. అవి వేలాదిజనులకు దేశ స్వాతంత్ర్యానికై ఆత్మార్పణ చేయటానికి కారణాలయినాయి

1911 లో రాజకీయాలను గురించి ప్రసంగిస్తూ ఉండగా ఆమె గురువైన గోఖలేగారు 'భావికాలములో నీవు కృషి చేయ సంకల్పించిన కార్యమేమి?' అని ప్రశ్నించగా 'ఐదేళ్ళలో హిందు మహమ్మదీయ మైత్రిని సాధిస్తా'నని సమాధానమిచ్చింది; ఆ విధముగా కృషి చేయగలిగింది. 1921 లో జరిగిన బొంబాయి మతకలహాలలో నిర్భయముగా, వీథులలో, చెలరేగిన ప్రజలలో తిరుగగలిగింది. 1922 లో మహాత్ముడు కారాగృహానికి వెళ్ళుతూ 'భారత దేశపు ఐక్యత'ను నీకు ఒప్పగించి వెళ్లుతున్నానని చెప్పారు. ఆయన ఆదేశాన్ని సరోజినీదేవి శిరసావహించి శక్తివంచనలేకుండా కృషి చేసింది.

1920 లో ఆమె ఆంగ్లదేశములో ఉండి బ్రిటిషువారు పంజాబుదేశములో చేసిన దురంతాలను తీవ్రముగా ఖండించింది. మాంటెగ్యూ మంత్రి వాటిని ప్రతిఘటించబోగా అమృతసర్ దురంతాలను గురించి కాంగ్రెసు ప్రకటించిన రిపోర్టును చదివి అతిడిని మారాడకుండా చేసింది. జెనీవాలో జరిగిన అంతర్జాతీయ మహాసభకు భారత మహిళాసభా ప్రతినిధిగా వెళ్ళి ఆ సమావేశములో ప్రముఖపాత్ర వహించి భారత నారీలోకానికి అంతరాతీయముగా అఖండ ఖ్యాతి నార్జించింది 1931 లో ఆమె చెరసాలలో ఉండగా లండనులో జరుగబోవు రౌండు టేబుల్ సమావేశానికి భారత మహిళల ప్రతినిధిగా ప్రభుత్వ మామెను చెరసాలనుండి విడిపించి పంపింది ఆమె రాజకీయాలలో తిరుగుతున్నప్పటికీ తోటి స్త్రీలను, వారి సమస్యలనూ మరువలేదు. మహిళోద్యమము వ్యాప్తి చెందేటట్లు తన ఉపన్యాసాలద్వారా ప్రజలలో చైతన్యాన్ని కలిగించింది భారత మహిళలకు భారతీయ సంస్కృతినీ ఆదర్శాలనూ తన ఉపన్యాసాలద్వారా వినిపిస్తూ ఉండేది. 1911 లో స్త్రీల ఓటింగు హక్కుకొరకు అధికముగా ఆందోళన చేసింది కాని ఆమె ఎన్నడూ స్త్రీలకు ప్రత్యేక సదుపాయాలు కావాలని కోరలేదు. స్త్రీలు స్వయంగా శక్తిని సంపాదించుకోవాలని ఉద్ఘోషించింది. భారత స్వాతంత్ర్య సంగ్రామములో పురుషులతో పాటు స్త్రీలు కూడా పాల్గొన్నందువల్ల సర్వహక్కులూ పొందగలరని ఆమె నారీలోకాన్ని సదా హెచ్చరించేది.

సరోజినీదేవి బాల్యమునుండి కాంగ్రెసుతో సంబంధముగల నాయకురాలు 1905 ప్రాంతములో నే కాంగ్రెసు సమావేశములో మహోపన్యాసము కావించి అందరినీ ఆకర్షించిన మహావక్త. అదే ప్రారంభము ఆమె కాంగ్రెసులో చేరి కృషి చేయటానికి కాంగ్రెసు పక్షాన అచంచలమైన విశ్వాసముతో ఉండటమే కాక దానిలో చీలికలు రాకుండా ఉండటానికి అత్యంత కృషి చేసింది. 1923 లో కాకినాడ కాంగ్రెసులో కెన్యాకు భారత కాంగ్రెసు ప్రతినిధిగా పంపబడ్డది. 1924 బెల్గాం కాంగ్రెసులో విదేశాలలోని భారతీయులకు ఆమె చేసిన సేవకు ప్రశంసపొందింది. కాన్పూరులో జరిగిన కాంగ్రెసుకు ఆమె అధ్యక్షురాలిగా ఎన్నుకోబడ్డది. ఆమె అనంతరము గాని, ముందుగాని భారత నారీమణులు ఆ విధమైన గౌరవము పొంది ఎరుగరు. కాంగ్రెసులో అంతర్జాతీయ శాఖకు ఆమె అధ్యక్షురాలు.

కాంగ్రెసులో ఆమె ఏగ్రూపునకూ చెందినది కాదు. మహాత్ముని మార్గమునందే అచంచల విశ్వాసముతో నడచేది. కాంగ్రెసులో వాదబలము వల్ల చీలిపోయిన ఇరుపక్షాల ఐక్యతకూ కృషి చేసేది. కాంగ్రెసు కార్యవర్గములో ఆమె యించుమించు 25 సంవత్సరాలపాటు పని చేసి, కాంగ్రెసు వ్యవహారాలలో ప్రధానపాత్ర వహించి, అగ్రనాయకులందరి అభిమానానికీ పాత్రురాలయింది. కాంగ్రెసులో వివిధభాషలలో సంభాషించగల నేర్పుగలదని పేరుగన్నది.

గాంధీజీకి సన్నిహితులైన వారిలో సరోజినీదేవి ఒకతె ఆయనకు విశ్వాసపాత్రురాలైన అనుచారిణి ఆయనచే ఆరంభింపబడిన సత్యాగ్రహ సమరములోను, ఆఫ్రికా సమస్యలోను ఆయనకు కుడి భుజముగా పనిచేసి ఆయన ప్రశంసలను అందుకొన్న ప్రసిద్ధురాలు. ఆయన పూనిన ప్రతి కార్యక్రమములోను త్రికరణ శుద్ధిగా పని చేసిన కార్యదీక్షాపరురాలు. మహాత్ముని కేవలము రాజకీయ నాయకునిగా కాక గురువుగా, కన్నతండ్రిగా భావించి భక్తిప్రేమలతో పూజించిన భక్తురాలు.

1947 ఆగస్టు 15 వ తేదీన భారతదేశము స్వాతంత్ర్యాన్ని పొందింది. స్వతంత్ర భారతములో ప్రప్రథమ గవర్నరుగా సరోజినీ దేవి నియమింపబడినది. వివిధ సమస్యల నెదుర్కొంటున్న ఒక పెద్దరాష్ట్రానికి గవర్నరయిన సరోజినీదేవి విశేషమయిన శక్తిసామర్థ్యాలతో పనిచేసింది కనుక నే రాజ్యాంగ పరిషదధ్యక్షులు రాజేంద్రప్రసాదు "సరోజినీదేవికి గవర్నరు పదవిని సమర్పించటములో ప్రభుత్వము ఆమె హోదాను హెచ్చించలేదు గవర్నరుపదవిని స్వీకరించటానికి ఆమె ఆమోదించటముద్వారా ఆ పదవికే హోదా హెచ్చింది" అన్నారు.

సరోజినీదేవి గుణగణాలనూ ప్రతిభా విశేషాన్నీ నిరూపించ బూనటము అసాధ్యమయిన పని. సర్వతోముఖ ప్రతిభకలిగిన భారతమహిళ. అద్వితీయమైన సామర్థ్యమూ అరుదైన తెలివితేటలూగల విదుషీమణి. అపరిమితమైన ఉల్లాసమూ, ఉత్సాహమూ కలది. సంభాషణా చాతుర్యము, గొప్ప ధారణ, విశేషమైన జ్ఞాపకశక్తి కలది. సర్వతోముఖ సంపూర్ణమయిన సమ్యక్ జీవనంగలది సరోజినీదేవి. 1949 మార్చి నెలలో ఆత్మబంధువులు ఎవరూ దగ్గరలేని సమయాన అనాయాసంగా ఈ లోకాన్ని వీడిపోయింది ఆనాడు భారతాకాశ పథమునుండి ఒక మహోజ్వల తార పతనమైనటుగా లోకమంతా భావించింది. 'భారత స్వాతంత్ర్య సమరములో పోరాడిన వీరాంగన, రాజకీయాలతో సంస్కృతిని మేళవించిన నిరుపమాన విశాల దృక్పథముతో వాటికి విన్నాణము చేకూర్చిన జ్ఞాననిధి- మహాకవయిత్రి మాతృస్వరూపిణి అస్తమించిన'దని భారతీయులు శోకించారు

ఆ సర్వప్రియనూ, ఆ చలటి తల్లినీ ఆగస్టు 15 వ తేదీన సంస్మరించుకోవటము మనవిధి.

★

బాలసాహితి

బుద్ధి బలం

ఉత్పల సత్యనారాయణాచార్య

కాంచీ పురమందు మునుపు
మంచి వైశ్యు డొకడుండెను
బేహారుల వర్గమందు
పేరెన్నిక గన్నవాడు

గొప్ప తెలివి తేటలున్న
కోమటింటి పిల్లనిచ్చి
తన సుతునకు పెండ్లి చేయ
తలచి యతడు వెదకబంపె

పిల్లకోస మతని భటులు
పేట పేట తిరుగుచుండ
విపణివీధి నొక్క వింత
వీక్షించుచు నిలిచినారు

బేరకాడు ఒక డెవడో
బియ్యపు మూటొకటి తెచ్చి
బియ్యానికి సరితైలము
బేహారుల నడుగుచుండె

ఎవ్వ రతనిమాట వినక
హేళనగా నవ్వుచుండ
పిచ్చివాడ! నీ కెవ్వరు
ఇచ్చువార లీ లాగున

ఏడుసేర్ల బియ్యానికి
ఇత్తు మొక్క సేరు నూనె
వలయునేని కొమ్మటంచు
పలికినారు కొంద అచట

ఆ మాటలు వినకుండగ
ఆ మాఱుపు బేరకాడు
ఎన్నెన్నో అంగడులను
ఎక్కుచుండె దిగుచుండెను

అచట నొక్క మిద్దెమీద
అంతయు పరికించి యొక్క
గుణవరేణ్య వైశ్యకన్య
అనుపమాన లావణ్య

బియ్యానికి పెన్నుద్దిగ
ఇయ్యగలను నూనియను
వలయునేని రమ్మటంచు
పిలిచె నతని తనయింటికి

ఆత డెంతో సంబరమున
అరుగుదేర మూటదింపి
మంచి బియ్యమగుట చూచి
మరల వాని కిట్లుచెప్పె

ఓయీ! నీ వడిగినట్లు
ఈయగలను నూనియను
తరువాతను జగడమాడ
తగువారము కాము మేము

అని చెప్పి యా కన్నియ
అందియలు రవళింపగ
లోని కేగి పళ్ళెమొకటి
ఆనయిచ్చె కొలిపింపగ

పళ్ళెరమున బియ్యమ్మును
బాగుగ కొలిపించు కొనియు
హద్దుపెట్టి దానియందె
ఆ కన్నియ నూనెపోసె

తండులముల నామెకిచ్చి
తైల మతడు గొనిపోయెను
పిల్లకొఱకు వెదకు భటులు
బేహరి కిది ఎఱిగించిరి

కోమటి దొర ఆమెను తన
కోడలిగా చేసికొనెను
బుద్ధియొకరి సొత్తుకాదు
బోధించిన అదిరాదు!



జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సెల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగుకనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ళవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సెల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతరామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు. తిరిగీ తమ కన్నపావాలు రాలేదని అంతా మథన పడుతూంటే వారికి హఠాత్తుగా జలాంతరామి అధికారి హెచ్చరిక వినిపిస్తుంది. కెప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరూ బయటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతరామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. కెప్టన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు. పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరచుకున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి ఆ తరవాత జలాంతర్గామి సాగరగర్భంలోని క్రెస్పో ద్వీపానికి బయలుదేరుతుంది. తరవాత సాగరగర్భంలో క్రెస్పోద్వీపంలో వేట జరుగుతుంది. జలాంతర్గామి వానికొరో ద్వీపంమీదుగావెళ్లి గిల్బోవాద్వీపానికి సమీపంలో నిలబడుతుంది. అరోనా అనుచరులతో కలిసి ఆ ద్వీపంలో ప్రవేశిస్తాడు.

19 గిల్బోవా ద్వీపం

ఆ మరునాటి ఉదయం అంతపెద్ద విశేషాలేవీ జరగలేదు. మేమంతా మళ్ళీ గిల్బోవా ద్వీపానికి బయలుదేరి వెళ్లాలని నిశ్చయించుకొన్నాము. నెడ్ లాండ్ ఈమారు ఆ ద్వీపంలో మరి ఒక భాగానికి వెళ్లి వేటాడాలని ఉవ్విళ్లూరాడు.

****

అనువాదం: "వినాయక"

****

అప్పుడే సూర్యోదయం అయింది, మా నావ కొన్ని నిమిషాలలోనే గిల్బోవా ద్వీపం చేరుకుంది.

మేమంతా నెడ్‌లాండ్ వెంట పడడమే చాలా మంచిదని నిశ్చయించుకొన్నాము. ఈ సారి ఆ ద్వీపానికి పశ్చిమంగా

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

ప్రయాణం సాగించాము. తరవాత మాకొక పెద్ద పచ్చిక మైదానం తగిలింది. మొత్తంమీద ఆ ద్వీపంలో ఆటవికు లెవరు కనపడకపోయినా మానవు లాద్వీపంలో అడుగుపెట్టి ఉంటారనడానికి కొన్ని కొన్ని తార్కాణాలు కనిపించాయి. అక్కడ లకుముకిపిట్టలు మమ్మల్ని చూచీ చూడడంతోనే తటాలున ఎగిరి పారిపోయాయి. అవి ఇంతకు పూర్వం మనుషుల్ని చూచి ఉండక పోతే అలాగ ఎందుకు పారిపోతాయి?

అంతలో కొన్ని పక్షు లెగిరిన చప్పుడయింది. అందరం ఆవైపు చూచాము.

"అవన్నీ సామాన్యమైన పక్షులే!" అన్నాడు కౌన్సెల్.

"అయితే వాటిలో కొన్నింటిని తినవచ్చునన్నమాట!" అన్నాడు నెడ్ లాండ్.

"అబ్బెబ్బే! అవన్నీ చిలకలే నయ్యా! అదిగో చూడు!" అన్నాడు కౌన్సెల్.

"ఇంక తినడానికేమీ లేకపోతే చిలకంత మంచి వస్తువేదీ లేదు!" అన్నాడు నెడ్ లాండ్ ఎంతో దురుసుగా.

"జాగ్రత్తగా వంట చేస్తే ఇవ్వైనా బాగానే ఉంటాయి!" అన్నాను.

ఆ తరవాత మళ్ళీ మేమంతా మరికొంతదూరం నడిచిపోయాము.

అంతలో ఒక అత్యద్భుతమైన పక్షి ఆకాశంవైపు ఎగిరింది. దాని అందము, హుందాతనము చూచి నేనెంతో ఆశ్చర్యపోయాను. అంతలో నాకా పక్షి పేరు జ్ఞాపకం వచ్చింది.

"అది స్వర్గవిహంగం" అన్నాను.

నెడ్ లాండ్ కౌన్సెలు, దానిని చూడగానే అది అపురూపమైన పక్షిజాతికి చెందినదై ఉండవచ్చునని అన్నారు.

"నెడ్ లాండ్! నీ వెల్లాగైనా నీ శక్తి అంతా ఉపయోగించి ఆ పక్షిని పట్టుకోగలవా!" అన్నాను.

"నాకు పిట్టల్ని పట్టుకోవడం అంతగా అలవాటు లేదు గాని అయినా ప్రయత్నిస్తాను." అన్నాడు నెడ్.

మలయాద్వీప వాసు లాపక్షులతో పెద్ద వ్యాపారం సాగిస్తూంటారు. ఆ ద్వీపవాసు లాపక్షులను పట్టుకొని చైనా దేశీయుల కమ్మివేస్తూంటారు. వాటిని పట్టుకోవడంకోసం అనేకమైన దారుణాలు చేస్తూంటారు. ఒక్కొక్కప్పుడవి తాగే నీటిలో విషం కలుపుతూంటారు.

వాటిమీదికి మే మనేకసారులు తుపాకులు పేల్చాము. ప్రయోజన మేమీ కలగలేదు. మాదగ్గర ఉన్న మందుగుండు సామానంతా ఖర్చయిపోయింది.

11 గంటలయ్యేసరికి మేమంతా ఆ ద్వీపంలో ఉన్న పెద్దపెద్ద పర్వత పంక్తులు దాటిపోయాము. అయినా మాకే జంతువు కనబడలేదు. అప్పటికే మేమంతా బాగా అలిసిపోయాము ఆకలి మాడ్చివేస్తూంది.

అయితే కౌన్సెలు అదృష్టం కొంతవరకు పండినదని చెప్పవచ్చును. అతని కొకటి రెండు పావురాలు దొరికాయి. వెంటనే అవి మా కందరికీ మాంస ఫలహారాని కుపయోగించాయి.

తరవాత నేనడిగాను: "నెడ్ లాండ్! నీకింకా ఏం కావాలి?"

"ఈ పావురాయి మాంసం తింటే నాకు కడుపేం నిండుతుంది? శుభ్రమైన జంతువేదైనా దొరకాలి. చల్లగా నా కడుపునిండాలి. అంతేగాని ఈ పావురాయి మాంసం నా పంటికొనకైనా రాలేదు." అన్నాడు నెడ్ లాండ్.

"ఆ స్వర్గవిహంగం దొరికేదాకా నాకూ నిద్రపట్టడం లేదు." అన్నాను.

"అయితే పదండి పోదాం!" అన్నాడు కౌన్సెల్.

తరవాత కొంతదూరం నడిచి మేమంతా దట్టంగా అలుముకుపోయిన చెట్లదగ్గిరికి జేరుకున్నాము. అవన్నీ సగ్గుచెట్లు. మా అడుగుల సవ్వడి విని కొన్ని పసిరికి పాములా చెట్లమీద పరుగులుపెట్టడం మొదలుపెట్టాయి. వెంటనే నేలమీద వాలిన కొన్ని స్వర్గ విహంగాలుకూడా మెల్లిమెల్లిగా ఎగరడం మొదలుపెట్టాయి.

అంతలో కౌన్సెల్ ఎంతో ఉత్సాహంగా ఒక పెద్ద కేక వేశాడు. అతడంతకు పూర్వమే మెల్లిగా పొంచి నిలబడి ఒక స్వర్గవిహంగాన్ని చేజిక్కించుకొన్నాడు.

"అరే! అత్యద్భుతంగా పట్టుకొన్నావే!" అన్నాను.

"అదంతా మీదయ!" అన్నాడు కౌన్సెల్.

"అసలు ఈ పక్షుల్ని పట్టుకోవడమే చాలా కష్టం. అందులోను, వాటిని చేత్తోకూడా పట్టుకొన్నావు.

నీ చాకచక్యం అత్యద్భుతం!" అన్నాడు నెడ్‌లాండ్.

"మీరుకొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే ఇందులో నా గొప్ప ఏమీ లేదని తెలిపోతుంది." అన్నాడు కాన్సెల్.

"ఎందుచేత?"

"ఇది బాగా మత్తెక్కి పడిఉంది.

"మత్తెక్కి పడిఉందా? ఎందుచేత?"

"ఇక్కడ ఒక జాజిచెట్టు ఉంది. అది ఆ చెట్టుకింద రాలిన జాజికాయరసం పీల్చి బాగా మత్తెక్కిపడి ఉంది. తప్ప తాగడంవల్ల ఎలాంటి దుష్ఫలితాలు కలుగుతాయో గమనించారా?"

"నేనీ రెండునెలలు చవకబారు మద్యం సేవించాను. దానికే నీవింత బాధపడాలా?" అన్నాడు నెడ్‌లాండ్ చిన్న చిరునవ్వు చిందిస్తూ.

నేను జాగ్రత్తగా ఆ పక్షి కేసి చూచాను.

పాపువాద్వీపప్రాంతంలో చాల చిత్రచిత్రమైన పక్షులు కనిపిస్తూంటాయి. అక్కడ కనిపించే అతి ముఖ్యమైన జాతులలో ఈ స్వర్గవిహంగం చాల ముఖ్యమైనది.

దాని పొడవించుమించుగా తొమ్మిదిఅంగుళాలు. రెక్కలరంగులతి విచిత్రంగా కళ్ళకు మిరుమిట్లు గొలుపుతున్నాయి. ముక్కు పసుపు పచ్చగాఉంది. కంఠం దగ్గిర పచ్చలు పొదిగినట్లుంది. ఆపక్షి పారిస్‌మ్యూజియంలో కూడా లేదు. అందుచేత నేను జాగ్రత్తగా తీసుకుపోయి దానిని పారిస్ మ్యూజియం అధికారులకు బహుమతిగా ఇవ్వాలనుకున్నాను.

"అయితే ఇది చాలా అపురూపమైనపక్షే అన్నమాట!" అన్నాడు నెడ్‌లాండ్.

"ఈజాతిలో చచ్చిపోయిన పక్షులు కూడా దొరకడం చాలా కష్టం. అందులోను ఇది బతికి ఉండగా దొరికింది. తెలిసిందా?" అన్నాను.

నేనలాంటి అపురూపమైన పక్షి దొరికిందని ఉప్పొంగిపోయాను. కాని నెడ్‌లాండ్‌కు దానిమూలాన ఏమీ సంతోషం కలగలేదు.

అలాగ తిరగ్గా తిరగ్గా కొంతసేపటికి రెండుగంటలయింది. అప్పటికి నెడ్‌లాండ్ కొక జంతువు లభించింది. నెడ్‌లాండ్ తుపాకీ గుండు తగిలీ తగలడంతోనే అది విలవిలా తన్నుకుంటూ నేలమీద పడిపోయింది.

నెడ్‌లాండ్ ఆ జంతువు మాంసంతో మాకందరికీ చక్కని మాంసపు విందు ఏర్పాటుచేశాడు.

పిమ్మట నా స్నేహితులిద్దరు కొన్ని పొదలదగ్గిరికి వెళ్ళి గట్టిగా చప్పుడుచేశారు. ఆ చప్పుడు వినగానే పొదలమాటున దాక్కున్న కాంగరూ మృగాలు గబగబా పరుగెత్తుకుపోవడం ప్రారంభించాయి.

వెంటనే నెడ్‌లాండ్ చేతిలో ఉన్న తుపాకీ ధామ్మని పేలింది. రెండుమూడు కాంగరూలా తుపాకీ దెబ్బలకు నేలమీద పడిపోయాయి.

నెడ్‌లాండ్ ఆనాటి వేటతో ఉబ్బి తబ్బిబ్బైపోయాడు. తన ఒక్కడికే ఆ మాంసం సంపాదించే అదృష్టం పట్టిందనీ నాటిలస్ జలాంతర్గామిలో ఉన్న వాళ్లెవరికీ అలాంటి అదృష్టం పట్టలేదనీ వాళ్ళంతా కట్టి చచ్చు నాగమ్మలనీ అన్నాడు.

అతడు వేటాడిన కాంగరూలు చాలా చిన్నవి. అయితే వాటి మాంసంమాత్రం తినడానికి చాలా బాగుంది.

మేమంతా ఆవేళ చాలా ఉత్సాహంగా ఉన్నాము.

ఆమర్నాడుకూడా ఆద్వీపంలో వేటాడితే చాలా బాగుంటుందనీ తప్పకుండా ఆ మర్నాడుకూడా అక్కడికి వెళ్ళాలనీ నెడ్‌లాండ్ పట్టుపట్టాడు.

సాయంత్రం 6 గంటలయ్యే సరికి మేమంతా సముద్రతీరానికి తిరిగి వచ్చేశాము. మానావ మాకోసం సిద్ధంగాఉంది. రెండు మైళ్ల దూరంలో నాటిలస్ మాకోసం ప్రతీక్షిస్తున్నది. నెడ్‌లాండ్ మళ్లీ వంట మొదలు పెట్టాడు. మాంసంముక్కల వాసన నాలుగువైపులా గుప్పుమంది. మా భోజనం అంతా మహా మజాగా ఉంది. పైగా మాకు జాజికాయల సారాకూడా దొరికింది. విందుభోజనానికిక లోటేమిటి? క్రమక్రమంగా నెడ్‌లాండ్, కాన్సెలు లిద్దరు కొంతవరకు జాజికాయ సారా మైకంలో పడ్డారని కూడా అనిపించింది.

"మన మీ సాయంత్రం మళ్ళీ నాటిలస్ జలాంతర్గామికి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోతే?" అన్నాడు కాన్సెల్ ఆమైకంలో మునిగిపోతూ.

"మనం అసలు నాటిలస్ జలాంతర్గామికి తిరిగి వెళ్ళడమే మానేసి ఇక్కడే ఉండిపోతే!" అన్నాడు నెడ్‌లాండ్.

అంతలో ఒక పెద్దరాయి ఎగిరి వచ్చి మా మోకాళ్ళకు దగ్గిరిగా పడింది. —ఇంకా వుంది.

వెఱ్ఱి గొల్లడు

రింగంపల్లి అప్పారావు

1

పూర్వం చాటపర్రు గ్రామంలో చంగయ్యా అనే వెఱ్ఱిబాగుల గొల్లవా డుండేవాడు. అతగాడు మహాపొట్టి. కాని పాపం, పెద్దల ప్రోద్బలం వల్లనో, తల్లిదండ్రుల బలవంతం వల్లనో తాటి చెట్టంత పెళ్లాన్ని చేసుకున్నాడు.

చంగయ్య పెళ్లాం గంగమ్మకు అతనంటే మహా చులకన. దానికి తోడు చంగయ్యది వట్టి మట్టిబుర్ర. రోజూ గంగమ్మ నిర్భయంగా చంగయ్యను దుమ్మెత్తి పోసేది. చిన్నతప్పు చేస్తే చాలు చీపురు కట్ట నాజూగ్గా తిరగవేసేది! భార్య గయ్యాళితనానికి, వుద్దండ,దోర్దండ మహోద్దండంగా, చంగయ్యకు కోపం వచ్చేది కాని, పేదవాని కోపం పెదవికి చేటన్న సామెతలాగ, పాము కరిస్తే పేనల్లే తనని కానట్టే దులుపుకొని పోయేవాడు. ఒకవేళ అన్నిటికీ తెగించి, కసితీరా నాలుగు బాద్దామన్నా మరీ తాటిచెట్టులా వుందే! అని వాపోయేవాడు.

చంగయ్యకు తండ్రి సంపాదించిన ఆస్తి అంటూ చిల్లిగవ్వ లేదు. గంగమ్మతో పాటు, ఒక చిన్న గొఱ్ఱెలమందను గూడ అత్తగారు తోలిపెట్టారు. దానిమీదే వాళ్ళ కాలక్షేపం.

ఒకనాడు ఇంటిలోని కేమీ లేక గంగమ్మకు చెప్పకుండా చంగయ్య ఒక గొఱ్ఱెపిల్లను అమ్మేశాడు. దానితో ఇద్దరికీ పేచీపడింది. ఎన్ని మాటలనాలో అన్నీ గంగా ప్రవాహంలా వదిలింది గంగమ్మ. ఇంకొకప్పుడైతే చంగయ్య, అంగలార్చుకుంటూ, ఆ తిట్ల ప్రవాహంలో కొట్టుకు పోయేవాడేమో కాని, ఆ నాడు యిక సహించలేక పోయింది చంగయ్య ప్రాణం! కోపం ముంచుకొచ్చింది.

అంతెత్తు ఒంటి కాలిమీద లేచాడు: "ఇది మా అత్తగారిచ్చిన మంద! ఓసి పిరికిపందా! నాఇష్టమే! అమ్ముకుంటాను ... ఏమైనా చేసేస్తాను. మాటలు మిగిలావంటే, మక్కెలిరగ బాదుస్తాను...ఏమనుకున్నావో! పూరుకుంటుంటే నెత్తికెక్కుతున్నావే!" అనేశాడు మూడడుగులు ముందుకు వేసి ఆరడుగులు వెనక్కు వేస్తూ.

చంగయ్య అలా అనగానే, గంగమ్మ విరగబడి, పగలబడి, పర్వతం దద్దరిల్లేలా నవ్వింది. ఇంకా నవ్వింది. అంతు లేకుండ నవ్వింది. చంగయ్య గుండె బేజారెత్తింది.

ఆఖరికి సంబాళించుకొని "ఓ యబ్బో! ఏం మొనగాడండీ! మక్కెలిరగ బాదుస్తావూ...ఎన్నాళ్ళకి నీ నోటివెంట యింత చక్కటి మాట విన్నాను! సరే పోసుకోలు కబుర్లకేం లే! ఇదిగో ఇప్పుడే చెబుతున్నా! నా యిష్టం లేందే నువ్వేమీ చేయడానికి వీలే లేదు. తెలుసా! యీ మంద మా అమ్మగారిది. నా ఇష్టం!" అన్నది గంభీరంగా.

చంగయ్య చప్పగా, చల్లబడి నీరసించిపోయాడు! "ఛీ! వెధవ సంసారం! ఇక యీదడం నావల్ల కాదు! చస్తే ఏగోడవా వుండదు!" అన్నాడు.

"చస్తే కన్నీళ్లు కార్చేవారు లేర్లే! అంత తిరికెక్కడిదీ! ఝుడిపిస్తున్నావే! పిచ్చిమగడా! చచ్చినట్టు మందను తోలుకు వెళ్లి మేపుకురా!" అని హేళన చేసింది.

చంగయ్యకు వుడుకుమోత్తనం వచ్చింది. పౌరుషం పదిరెట్లు పెరిగింది. కోపం కట్టలు తెంచుకు ప్రవహించింది.

ఇక ఏమీ మాట్లాడకుండా మందను తోలుకొని వెళ్లిపోయాడు. మధ్యాహ్నం భోజనానికి యింటికి రాలేదు. సాయంత్రానికల్లా, మందను ఒక చెట్టుక్రిందికి తోలుకు వచ్చాడు చెట్టునిండా, ఆకులు దట్టంగా వుండడం చంగయ్య కంటబడింది. ఆకులు కోద్దామని పంగల కర్ర పైకెత్తాడు. కాని ఆకులు అందలేదు. ఇలా కాదని చెట్టెక్కడమే మంచిదనుకున్నాడు. కత్తి పుచ్చుకొని...ఎన్నడూ చెట్టెక్కకపోయినా...అతి ప్రయాన మీద

మరీ ఎక్కాడు. ఒక మంచి కొమ్మ చూసి, తీరుబడిగా కొమ్మచివర కూర్చొని, మొదలు నరకడం ప్రారంభించాడు.

ఇంతలో ఆ దారినే పోతున్న ఒక సన్యాసిగారికీదృశ్యం కంటబడింది. ఆయనగారు గాభరా పడుతూవచ్చి "ఒరేయ్! పెద్దమ్మా! వఠ్ఠి దద్దమ్మలావున్నావు! ఆ కొమ్మ విరుగుతుంది! నీవు కింద తప్పకుండా పడతావు! అప్పుడేమవుతావు! చాల్లే దిగు దిగు!" అన్నాడు.

ఆయనగారు అనడమేమిటీ... చెట్టుకొమ్మతో సహా చంగయ్య నేల కొరగడమేమిటీ...ఒక్కసారే జరిగిపోయాయి! పెద్ద పుచ్చకాయలా పడ్డ పొట్టి చంగయ్య, అమాంతంగా లేచి, వంటిమట్టి దులుపుకోకుండా వచ్చి, సన్యాసి గారి, రెండు కాళ్లూ, కొండచిలువలా వాటేసుకొని,

"మీరు మహానుభావులు... దేవుళ్ళు! నాకు పెళ్ళాంమీద, సంసారంమీద విరక్తి పుట్టేసింది! బ్రతుకను! చచ్చిపోతాను. ఉపాయం చెప్పండి!" అన్నాడు.

సన్యాసి గుండె తారెత్తింది! "వున్న సంగతి చెప్పారు! మీరు మహా మేధావంతులు! మీరు మా యింటికివచ్చి, ఓ పదిరోజుల పాటు, ఆతిథ్యం స్వీకరించండి!" అంటాడేమో ననుకున్నాడు. కాని తీరా చావుకే ఉపాయం అడుగుతున్నాడే!

"నేనూ నీలాంటి కండగల, మనిషి నేనయ్యా! చావడానికి ఉపాయం నేనేం చెప్పను! కదువు... నన్ను పోనియ్యి!" అన్నాడు నిరాశ చేసుకొని!



అలా కాదు! మీరు ఉపాయం చెప్పగలరు. మీకు అన్నీ తెలుసు! కాకుంటే పడతావూ అనగానే, ఎందుకు పడతాను! కాబట్టి చస్తావూ...అనండి చచ్చిపోతాను!" అన్నాడు చంగయ్య.

"ఇది మరీ బావుంది! ఏమిటీ మూర్ఖుడు! చేతిలో కత్తికూడావుంది! ఝుడిపించి చస్తావూ! అన్నమాట నాచేత అనిపించినా వీ డెలాగూ చావడు! ఏది దారి! ఇక్కడ మనుష్యుల అలికిడీ లేదు. వీడి చావు కన్నా ముందు నా చావే వచ్చేటట్టుంది!" అనుకున్నాడు సన్యాసి.

తప్పించుకోవాలని ఆలోచిస్తున్నా వటయ్యా! నీవు చెప్పకతప్పదు. చెప్పందే కదలడానికివీల్లేదు. దేవుడివైనా సరే! తర్వాత నీ యిష్టం!"

ఎలాగైనా వీడి పీడ వదలించుకుందామని, ముఖం చాటంత

పెడల్పుపెట్టి, భగవంతుడిలా ముఖం పెట్టి, "వత్సా! లెమ్ము! నీ ప్రార్థన ఆలకించాను. అనుగ్రహం కలిగింది! ఇదిగో విను! నీ ముక్కు మీది చమట బిందువు నీ బొడ్డుపై బడ్డ వెనువెంటనే నీవు మరణించెదవు గాక!" అన్నాడు. అసలు ముక్కు మీద చెమట బొడ్డుమీద పడదు గాబట్టి, ఒకవేళ ఎక్కడైనా దారి కాని తనని పట్టుకోడానికి వీలులేదని సంతోషించాడు తన తెలివికి!

"బాగానే వుంది నీ తెలివి! నాకసలు చెమట పట్టదన్న సంగతి నీకు తెలియదటయ్యా! ముక్కు మీదనుంచి చెమటబొట్టు బొడ్డు మీద యింకెలా పడుతుంది!" అన్నాడు చంగయ్య తెలివితేటలు వుపయోగించి.

సన్యాసి కాస్త యిరకాటంలో పడ్డాడు. మళ్లా యోచించి, తెప్పరిల్లుకొని, "నాయనా! దానికి ఉపాయం వుంది. ఇంటికి వెళ్ళి నాలిక చురచుర కాలేటట్టు గంజికాయించుకొని తాగు! వెంటనే చమట పడుతుంది" అంటూ సన్యాసి మరక్కడ నిలబడకుండా, వెనక్కు తిరిగిచూడకుండా, హుటాహుటిగా సాగిపోయాడు.

చంగయ్య బ్రహ్మానంద భరితుడై "ఫో! యిక ఎలాగూ నేను చచ్చిపోతాను! పెళ్ళాం రాక్షసి బాధ విరగడౌతుంది!" అనుకొని మందను తోలుకొని యింటికి చేరుకున్నాడు.

"చంగయ్య రాజాగారు చచ్చిపోకుండా వస్తున్నారే! ఏం చావ బుద్ధి పుట్టలేదా! భయమేసింది కాబోలు!" అన్నది గంగమ్మ చంగయ్యను చూసి.

"అట్టే మాట్లాడకు! నే నీరోజు చచ్చిపోవడం ఖాయం! వుడుకుడుగ్గా గంజి కాచివుంచు! ఇప్పుడే వచ్చేస్తాను" అంటూ చంగయ్య శ్మశానం వైపు బయలు దేరాడు. అక్కడకు వెళ్లి ఒకచోట కుత్తుకవరకూ గోయి తవ్వుకొని తిరిగి యింటికి ప్రయాణమయాడు. "ఇంటివద్ద చస్తే నానా గొడవ...ఖర్చు అవుతాయ్! ఆ చచ్చేదేదో వల్లకాట్లో చస్తే బాగుంటుంది!" అనుకున్నాడు చంగయ్య.

నాలుక కాలుతున్నా, పొగలు చిమ్మే గంజిని, గుటగుట తాగేసి, చనిపోయేముందు.....ఎలాగైనా అర్థాంగికదా...గంగమ్మకు ఒక్క సందేశమైనా యివ్వకుండా, చంగయ్య శ్మశానంవైపు పరుగు తీశాడు.

వేడిగంజి తాగటంవల్ల, పరుగు లంకించుకోవడంవల్ల అతనికి వళ్ళంతా చమట పట్టేసింది. అది చూసి ముక్కుమీద చెమట బొడ్డు మీద ఎక్కడ పడుతుందో, దార్లోనే 'హరీ' మంటానేమోనని, యింకా జోరుగా పరుగిడుతూ వచ్చి, అమాంతం, తను తవ్వుకున్న గోతిలో కురికి, చేతుల్తో మట్టంతా గోతిలోనికి తోసుకొని, కూర్చున్నాడు.

కుత్తుకవరకూ మట్టికప్పుకొని కూర్చుంటే, చెమట బొడ్డుమీద ఎలా పడుతుందనే జ్ఞానం లేకపోయిందా మహానుభావుడికి!

మసక చీకటి వ్యాపించింది! క్రమంగా చీకటి దట్టంగా అలుముకుంది! పత్తికాయల్లాంటి మిడిగుడ్లు తిప్పుతూ చావుకోసం ఎదురుచూస్తున్నాడు.


"ముక్కుమీద చమటబొట్టు బొడ్డుమీద యీపాటికి పడే వుంటుంది. ఇంకా నన్ను తీసుకెళ్ళడానికి యములోళ్ళు రాలేదేం చెప్మా!" అనుకున్నాడు.

అర్థరాత్రయింది! పాపం చంగయ్య కునికిపాట్లు పడుతున్నాడు. ఇంటికి వెళ్లి పడుకుంటే బాగుండు ననిపించింది. కాని వెనువెంటనే గంగమ్మమీద పౌరుషం వచ్చింది. చచ్చినా యింటికి వెళ్ళకూడదనుకున్నాడు.

ఇంతలో ఆరుగురు దొంగలు ఎక్కడో దొంగతనంచేసి, ఒక పెద్ద భోషాణం మోసుకొని శ్మశానం చేరుకున్నారు.

చీకట్లో భోషాణాన్ని మోసుకు వస్తున్న దొంగల్ని చూసి యమదూతలు వస్తున్నారని, చంగయ్య చాలా సంబరపడ్డాడు.

దొంగలలా వస్తూ వస్తూండగా అందులో ఒకడు చూడకుండా



చంగయ్య నెత్తిపై కాలువేసి తొక్కేశాడు.

చంగయ్యకు బాధపుట్టి "చంపేశావ్రోయ్! కళ్ళు కనిపించడం లేదట్రా! అయినా యింత చీకటి పడేవరకు ఏం చేస్తున్నారని! వెలుగుండగా, వస్తే మీ సొమ్మేం పోయింది!... నేను చచ్చిపోయి చాలా సేపైందిగా!" అన్నాడు గట్టిగా.

ఈ మాటలు వినేటప్పటికి దొంగల గుండె ఝల్లుమంది! వళ్లు కంపరమెత్తింది... ఇదేదో శాకినీ, ఢాకినీ, భూత ప్రేత, పిశాచాలకు సంబంధించినదై వుంటుందని, 'ఒరేయ్! పరుగుచ్చుకోండిరా! బతికుంటే బలుసాకు తిందాం!' అనుకుంటూ, ఆ భోషాణాన్ని అక్కడే జారవిడిచి, వెనక్కు తిరిగి చూడకుండా, చిక్కినదారి పట్టుకొని, పారిపోయారు.

తీసుకుపోడానికి వచ్చినట్టే వచ్చి యమదూతలు ఎందుకు పారిపోయారో చంగయ్యకు అర్థంగాలేదు!

గోతిలో కూర్చొని చాలాసేపు నిరీక్షించాడు. ఆఖరికి విసుగుపుట్టి, మట్టి పెళ్లగించుకొని, లేచి వచ్చి చుట్టూ కలయచూశాడు. అతనికి భోషాణం కనిపించింది. మెల్లగా దగ్గరకు వెళ్ళి మూతతీసి చూశాడు. అందులో నగలూ, వెండిసామానూ, వివిధ వస్తు సముదాయం చాలా వుంది.

చంగయ్య తీవ్రంగా తన తెలివితేటలు ఉపయోగించి ఆలోచించగా తేలిన సారాంశమేమంటే, "తను ఎలాగూ చచ్చిపోతాడు! అప్పుడు తన భార్యకు దిక్కెవరు? కనుక ఆవిడ బ్రతుకు తెరువు కోసం యముళ్లు యీ ధనం పంపించారు!" అని.

వెంటనే పెట్టె, అతి ప్రయాస మీద నెత్తికెక్కించుకొని ఇంటికి బయలుదేరాడు.

గంగమ్మ హాయిగా గుర్రుపెట్టి నిద్రపోతూవుంది. చంగయ్య తలుపు తట్టగానే, వులిక్కిపడి లేచి తలుపు తీసి అతగాడ్ని చూసి ఆశ్చర్యపోయింది. ఎక్కడో పడుకొని తెల్లారి లేచి చక్కా వస్తాడని అనుకుంది కాని, నెత్తిమీద భోషాణం చూసి, ఎక్కడైనా దొంగతనం చేశాడేమోనని భయపడి పోయింది.

చంగయ్యే మొదలు పెట్టాడు: "ఇదిగో! నిన్నే! ఈ నగలూ, అవీ భద్రంగా దాచుకో! యములాళ్ళు నీకు పంపించారు! రేపు రాత్రికి వచ్చి నన్ను తీసుకు వెళ్తారట. నేను వాళ్ళతో మాట్లాడొస్తే!" పెద్ద బొంకు బొంకేశాడు.

★ వెఱ్ఱి గొల్లడు ★

నగలుచూసి, గంగమ్మ వుక్కిరిబిక్కిరయింది. అప్పుడు చంగయ్య పెద్ద వీరాధివీరుడులా కనిపించాడు. గంగమ్మకు చంగయ్య మీద ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చింది.

నగలూ, నాణ్యాలూ ఆడవారికి చేదుగనకా!-భద్రంగా దాచుకుంది.

"రేపురాత్రి వల్లకాటికి వెళ్లను! వెధవలు (యమదూతలు) కళ్ళు మూసుకొని, ఎద్దుల్లా తొక్కుతూ పోతారు. ఈ భోషాణంలో ముడుచుకు పడుకుంటాను అందరికీ కనిపించేటట్టు వుంచు! యమదూతలు వచ్చి తీసుకుపోతారు! వాళ్ళభోషాణం వాళ్ళకు గుర్తేలే!" అన్నాడు.

"ఇప్పుడు కావలసినంత ధనముంది! సుఖంగా కాలం వెళ్ళబుచ్చవచ్చు! ఇంకా చస్తానంటావేం! యముడూ లేడు...దూతలూ లేరు!" అన్నది.

"ఛా! అలా అనకు! వాళ్ళకు తెలిసిందంటే నిన్నుకూడ చంపేస్తారు! నేనెలాగూ చచ్చిపోతాను. చస్తానంటే చచ్చితీరుతాను!"

"సరే! నీ పిచ్చి నీది! ఎలాగో చావు!" అన్నది గంగమ్మ

మర్నాడు మధ్యాహ్నం భోంచేసిన వెంటనే, చంగయ్య పెట్టెలో దూరి పడుకున్నాడు. గంగమ్మ, పెట్టె బైట అందరికీ కనిపించేటట్టు పెట్టింది.

దొంగలు వుదయం శ్మశానానికి వచ్చి చూశారు. భోషాణం లేదు. ఎక్కడో యీవూరి వూరిపాకల్లోని వాళ్లే దొంగిలించి వుంటారని, నిశ్చయించుకున్నారు. మధ్యాహ్నం మారువేషాల్లో వూరు వూరంతా ప్రతిమూల గాలించారు. ఆఖరికి చంగయ్య యింట్లో, భోషాణం కనిపించింది. ఇకనేం, సంతోషంగా వెళ్ళిపోయారు!

అర్థరాత్రి దొంగ లారుగురూ వచ్చారు! గంగమ్మ గాఢంగా నిద్రపోయింది. భోషాణం ఎత్తి చూశారు, బరువుగా వుంది! అటు ముగ్గురూ, యిటు ముగ్గురూ ఎత్తి పట్టుకొని, మోసుకుపోతున్నారు.

లోనపడుకున్న చంగయ్య కుదుపుకు వులిక్కిపడి లేచాడు. యములాళ్ళు తీసుకుపోతున్నారని చాలా సంబరపడ్డాడు.

అలా తీసుకువెళ్తుండగా, దొంగలకు ఒక చెరువుగట్టు అడ్డువచ్చింది! దొంగలు ఆ గట్టు ఎక్కారు! అలా ఎక్కడంలో ఎగుడు దిగుడు కావటంవల్ల, లోన కూర్చున్న చంగయ్య తల చెక్కకు తక్కున కొట్టుకుంది.

'ఇదేమిటి చప్మా! ఇంతవరకూ బాగానే తెచ్చారు! ఇప్పుడు తలకు దెబ్బతగిలింది! బరువు మోయలేక యములాళ్ళు చేతులు మార్చుకున్నారేమో!' అనుకొని, బుర్రలోనికి ఒక చిన్న సందేహం దూరితే వుండబట్టలేక "అయితే యములాళ్లూ! నాకు తెలియకడుగుతాను! మాలోలాగ, మీలో కూడ పొట్టీ పొడుగూ వుంటారా! అహాఁ...వూరికే అడుగుతున్నాన్లే!" అనేశాడు.

పెట్టెలోనుంచి అకస్మాత్తుగా, అనుకోకుండా మాటలు వినిపించేసరికి దొంగలకు పైప్రాణాలు పైనే పోయినై!

"ఒరేయ్! యీ వెధవ దెయ్యం మనల్ని వదిలేటట్టు లేదు! చెరువులో పారేయండి!' అంటూ, దొంగలారుగురూ, పెట్టె నెత్తి చెరువులోనికి విసిరిపారేసి, పారిపోయారు.

కొక్కెం పెట్టి వుండడంవల్ల చంగయ్యకు...బయటకు రావడానికి వీల్లేక, పెట్టెలోకి నీళ్ళుపోయి... పాపం పిచ్చి చంగయ్య పరలోకానికి, ప్రయాణం కట్టాడు! ★

★ సూయజ్‌పై యుద్ధమేఘాలు ★

(4 వ పేజీ తరువాయి)

ఈజిప్టు టర్కీ (కింద వుండేది) కాలువను ఉపయోగించుకునే స్వాతంత్ర్యం సంతకాలు చేసిన రాజ్యాలన్నిటికి ఉన్నది. కాలువకు భూస్వామి టర్కీ.

కాలు గడువు తీరిన తర్వాత కూడా ఒప్పందం మరతులు చెల్లాలనే సరతు ఒకటి వున్నప్పటికీ, 1908 లో బ్రిటిష్ ప్రభుత్వం 99 ఏళ్ల ఒప్పందాన్ని మరొక 40 ఏళ్ళు పొడిగించడానికి ప్రయత్నించగా, అందుకు ఈజిప్టు ఇష్టపడనందువల్ల ఆ ప్రయత్నం ఫలించలేదు. 1968 తో ఒప్పందం తీరిపోవడానికి బ్రిటన్ 1908 లోనే ఇష్టపడ్డదన్న మాట.

ఈ వాదోపవాదాల ఫలితంగా సూయజ్ రభస చివరకు ఏవిధంగా పరిణమిస్తుందన్నదే ప్రశ్న. మొత్తం మీద సూయజ్‌పై యుద్ధమేఘాలు దట్టంగానే ఆవరిస్తున్నవి. ఈ మేఘాలు ఉత్తుత్తి ఉరుములు మెరుపులే అవుతవో, మరొక ప్రపంచ ప్రళయానికే దారితీస్తవో త్వరలో తేలిపోవచ్చు.

లండన్‌లో జరిగే అంతర్జాతీయ సమావేశానికి ఈజిప్టు హాజరు కాదని స్పష్టపడుతున్నది. ఈజిప్టు రాకపోతే, తానూ రానంటున్నది రష్యా. ఈ రెండు రాజ్యాలూ వెళ్ళకపోతే, భారతదేశం కూడా పాల్గొంటుందో లేదో చెప్పలేము. బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు విదేశాంగ మంత్రులు పంపిన ఆహ్వానంపట్ల భారతప్రభుత్వం తన వైఖరి త్వరలో విశదీకరిస్తుంది.

అంతర్జాతీయ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నదే భారతప్రభుత్వ లక్ష్యం. పంచశీల ప్రాతిపదికపై వివిధ రాజ్యాలమధ్య శాంతియుత సహజీవన విధానాన్ని పెంపొందజేయడానికి ప్రయత్నిస్తున్నది భారతదేశం. లండన్‌లో 24 రాజ్యాల సమావేశం ఇందుకు దోహదం చేస్తుందన్న విశ్వాసంవుంటే భారతదేశం పాల్గొంటుంది. ముందుగా ఏవేవో సైనిక నిర్ణయాలు చేసుకొని, వాటిని 24 దేశాలూ ఆమోదించేటు చేయాలనిచూస్తే మాత్రం హాజరు కాదు. ఈజిప్టు సూయజ్ కంపెనీని స్వాధీన పరుచుకున్నట్లు ప్రకటించగానే బ్రిటన్, ఫ్రాన్సులు ప్రతీకారంగా కొన్ని నిర్ణయాలు అమలుపరిచినవి. ఈ పరిస్థితులలో లండన్ సమావేశంవల్ల ప్రయోజనం ఎంతవరకు వుంటుందన్నది అనుమానాస్పదమైన విషయం. మొన్న ఆగస్టు 5న కాంగ్రెసు అధిష్ఠానవర్గ సమావేశంలో సూయజ్ వ్యవహారాన్ని గురించి ప్రధాని నెహ్రూ ముచ్చటించారు. లండన్ సమావేశ లక్ష్యాలేమిటో అందులో భారతదేశం నిర్వహించగల పాత్రఏమిటో సవివరంగా తెలియజేయవలసిందని బ్రిటన్‌ను కోరినట్లు తెలుస్తున్నది. బ్రిటన్‌పంపే సమాధానాన్ని బట్టిగాని భారతప్రభుత్వ నిర్ణయమేదో తెలియదు. లండన్ ఆహ్వానాన్ని పాకిస్తాన్, టర్కీ, జపాన్‌లు ఆమోదించినవి; అంతమాత్రాన భారతదేశం ఆమోదించలేదనే అంశం సుస్పష్టమే.

ఎవరెంతగా వాదించినా సూయజ్ కంపెనీని జాతీయంచేసి స్వాధీనపరుచుకునే హక్కు ఈజిప్టుకు లేదనిగాని, సూయజ్ కాలువ అజమాయిషీని ఈజిప్టు సక్రమంగా నిర్వహించలేదనిగాని చెప్పలేకపోతున్నారు. హక్కు వున్నదని గుర్తించి నప్పుడు, దాన్ని శాంతియుతంగా అమలు జరిపే విషయం పరిశీలించడానికి ఎన్ని సమాలోచనలైనా జరుపుకోవచ్చు. మధ్యధరాసముద్రం, సూయజ్ కాలువ బ్రిటిష్ వాణిజ్యానికి ఆయువుపట్టు. సూయజ్‌ను ఈజిప్టు తీసివేసుకుంటే జిబ్రాల్టర్ దుర్గం తమకే చెందాలని స్పెయిన్ ఆందోళన చేస్తున్నది. లండన్‌లో సమావేశం జరగడమంటూ వుంటే, పెనామా కాలువ ప్రసక్తి, జిబ్రాల్టర్ దుర్గం ప్రసక్తీ వచ్చితీరుతవి. సూయజ్ విషయంలో తొందరపడి ఈజిప్టుతో సంఘర్షణకు దిగినట్లయితే అందుకు బాధ్యత పూర్తిగా బ్రిటన్ ఫ్రాన్సులదే అవుతుంది. కామన్వెల్తు ముసుగడకే ముప్పు ఏర్పడుతుంది. ★

"అణుశక్తి ఉత్పాదక యంత్రం మొదటిసారిగా భారతదేశంలో పని ప్రారంభించినందుకు నాకు సంతోషంగా ఉన్నది. ఇది మనకు అతిముఖ్యమైన సంఘటన. గడిచిన కొన్ని దినాలలో రాత్రింబగళ్ళు మీరూ, మీ సహోద్యోగులూ ఎంత కష్టపడి పనిచేశారో నాకు తెలుసు. అలా పనిచేసినవారందరికీ నా అభినందనలు తెలియజేయండి."

బొంబాయివద్ద ట్రాంబేలో ఈనెల 4 వ తేదీ మధ్యాహ్నం 3-45 గంటలకు అణుశక్తి ఉత్పాదకయంత్రం పని ప్రారంభించిందనే వార్త వినగానే భారత ప్రధాని, అణుశక్తి శాఖ మంత్రియైన శ్రీ నెహ్రూ పైసందేశం పంపించారు. అణుశక్తి సంఘాధ్యక్షులు డైరెక్టర్ డా॥ హెచ్. జె. భాభా సందేశం అందుకున్నారు.

అణువునుండి ఉత్పన్నమయ్యే బ్రహ్మాండమైన శక్తిని విధ్వంసనానికి కాక ప్రజాజీవన ప్రయోజనాలకు వినియోగించి నాగరికత స్వరూపాన్నే మార్చి వేయడానికి వీలుందని గ్రహించి, అందుకు ముందంజ వేసిన దేశాల్లో మనదేశం ఒకటి. ఇప్పుడు ఈ ఉత్పాదక యంత్రంద్వారా అణుశక్తిని ఉత్పాదనచేయడం ప్రారంభించిన ఘనత ఆసియా దేశాలలోకల్లా మన దేశానికే దక్కింది. భారీఎత్తున ఈ అణుశక్తిని మనం ఉత్పత్తిచేయడం ప్రారంభించిననాడు, అతిత్వరగా, కారుచౌకగా పారిశ్రామికాభివృద్ధిని, తద్వారా జీవన ప్రమాణాభివృద్ధిని సాధించవీలవుతుంది. ఈఉద్దేశంతోనే మొదటినుంచీ భారత ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని నెహ్రూ అణుశక్తి సంఘంమీద ప్రత్యేక శ్రద్ధవహించి పనిచేయడం జరిగింది. తత్ఫలితంగా, ఈనాటికి ఇంత త్వరలో భారతదేశానికి అణుశక్తి ఉత్పాదక యంత్రం సమకూరడం జరిగింది.

అమెరికా, కెనడా, బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా మరికొన్ని యూరపియన్ దేశాలకీ తప్ప మరేదేశానికీ అణుశక్తి యంత్రాలు లేవు. ఆ దేశాలలో కూడా, మిగతా పరిశ్రమలు బాగా అభివృద్ధి అయి ఉండడంచేత అణుశక్తి యంత్రానికి కావలసినఅనేక పరికరాలు సునాయాసంగా లభ్యమై యంత్రనిర్మాణం తేలికగా జరిగిపోయింది.

భారతదేశంలో అణుశక్తి ఉత్పాదన

అనేక ముఖ్యపరిశ్రమలలో వెనుకబడి ఉన్న భారతదేశం అణుయంత్ర నిర్మాణానికి బోలెడు ఇబ్బందులు ఎదుర్కొని, ఉన్న సాంకేతిక సంపద మీదనే ఆధారపడి పని సాగించవలసి వచ్చింది. అయినప్పటికీ మిగతా ఆసియా దేశాలన్నిటికంటె ముందుగాను, త్వరితం గాను యంత్రాన్ని సమకూర్చుకో గలిగినదంటే మన శాస్త్రజ్ఞుల ఉత్సాహమూ, నిర్విరామకృషి అందుకు కారణం. ఇది గుర్తించి భారత ప్రధాని హర్షాతిశయం వెల్లడించారు.

యంత్రం నిర్మించాలని గత సంవత్సరం మార్చిలో అణుశక్తి సంఘం నిర్ణయించింది. యంత్ర స్వరూపాన్ని గత సంవత్సరం జూలైనాటికి నిర్ణయించారు. అప్పటినుంచీ సుమారు యాభైమంది శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు కలిసి యంత్రం నిర్మించారు. దీన్ని ప్రయోగాత్మక ప్రయోజనాలకు వినియోగిస్తారు. 25 నుండి 30 లక్షల రూ॥ వరకూ వ్యయం అయ్యే ఈయంత్రం రేడియో ఐసోటోపులు తయారు చేస్తుంది. ఇటువంటి యంత్రాలు వచ్చే పదేళ్ళలో ఇంకా అనేకం తయారై దేశమంతటా అణుశక్తి కేంద్రాలు ఏర్పడి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసాయి. లక్ష కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగల కేంద్రం నిర్మించడానికి రూ. 20 కోట్లు అవుతుంది.

ఇప్పుడు నిర్మించిన అణుయంత్రాన్ని టెక్నికల్ నిపుణులను తరిఫీదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తారు. ఈ నిపుణులు తరిఫీదు అయ్యాక వారి సాయంతో ఇంకా పెద్దయంత్రాలు నిర్మిస్తారు. ★

ఆకూ, వక్కా

(42-వ పేజీ తరువాయి)

సుగంధ ద్రవ్యాలను బట్టి మారుతుంటుంది. కస్తూరి, వెండిరేకులు గిరాకినిబట్టి వేస్తుంటారు. కిళ్లీ కట్టడంలో అక్కడ పోటీ చాల ఎక్కువ 'ఛాలెంజి కిళ్లీలు' తయారయి నయ్యి అక్కడ.

మద్రాసుబీడాలో గట్టిపదార్థం ఎక్కడా కన్పించదు. వాళ్ల పళ్ళ గట్టిదనానికి ఇది ఒక సూచిక అనవచ్చునేమో!

తమలపాకులు వేయడంలోనే ఒక సొగసువుంది. మదరాసులో 'కవటాకులు' దొరకటం కష్టం. అవి లేకపోయినా వాళ్ళు పట్టించుకోరు, వాళ్లకు కావాల్సింది 'వెత్తల్ పాక్' మాత్రమే. సున్నితాలతో పనిలేదు. మరి తెలుగుదేశంలో నవనవలాడుతున్న చక్కటి కవటాకులేందే ఆకు ముట్టరు. ఊపిరాడకుండా ఆకులను బంధించి అప్పుడప్పుడు తినటం తెలుగువారికి అలవాటు లేదు. కానీ ఖర్చుఅయినా తాజాసరుకు కావాల్సిందే! అదే అరవవారికీ తెలుగువారికీ వున్న తేడా! వారిలో పొదుపుతనం వుంది.

చిలకలు చుట్టటం, ఈనెలు తీయటం తమిళులకు తెలియదనే చెప్పాలి. తమలపాకులు తింటంలో వారికి తెలిసిన సున్నితం తొడిమ తుంచటంమాత్రమే! ఆకుచివర తుంచడం కూడ బహు కొద్దిమంది మాత్రమే!

తీరికగా ఈనెలుతీసి, సున్నంరాచి, చిలకలు చుట్టుకుంటూ తాంబూలం సేవించడం తెలుగువాడికే చెలు.

మసాలా, జర్దాకిళ్లీలు వ్యక్తులకు కావలసిన 'నిషా' ను బట్టి మోతాదు మారుతూ వుంటుంది. రోడ్ల ప్రక్కన వాళ్ళు వదిలేరంగు ఉమ్మి అసహ్యంగా వుంటుంది. బుగ్గన ఇంత తమ్మ ఉంచుకున్న వాళ్ళను చూస్తే సామాన్యులకు కొంత చిరాకుగా వుంటుంది.

రోడ్లమీద తమ తమ పనులలో నిమగ్నమై నడుస్తుండే జవాన్ని గమనించకుండా ఏబస్సులో పోతుండే 'జర్దాసేవకుడో' గుప్పుక్కుమని ఉమ్మేస్తాడు. ఆయన మీద ఉమ్మేసయ్యాలనిగాదు కాని తన దాహం తీర్చుకోవాలని. ప్రయోజనం ఏమిటి, ఆయన తెల్లని గుడ్డలపై చిరస్థాయిగా మరకలు పడినై. అవి ఒక పట్టాన పోవు.


ఈ జర్దాకిళ్లీలు వేసేవారికి వాటకం కొంత నవ్వు కలిగిస్తుంది బుగనిండా జర్దాతంబ, నోటనిండా జర్దాఉమ్మి వుండి మాట్లాడుతుండేవారు నిజంగా ప్రమాదం. అది సమయానికి వుమ్మివేయటానికి వీలులేక మాటాడవలసిన అవసరం వచ్చినప్పుడు తల పైకెత్తి ఏదో మాట్లాడుదామని ప్రయత్నిస్తారు. కాని నోట్లోనుంచి మాటలకంటె ముందు ఉమ్మి బయటకు వచ్చి ఎదురుగా వున్న వాని ముఖంమీద పడుతుంది వాన తుంపరల మాదిరిగా!

అలాంటి వాళ్లను ఒక కంట కనిపెట్టి వుండటం అవసరం! ఆత్మ సంరక్షణార్థం. ★



ఎస్ట్రెల్లా బ్యాటరీస్ లిమిటెడ్ డైరక్టరు శ్రీ చునీలాల్ గిరిధర్ లాల్, ఆయన సతి శ్రీమతి విద్యాగౌరి, జనరల్ మేనేజరు శ్రీ హెచ్. ఎన్. దోషి ఇటీవల బ్రిటన్, యూరప్, అమెరికాలలో వ్యాపార నిమిత్తం పర్యటించి బొంబాయి తిరిగి వచ్చారు.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



"ఔను. నిజం! ఒట్టు!"

ఫోటో: కె. రామలింగేశ్వరరావు.